www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బోనమెత్తిన భాగ్యనగరం

హైదరాబాద్‌లో వైభవంగా బోనాల వేడుకలు 14

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

2,783 ఆలయాల్లో బోనాలకు 20కోట్లు: భట్టి


పాతబస్తీలోని లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారి ఆలయం వద్ద భక్తజనం

సోమవారం | 21-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 113 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి ఉ.9.39 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రోహిణి రా.9.07 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.1.42-3.11, రా.2.19-3.48, దుర్ముహూర్తం: ఉ.12.47-1.38, ఉ.3.22-4.13, అమృతఘడియలు: సా.6.09-7.38, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.54, సూర్యాస్తమయం: 6.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అసెంబ్లీలో ఫోన్లో పేకాట ఆడిన మంత్రి



రైతు సమస్యలపై చర్చ జరుగుతుండగా మహారాష్ట్ర వ్యవసాయ మంత్రి కొకాటే నిర్వాకం

వీడియో తీసి, ఎక్స్‌లో పెట్టిన ఎన్సీపీ ఎమ్మెల్యే

ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని విపక్షాల డిమాండ్ 2

వధూవరులు

ఒకే యువతిని పెళ్లాడిన అన్నదమ్ములు!

ప్రదీప్ నేగి ప్రభుత్వ ఉద్యోగి, విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న తమ్ముడు కపిల్ నేగి

హట్టి తెగలో కుటుంబాలు కలిసికట్టుగా ఉండేందుకే ఈ సంప్రదాయం 2

హిమాచల్‌ప్రదేశ్‌లో దశాబ్దాలుగా పాటింపు



ట్రాఫిక్ ఉల్లంఘనులకు రెట్టింపు జరిమానా!


వాహనాల్లో పిల్లలతో వెళ్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే బాదుడే 2

కేంద్ర చట్టంలో కొత్త ప్రతిపాదనలు

మెరిట్, డీమెరిట్ పాయింట్లు ఇచ్చే యోచన

పాయింట్ల ఆధారంగా వాహన బీమా ప్రీమియంలో హెచ్చుతగ్గులు

ఆర్ ఆర్ ఆర్ పక్కనే రైలు!



ఇప్పటివరకు రింగు రోడ్డుకు 4-5 కిలోమీటర్ల దూరంలో రైల్వే మార్గం నిర్మాణానికి సర్వే

రెండూ పక్కపక్కనే నిర్మిస్తే మేలనే నిర్ణయానికి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

భూసేకరణ ఇబ్బంది తప్పడంతోపాటు రవాణా, ప్రయాణాలకు అనుకూలం.. మళ్లీ కొత్తగా సర్వే!

ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు.. ఆ రోడ్డు పక్కనే హైస్పీడ్ రైలు

రోడ్డు, రైలు మార్గాలకు కలిపే భూసేకరణ.. ఢిల్లీలో కీలక చర్చ.. కేంద్రం పచ్చజెండా!

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రీజినల్ రింగురోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు సమాంతరంగా ప్రతిపాదించిన రైలు మార్గంలో మార్పు జరగనుంది. రీజినల్ రింగు రైలుగా పిలుస్తున్న ఈ మార్గాన్ని.. రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా నాలుగైదు కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని గతంలో నిర్ణయించారు. కానీ రోడ్డు పక్కనే రైల్వే మార్గం నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా నిర్ణయించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవల సీఎం ఢిల్లీ పర్యటనలో దీనిపై చర్చ జరిగిందని, కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చిందని తెలిసింది. ఇప్పటికే జరుగుతున్న సర్వే ప్రకారం.. రీజినల్ రింగు రోడ్డుకు, రైలు మార్గానికి మధ్య సుమారు 4-5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు, రైలు మార్గాలు రెండూ ఒకే జిల్లాలు, ప్రాంతాల మీదుగా వెళతాయి. ఈ క్రమంలో రెండింటి కోసం వేర్వేరు చోట్ల భూసేకరణ చేయడం ఇబ్బందికరంగా మారుతుందని, ప్రజలకూ సమస్యేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. వాటిని పక్కపక్కనే నిర్మిస్తే భూసేకరణ ఇబ్బంది తగ్గుతుందని, సరుకు రవాణాకు, ప్రజల ప్రయాణాలకు సులువుగా ఉంటుందని భావిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే రెండింటినీ పక్కపక్కనే నిర్మించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

అమరావతికి హైస్పీడ్ రైలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు..

ఉమ్మడి ఏపీ విభజన చట్టంలో హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు (పాత రహదారులను వాడకుండా పూర్తిగా కొత్త అలైన్‌మెంట్‌తో నిర్మించే రోడ్డు) నిర్మాణానికి హామీ ఉంది. ఈ క్రమంలో ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను, ఇదే ప్రాంతంలో నిర్మించాలని భావిస్తున్న డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం పోర్టు వరకు కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని

మిగతా 12వ పేజీలో...



కడుపు 'కోత'ల్లో టాప్

- రాష్ట్రంలో 58% సిజేరియన్ ప్రసవాలే..
- దేశంలో తెలంగాణదే మొదటి స్థానం
- ప్రైవేటులో 73%, సర్కారీలో 48%
- రాష్ట్రంలో ప్రతిగంటకు 27సిజేరియన్లు
- 25 జిల్లాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో 80-90 శాతం శస్త్రచికిత్స కాన్పులే
- 8 జిల్లాల్లోని సర్కారీ ఆస్పత్రుల్లో 70%
- వైద్య శాఖ తాజా నివేదికలో వెల్లడి

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): "ఇప్పుడు సిజేరియన్ అంటే షాక్ అవుతున్నావు కదూ..! మార్క్ మై వర్డ్స్. ఇంకో 30 ఏళ్ల తర్వాత నార్మల్ డెలివరీ అంటే అంతా షాక్ అవుతారు"... ఇది 'అదిరింది' అనే సినిమాలో ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎండీ పాత్రలో ఎస్.జే.సూర్య మరో డాక్టర్‌తో చెప్పే డైలాగ్. అదే సీన్ ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తోంది. భవిష్యత్తులో సాధారణ ప్రసవం అయిందంటే అద్భుతం జరిగిందనే మాటలు వినిపించినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు. రాష్ట్రంలో సహజ ప్రసవాలు తగ్గుతున్నాయి. ఏటికేడు 'కడుపు కోతలు' పెరిగిపోతున్నాయి. దేశంలోనే సిజేరియన్ ప్రసవాల్లో

మిగతా 12వ పేజీలో...

రాహుల్‌తో కలిసి ప్రధాని వద్దకు!

బీసీ రిజర్వేషన్ల పెంపునకు సహకరించాలని మోదీని కోరనున్న సీఎం రేవంత్

- మోదీ అపాయింట్‌మెంట్ కోసం యత్నం
- బీసీ బిల్లుల అంశంపై పార్లమెంటులో చర్చ కోసం పట్టుబట్టాలని నిర్ణయం
- రిజర్వేషన్ల పెంపుపై ఇండియా కూటమి ఎంపీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- ఇందుకోసం రెండు, మూడు రోజులు ఢిల్లీలోనే ఉండనున్న ముఖ్యమంత్రి
- కార్యాచరణపై భట్టి, ఉత్తమ్‌లతో భేటీ
- బీసీ బిల్లులతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వనరుల సమీకరణపైనా చర్చ



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సహకరించాలని ప్రధాని మోదీని కోరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతో కలిసి వెళ్లి మోదీతో భేటీ అయ్యే అవకాశం ఉందని, ఈ మేరకు ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని సమాచారం. తెలంగాణలో చేపట్టిన కులగణన, అందులో వెల్లడైన వివరాలు, అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారని తెలిసింది. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నట్టు సమాచారం. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై

మిగతా 13వ పేజీలో...

హనుమకొండలో అంతర్జాతీయ స్థాయి

క్రికెట్ స్టేడియం!

అనుబంధంగా క్రీడా పాఠశాల కూడా.. 13

వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

'వరంగల్' ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై స్పందన

రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి!

గాయకుడికి నగదు పురస్కారాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


ధ్వంసమైన పోలీసు వాహనం

పోలీసులపై ముల్తానీల రాళ్ల దాడి

పోడు భూముల్లో మొక్కలు నాటేందుకు వెళ్లిన అటవీ అధికారులు

పంట భూముల జోలికి రావద్దంటూ ముల్తానీ మహిళల తిరుగుబాటు 3

ఇద్దరు ఎస్సైలు సహా 8 మందికి గాయాలు

ఆదిలాబాద్ జిల్లా సిరిచెల్మలో ఘటన

ప్రతి నెలా రూ.50-60 కోట్లు!

ఏపీ మద్యం స్కాంలో జగన్‌కు ముడుపులు

కసిరెడ్డి ఆధ్వర్యంలో 3,500 కోట్ల వరకు కమీషన్లు వసూలు

కసిరెడ్డి నుంచి సాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, గోవిందప్పలకు!

వారి ద్వారా నాటి ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు చేరవేత

మద్యం స్కాం చార్జిషీటులో బట్టబయలు చేసిన సిట్

ముడుపుల మళ్లింపునకు రకరకాల పద్ధతులు

డిస్టిలరీల ఖాతాల నుంచి బంగారం వ్యాపారులకు బదిలీ

తర్వాత బంగారం కొన్నట్లుగా జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు

నిందితులకు బంగారం రూపంలో కమీషన్లు

హవాలా ద్వారా షెల్ కంపెనీలకూ సొమ్ముల మళ్లింపు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేశంలోనే అతిపెద్దదైన మద్యం కుంభకోణం కేసులో.. ముడుపుల అంతిమ లబ్ధిదారు అప్పటి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగనేనని సిట్ తేల్చింది. ఏ కంపెనీ ఎంతెంత కమీషన్ ఇవ్వాలి.. ఎవరికి ఎక్కడ చెల్లించాలో ఎవరు నిర్ణయించారో కూడా వెల్లడించింది. ముడుపులు ఏయే రూపాల్లో అందాయో కూడా కోర్టుకు సమర్పించిన చార్జిషీటులో తెలియజేసింది. డిస్టిలరీలను భయపెట్టి మొదట 12 శాతం ముడుపులకు ఒప్పించారు. ఆ తర్వాత 20 శాతానికి పెంచేశారు. ఆ మొత్తం.. డిస్టిలరీలు, సరఫరాదారుల నుంచి కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (ఏ-1)కి అందేది. అది అతడి నుంచి నాటి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి(ఏ-5), మరో ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ-4), భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప(ఏ-33)లకు వచ్చేది. ఆ ముడుపులను వారు అప్పటి ఏపీ సీఎం జగన్‌కు ముట్టజెప్పినట్లు సిట్ స్పష్టం చేసింది. నెలకు రూ.50-60 కోట్ల దాకా ఆయనకు అందాయని.. ఎన్నికల ఖర్చుకూ రూ.250-300 కోట్లు

మిగతా 3వ పేజీలో...

జైలుకు మిథున్‌రెడ్డి

1వ తేదీ వరకు రిమాండ్

విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

రాజమహేంద్రవరం జైలుకు 3

ట్రంప్ మెడకు లొలిటా ఎక్స్‌ప్రెస్ ల్లొల్లి

బాలికలపై లైంగికదాడులకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ విమానమది

అందులో ఎప్‌స్టీన్ సొంత దీవికి మైనర్ల అక్రమ రవాణా

ఆ విమానం ఎక్కినవారి జాబితాలో ట్రంప్, బిల్ క్లింటన్ పేర్లు

ట్రంప్, ఎప్‌స్టీన్ సంబంధాలపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం



న్యూఢిల్లీ, జూలై 20: హైస్కూలు దశ కూడా దాటని బాలికలతో తాను కామవాంఛలు తీర్చుకోవడమే కాక.. ప్రపంచ ప్రముఖులైన వ్యాపార, రాజకీయ దిగ్గజాలకు, సంపన్నులకు వారిని ఎరగా వేసిన వికృత మనస్కుడు జెఫ్రీ ఎప్‌స్టీన్! అలాంటి వ్యక్తితో ట్రంప్ సంబంధాలపై అమెరికా అట్టుడుకుతోంది. ఎప్‌స్టీన్ తన సొంతవిమానంలో హైప్రొఫైల్ వీవీఐపీలను, బాలికలను.. తన సొంత దీవికి

మిగతా 2వ పేజీలో...



అభిశంసనకు సిద్ధం

జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించాలన్న తీర్మానం..

నోటీసుపై 100 మందికి పైగా ఎంపీల సంతకాలు

రిజిజు అధ్యక్షతన అఖిలపక్ష భేటీ.. నేటి నుంచి పార్లమెంటు

8 ప్రధాన అంశాలపై నిలదీస్తామని ప్రతిపక్షాల ప్రకటన

తానే యుద్ధం ఆపానన్న ట్రంప్ ప్రకటనపైనా సభలో చర్చ

న్యూఢిల్లీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన జస్టిస్ యశ్వంత్ వర్మను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు అంతా సిద్ధమైంది. జస్టిస్ వర్మపై మహాభియోగ తీర్మానం ప్రవేశపెట్టే విషయంలో అన్ని పార్టీలు కలిసి నిర్ణయం తీసుకుంటాయని, కేవలం ప్రభుత్వమే నిర్ణయాన్ని వెల్లడించబోదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసుపై ఇప్పటికే 100 మందికిపైగా ఎంపీలు

మిగతా 2వ పేజీలో...

భారత్ అమ్ములపొదిలో కొత్త బ్రహ్మాస్త్రం..

కే-6 క్షిపణి



జలాంతర్గామి నుంచి ప్రయోగించగలిగే న్యూక్లియర్ బాలిస్టిక్ మిస్సైల్

రేంజ్.. 12 వేల కిలోమీటర్ల దాకా!

హైదరాబాద్‌లోని ఏఎన్ఎస్ఎల్‌లో అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో

గంటకు 9,200 కిలోమీటర్ల వేగం

ఈ క్షిపణిని మోసే ఎస్-5 స్ట్రాటజిక్ సబ్‌మెరైన్‌ను తయారుచేస్తున్న శాస్త్రజ్ఞులు

న్యూఢిల్లీ, జూలై 20: దీర్ఘశ్రేణి ఖండాంతర క్షిపణులపై దృష్టి సారించిన భారత్.. కే-6 పేరుతో ఒక క్షిపణిని అభివృద్ధి చేస్తోంది. దాని రేంజ్ 8 వేల కిలోమీటర్లని చెబుతున్నారు. వాస్తవానికి అది 12 వేల కిలోమీటర్ల దాకా ఉంటుందని సమాచారం. ఇది సబ్‌మెరైన్ లాంచ్‌డ్ బాలిస్టిక్

మిగతా 2వ పేజీలో...



అదిరిపోయేలా ఐటమ్మ వర్సిటీ భవనాలు 14

బ్రిటిష్ రెసిడెన్సీ మాదిరిగానే నమూనాలు

'ఆంధ్రజ్యోతి'కి లభించిన ప్రతిపాదిత డిజైన్లు

12 అంతస్తులతో అకడమిక్ భవనం

ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఆడిటోరియం

500కోట్లతో చాకలి ఐలమ్మ వర్సిటీ విస్తరణ

టెండర్లకు ఆహ్వానం.. సెప్టెంబరులో పనులు

వధూ'వరులు'!



» ఒకే యువతిని పెళ్లాడిన అన్నదమ్ములు!

» హిమాచల్‌లో ఓ తెగ సంప్రదాయం

న్యూఢిల్లీ, జూలై 20: ఇద్దరు అన్నదమ్ములు ఒకే యువతిని వివాహమాడారు...! అవును ఇది నిజమే.. అదేమిటి వారేమైనా చదువు సంధ్యలు లేనివారనుకుంటున్నారా? కానే కాదు.. చదువుకుని ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా.. మరొకరు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు. మరి ఎందుకిలా..? హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఓ తెగ సంప్రదాయం ఇది. ఆ రాష్ట్రంలోని సిర్మార్ జిల్లా షిలాయి గ్రామంలో ఈ వివాహం జరిగింది. ఇక్కడ హట్టి తెగకు చెందిన ప్రదీప్ నేగి, కపిల్ నేగి అనే ఇద్దరు అన్నదమ్ములు కున్హత్ గ్రామానికి చెందిన సునీత చౌహాన్ అనే యువతిని తమ తెగ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన వీరి వివాహ కార్యక్రమానికి వందలాది మంది హాజరయ్యారు. ప్రదీప్ హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వ శాఖలో పనిచేస్తుండగా, అతడి తమ్ముడు కపిల్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ వివాహం తమ ఇష్టపూర్వకంగానే చేసుకున్నామని ముగ్గురూ చెప్పడం విశేషం. వీరి వివాహానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రాచుర్యంలోకి వచ్చి చర్చకు దారితీసింది. ఇలా ఒకరు ఇద్దరిని వివాహం చేసుకోవడం భారత్‌లో చట్టవిరుద్ధం అయినా హిమాచల్‌ప్రదేశ్‌లో సిర్మార్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. అలాగే కిన్నౌర్, లాహౌల్ స్పితి జిల్లాల్లో, పొరుగున ఉన్న ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొన్నిచోట్ల ఈ విధానం ఉంది. హట్టి తెగకు చెందినవారు ఇది తమ సంప్రదాయమని చెబుతున్నారు. జోడిదారణ్ లేదా ద్రౌపది ప్రథగా ఈ సంప్రదాయాన్ని వారు పిలుస్తారు. ఇటీవలే ఈ తెగవారికి గిరిజన తెగ(ఎస్టీ) హోదా కూడా వచ్చింది. కాగా, సెంట్రల్ హట్టి కమిటీ న్యాయ సలహాదారు అయిన రణ్‌సింగ్ చౌహాన్ అనే న్యాయవాది మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఈ సంప్రదాయం హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతోందని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు కూడా దీన్ని గుర్తించిందన్నారు.

అసెంబ్లీలో మహారాష్ట్ర మంత్రి ఫోన్‌లో పేకాట

పూణె, జూలై 20: ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే.. ఆ రాష్ట్ర మంత్రి మాత్రం తీరిగ్గా కూర్చొని ఫోన్‌లో గేమ్ ఆడుతూ కన్పించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ఈ ఘటన జరిగింది. ఎన్సీపీ(అజిత్ పవార్)కి చెందిన వ్యవసాయ మంత్రి మాణిక్‌రావ్ కొకాటె.. రైతు సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరుగుతున్న సమయంలో తన ఫోన్‌లో ఆన్‌లైన్ పేకాట ఆడుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ప్రతిపక్ష ఎన్సీపీ(శరద్ పవార్) నేత రోహిత్ పవార్.. తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. "రాష్ట్రంలో రోజుకు సగటున ఎనిమిది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్నో వ్యవసాయ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. బీజేపీని సంప్రదించకుండా ఏమీ చేయలేనందున, మంత్రికి వేరే పని లేకపోవడంతో పేకాడటానికి సమయం దొరికినట్లు కనిపిస్తోంది" అని విమర్శించారు. ఈ ఘటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈ మంత్రి గతంలోనూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, ఆయన ప్రవర్తన ప్రజాస్వామ్యానికే అవమానకరమని శివసేన(యూబీటీ) వర్గం విమర్శించింది.

లోకం తీరు



మొబైల్ ఇంటర్నెట్ వేగంలో యూఏఈదే అగ్రస్థానం

» టాప్-10లో లేని జపాన్.. 26వ స్థానంలో భారత్

న్యూఢిల్లీ, జూలై 20: మొబైల్ ఇంటర్నెట్ వేగంలో యూఏఈ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచింది. సగటున సెకనుకు 546.14 మెగాబిట్స్ (ఎంబీపీఎస్) వేగంతో ఇతర దేశాలను తలదన్ని అగ్రస్థానం సాధించింది. 'హోం బ్రాడ్‌బ్యాండ్' స్పీడ్‌లో సింగపూర్ 393.15 ఎంబీపీఎస్‌తో తొలి స్థానం చేజిక్కించుకుంది. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది జూన్ మధ్య కాలంలోని డాటా ఆధారంగా 'స్పీడ్ టెస్ట్' వెబ్‌సైట్ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇటీవల సెకనుకు 1.02 పెటాబిట్స్‌తో ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసి వార్తలకెక్కిన జపాన్.. ఈ రెండు విభాగాల్లోనూ టాప్ టెన్ జాబితాలో కూడా లేకపోవడం గమనార్హం. అత్యాధునిక ఫైబర్ ఆప్టిక్ పరిజ్ఞానంతో తాము సాధించిన ఈ ఇంటర్నెట్ వేగానికి నెట్‌ఫ్లిక్స్ వీడియోలు అన్నింటినీ రెప్పపాటులో డౌన్‌లోడ్ చేయగల సామర్థ్యం ఉందని జపాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్ మొబైల్ ఇంటర్నెట్ వేగంలో 133.51 ఎంబీపీఎస్‌తో 26వ స్థానంలో, బ్రాడ్‌బ్యాండ్‌లో 59.51 ఎంబీపీఎస్‌తో 98వ స్థానంలో నిలిచింది.

మొబైల్ ఇంటర్నెట్ వేగంలో టాప్-5		బ్రాడ్‌బ్యాండ్ వేగంలో టాప్-5	
1. యూఏఈ	546.14	1. సింగపూర్	393.15
2. ఖతార్	517.44	2. హాంకాంగ్	323.87
3. కువైట్	378.45	3. ఫ్రాన్స్	319.43
4. బహ్రెయిన్	236.77	4. చిలీ	318.84
5. బ్రెజిల్	228.89	5. యూఏఈ	313.90

టాప్ 20లో మన వైద్య కళాశాల ఒక్కటీ లేదు!

» ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల జాబితాలో తెలుగు రాష్ట్రాల కాలేజీలకు దక్కని చోటు

» నేటి నుంచి నీట్ యూజీ కౌన్సెలింగ్

న్యూఢిల్లీ, జూలై 20: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు అత్యుత్తమ వైద్య కళాశాలలను ఎంచుకుంటారు. నీట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తాయి. దేశంలోని అత్యుత్తమ వైద్య కళాశాలలకు నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు ఇస్తుంది. ఎన్ఐఆర్ఎఫ్-2024 ర్యాంకుల జాబితాలో టాప్-20లో తెలుగు రాష్ట్రాల్లోని ఒక్క వైద్య కళాశాల కూడా లేకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఇచ్చిన ఈ ర్యాంకింగ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఏ మెడికల్ కాలేజీకీ చోటు దక్కలేదు. నీట్‌లో తెలుగు విద్యార్థులు సత్తా చాటుతుంటారు. కానీ, ఉత్తమ వైద్య కళాశాలల విషయంలో మాత్రం తెలుగు రాష్ట్రాలు వెనకబడిపోవడం శోచనీయం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో తొలి స్థానం ఢిల్లీ ఎయిమ్స్‌కు దక్కగా.. 20వ స్థానంలో చెన్నైలోని శ్రీరామచంద్ర కళాశాల నిలిచింది. టాప్ 20 వైద్య కళాశాలల్లో అత్యధికంగా తమిళనాడులోనే 6 ఉండడం విశేషం.

దేశంలోని టాప్-10 వైద్య కళాశాలలివే..

1. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్), ఢిల్లీ
2. పీజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(చండీగఢ్)
3. క్రిస్టియన్ మెడికల్ కాలేజీ (సీఎంసీ), వెల్లూరు, తమిళనాడు
4. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్స్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్), బెంగళూరు, కర్ణాటక
5. జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మెర్), పుదుచ్చేరి
6. సంజయ్ గాంధీ పీజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, యూపీ
7. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ), ఉత్తరప్రదేశ్
8. అమృత విశ్వ వైద్య పీఠం, కోయంబత్తూరు, తమిళనాడు
9. కస్తూర్బా మెడికల్ కాలేజీ (కేఎంసీ), మణిపాల్, కర్ణాటక
10. మద్రాస్ మెడికల్ కాలేజీ అండ్ గవర్నమెంట్ హాస్పిటల్, తమిళనాడు

15ఏళ్ల బాలికను కట్టేసి.. పెట్రోల్ పోసి నిప్పు

» ఒడిశాలోని పూరీ జిల్లాలో ముగ్గురు దుండగుల చర్య

» ప్రాణాపాయ స్థితిలో బాధితురాలు.. ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స

పూరీ, జూలై 20: ప్రొఫెసర్ లైంగిక వేధింపులను భరించలేక ఓ విద్యార్థిని ఆత్మాహుతికి పాల్పడిన ఘటన మరువక ముందే ఒడిశాలో మరో దారుణం జరిగింది. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు దుండుగులు పెట్రోల్ పోసి, నిప్పంటించారు. పూరీ జిల్లాలోని బయబర్ గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. 70% కాలిన గాయాలతో సదరు బాలిక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. బాలికకు మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఆమెను భువనేశ్వర్ ఎయిమ్స్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్‌కు విమానంలో తరలించారు. శనివారం ఉదయం బాలిక తమ ఇంటి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్తుండగా ముగ్గురు దుండగులు ఆమెను అడ్డగించారు. కిడ్నాప్ చేసి భార్గవ నది ఒడ్డుకు తీసుకువెళ్లారు. అక్కడ ఆమెను కట్టేసి, ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో భయపడి పారిపోయారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఒడిసాలో సంచలనం సృష్టించింది. ఘటనపై ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ స్పందిస్తూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు.

థరూర్ మాతో లేరు.. కాంగ్రెస్ కార్యక్రమాలకు పిలవం

» తేల్చి చెప్పిన కేపీసీసీ మాజీ అధ్యక్షుడు కె.మురళీధరన్

తిరువనంతపురం, జూలై 20: కాంగ్రెస్ పార్టీ వైఖరికి భిన్నంగా వెళ్తున్న తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌పై కేపీసీసీ మాజీ అధ్యక్షుడు కె.మురళీధరన్ విరుచుకుపడ్డారు. థరూర్ తమతో లేడని, ఇకపై కేరళలో జరిగే కాంగ్రెస్ కార్యక్రమాలకు ఆయన్ను పిలవబోమని స్పష్టం చేశారు. థరూర్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడని, ఆయనపై ఏ చర్యలు తీసుకోవాలనేది అధిష్టానమే నిర్ణయించాలని మురళీధరన్ చెప్పారు. కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా శశిథరూర్ ఉత్తమమంటూ ఇటీవల ఓ సర్వేలో వెల్లడైనప్పుడు కూడా మురళీధరన్ ఘాటుగా స్పందించారు. అసలు థరూర్ ఏ పార్టీలో ఉన్నారో ముందుగా చెప్పాలని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో థరూర్ కేంద్రాన్ని సమర్థించారు. జాతీయ భద్రత విషయంలో పార్టీలకు అతీతంగా స్పందించాలని అన్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్ నేతల విమర్శలు మొదలయ్యాయి.

అభిశంసనకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)


అఖిలపక్ష భేటీకి వెళ్తున్న కేంద్ర మంత్రులు మేఘ్వాల్, నడ్డా,రిజిజు

సంతకాలు చేశారని వెల్లడించారు. ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి 54 పార్టీలు హాజరుకాగా దాదాపు 40 మంది నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారని పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని రాజ్య సభలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. దీనికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు అధ్యక్షత వహించారు. సభ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ప్రతిపక్షాలను అభ్యర్థించారు. ఆపరేషన్ సిందూర్ సహా అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కిరెణ్ రిజిజు మీడియాకు చెప్పారు. సైద్ధాంతిక విభేదాలను పక్కన పెట్టి ఉభయ సభలు సజావుగా జరిగేలా చూడటం అన్ని పార్టీల బాధ్యత అని అన్నారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే సంధి కుదిరేలా చేశానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనపై కూడా ప్రభుత్వం సభలో స్పందిస్తుందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ద్వారా ప్రకటన చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్యటనకు వెళ్లిన రోజుల్లో తప్ప ప్రధాని ఢిల్లీలో ఉంటే పార్లమెంట్ సమావేశానికి తప్పకుండా హాజరవుతారని వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయనకు సంబంధించిన ప్రశ్న ఉంటే మోదీ స్వయంగా సమాధానమిస్తారని తెలిపారు. రాజ్యసభలో బీజేపీ పక్ష నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ప్రభుత్వం తరఫున అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ఎన్సీపీ నేతలు శరద్ పవార్, సుప్రియా సూలే, డీఎంకే నేత టీఆర్ బాలు, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు కృష్ణదేవరాయలు తదితరులు సమావేశానికి హాజరయ్యారు. కాగా, సోమవారం నుంచి ఆగస్టు 21 వరకు జరిగే ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు పన్ను చట్టాల సవరణ బిల్లు, జన విశ్వాస్ సవరణ, ఐఐటీ యాజమాన్య సవరణ, గనుల అభివృద్ధి సవరణ, మణిపూర్ జీఎస్టీ సవరణ బిల్లు, జాతీయ క్రీడా పాలనా బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, భారత రేవుల బిల్లులను ప్రభుత్వం సిద్ధం చేసింది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కుడా ప్రభుత్వం చేపట్టబోయే చర్యలను ఈ సమావేశంలో ప్రకటించే అవకాశాలున్నాయి.

బిహార్ పరిణామాలపై విపక్షాల ఆందోళన

అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు అనేక అంశాలను లేవనెత్తాయి. ఎనిమిది ప్రధాన అంశాలపై వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నామని విపక్షాలు ప్రకటించాయి. ముఖ్యంగా పహల్గామ్ ఘటన, మన దౌత్య విధానం విఫలం కావడం, ట్రంప్ ప్రకటనలు, బిహార్‌లో ఎన్నికల జాబితా సవరణపై ప్రధాని మోదీ స్వయంగా సభకు వివరించాలని బిహార్ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో జూలై 23, 24 తేదీల్లో మోదీ మాల్దీవులు, బ్రిటన్ పర్యటనకు వెళ్లడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరిట జరుగుతున్న తంతుపై అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు ఆందోళన వెలిబుచ్చాయి. దీనిపై ప్రత్యేక చర్చ కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, ఆ అంశం కోర్టు పరిశీలనలో ఉందని ప్రభుత్వం చెప్పినట్లు సమాచారం. బిహార్‌లో పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై ప్రతిపక్షాలు సభను స్తంభింపచేసే అవకాశాలున్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు పూర్తికాకముందే పైలట్లను నిందించేలా తాత్కాలిక నివేదికను బయటపెట్టడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పహల్గామ్ ఘటన, ఆపరేషన్ సిందూర్‌లో ట్రంప్ దౌత్యం, బిహార్‌లో ఓటర్ల జాబితాపై సభకు మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్, సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిటాస్, సమాజ్‌వాదీ నేత రాంగోపాల్ యాదవ్, సీపీఐ నేత సందోశ్ కుమార్ డిమాండ్ చేశారు.

నదుల అనుసంధానంపై చర్చించాలి: సురేశ్ రెడ్డి

నదుల అనుసంధానంపై చర్చ జరగాలని బీఆర్ఎస్ రాజ్యసభ పక్ష నేత సురేశ్ రెడ్డి కోరారు. ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. నదుల అనుసంధానానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, కానీ తెలంగాణ నీళ్లను అక్రమంగా తరలిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ప్రాంతీయ పార్టీల ఎంపీలకు సంఖ్యా బలంతో సంబంధం లేకుండా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని, అప్పుడే రాష్ట్రాల సమస్యలు చర్చకు వస్తాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎరువుల కొరతకు పరిష్కారం చూడాలన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి నష్టం జరుగుతుందనే ఆందోళన ఉందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని సురేశ్‌రెడ్డి కోరారు.

పిల్లలతో వెళ్తూ ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే రెట్టింపు జరిమానా!

న్యూఢిల్లీ, జూలై 20: చిన్న పిల్లలతో ప్రయాణం చేస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించే వారికి రెట్టింపు జరిమానా విధించాలని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు మోటారు వాహన చట్టంలో సవరణలను ప్రతిపాదించింది. స్కూల్ బస్సులు, విద్యార్థులను తీసుకెళ్లే ఆటోరిక్షాలు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల నిర్లక్ష్య డ్రైవింగ్‌ను వీడి.. బాధ్యతాయుతంగా మెలిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు.. డ్రైవర్ల ఉల్లంఘనలపై మెరిట్, డీమెరిట్ పాయింట్ల విధానాన్ని కూడా అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అంటే.. నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించే డ్రైవర్లకు పాజిటివ్(మెరిట్), ఉల్లంఘనులకు నెగటివ్(డీమెరిట్) పాయింట్లు ఇస్తారు. డీమెరిట్ పాయింట్లు గరిష్ఠ స్థాయికి చేరితే.. సదరు డ్రైవర్ లైసెన్సును సస్పెండ్ లేదా రద్దు చేస్తారు. మెరిట్, డీమెరిట్ పాయింట్లను బీమా ప్రీమియంతో లింక్ చేయాలనే ప్రతిపాదన కూడా తాజా ముసాయిదాలో ఉంది.

పిల్లల బయోమెట్రిక్ బడుల్లో అప్‌డేట్

న్యూఢిల్లీ, జూలై 20: పాఠశాలల్లోనే పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్ చేసే ప్రక్రియను చేపట్టాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) భావిస్తోంది. 2నెలల తర్వాత విడతల వారీగా బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియను చేపట్టనున్నట్లు యూఐడీఏఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పిల్లలకు ఐదేళ్లు వచ్చిన తర్వాత ఆధార్‌లో బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయడం తప్పనిసరి అని, ఇప్పటి వరకు 7 కోట్లకు పైగా పిల్లల బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయలేదని యూఐడీఏఐ సీఈవో భువనేష్ కుమార్ తెలిపారు. 15 ఏళ్ల వయసు వచ్చిన పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్ చేయడానికి కూడా స్కూళ్లు, కళాశాలల ద్వారా ఇదే ప్రక్రియను చేపట్టాలని యోచిస్తున్నట్టు ఆయన చెప్పారు.

కావడి యాత్రలో ఆరుగురు యాత్రికుల మృతి

» టికెట్ అడిగినందుకు ఓ సీఆర్‌పీఎఫ్ జవానుపై యాత్రికుల దాడి

ముజఫరాబాద్/హరిద్వార్, జూలై 20: కావడి యాత్రలో భక్తుల రద్దీ పెరగడంతో జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు భక్తులు మరణించారు. ఇరవైకి పైగా భక్తులు గాయపడ్డారు. యాత్ర 23న ముగుస్తుండడంతో యాత్రలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాత్ర ప్రధాన మార్గాలైన ఢిల్లీ- డెహ్రాడూన్ రహదారి, గంగా కాలువ రోడ్డు భక్తులతో నిండిపోయాయి. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ నుంచి పవిత్ర గంగా జలాలతో వస్తున్న వేల మంది భక్తులకు ముజఫరాబాద్‌లో యూపీ సీఎం యోగీ ఆదిత్యానాథ్ హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించి ఆహ్వానించారు. కావడి యాత్రకు అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మీర్జాపూర్ రైల్వేస్టేషన్‌లో ఓ సీఆర్‌పీఎఫ్ జవానుపై కావడి యాత్రికులు దాడి చేశారు. బ్రహ్మపుత్ర రైలు ఎక్కిన యాత్రికులను జవాను టికెట్ అడగడంతో వారు అతడిపై దాడికి పాల్పడ్డారు. ప్లాట్‌ఫారంపై పడిపోయిన జవానుపై ప్రయాణికులందరి ముందే పిడిగుద్దులు కురిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రైల్వే భద్రత దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. మరోవైపు, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ జిల్లాలో ఢిల్లీ-హరిద్వార్ జాతీయ రహదారిపై అకారణంగా గొడవలకు దిగి రోడ్డును బారికేడ్లతో మూసివేసిన రెండు వేరు వేరు ఘటనల్లో నలుగురు కావడి యాత్రికులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రంప్ మెడకు లోలిట ఎక్స్‌ప్రెస్ లొల్లి

(మొదటిపేజీ తరువాయి)


జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్(2010లోని చిత్రం)

తరలించి అక్కడ సెక్స్ పార్టీలు నిర్వహించేవాడు. పద్దెనిమిదేళ్లు కూడా లేని బాలికలను తరలించేందుకు అతడు ఉపయోగించిన విమానం 'లొలిట ఎక్స్‌ప్రెస్'గా పేరొందింది (రష్యన్ రచయిత వ్లాదిమిర్ నబకోవ్ రాసిన 'లొలిట' నవలలో ప్రధాన పాత్రధారి 12 ఏళ్ల బాలికపై కోరిక పెంచుకుంటాడు. ఆ నవల కథాంశం ఆధారంగానే ఎప్‌స్టీన్ విమానానికి 'లొలిట ఎక్స్‌ప్రెస్' అనే పేరొచ్చింది). ఆ విమానంలో వెళ్లినవారి వివరాల జాబితాలో.. డోనాల్డ్ ట్రంప్, బిల్ క్లింటన్, బ్రిటన్ రాజవంశానికి చెందిన ప్రిన్స్ ఆండ్రూ, హాలీవుడ్ నటుడు కెవిన్ స్పేసీ.. ఇలా ఎందరో ప్రముఖులున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తనపై కేసు నమోదు కావడంతో 2019 ఆగస్టులో.. ఎప్‌స్టీన్ జైల్లోనే ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. దానికి సంబంధించిన వీడియో ఫుటేజీని ఎఫ్‌బీఐ ఇటీవలే బయటపెట్టడం.. 'లొలిట ఎక్స్‌ప్రెస్'ను పూర్తిగా ధ్వంసం చేయడానికి రంగం సిద్ధమైన నేపథ్యంలో వాల్‌స్ట్రీట్ జర్నల్ వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. ఎప్‌స్టీన్‌తో డోనాల్డ్ ట్రంప్ సంబంధాలపై పలు ప్రశ్నలు సంధించింది. 2003లో ఎప్‌స్టీన్ 50వ పుట్టినరోజు సందర్భంగా.. అతణ్ని పొగుడుతూ లేఖలు రాసినవారిలో ట్రంప్, బిల్ క్లింటన్ ఉన్నట్టు అందులో పేర్కొంది. దీంతో ఈ అంశం అమెరికాలో ఒక్కసారిగా వైరల్ అయ్యింది. అయితే.. ట్రంప్ మాత్రం ఆ లేఖ తాను రాయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదంతా ఫేక్ అంటూ.. వాల్‌స్ట్రీట్ జర్నల్‌పై పరువు నష్టం దావా కూడా వేశారాయన. ఆ విమానంలో తాను ప్రయాణించిన మాట నిజమేగానీ.. ఎప్‌స్టీన్ సొంత దీవికి వెళ్లలేదని చెబుతున్నారు. ఎప్‌స్టీన్ చనిపోయినా.. ఈ వ్యవహారం ఇంకా తనను వదిలిపెట్టకపోవడం ట్రంప్‌కు తలనొప్పిగా మారింది.

ఎవరీ ఎప్‌స్టీన్?

ఏం చేసుకోవాలో తెలియనంత డబ్బున్న వ్యక్తి.. జెఫ్రీ ఎప్‌స్టీన్. 1953లో జన్మించిన ఎప్‌స్టీన్.. డిగ్రీ పూర్తవక ముందే స్థానిక డాల్టన్ స్కూల్‌లో టీచర్‌గా చేరాడు. అక్కడ ముక్కుపచ్చలారని బాలికలతో సైతం అతడు అనుచితంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో.. 1976లో స్కూల్ యాజమాన్యం అతడిని తొలగించింది. ఆ తర్వాత అతడు బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలోకి అడుగుపెట్టి రాణించాడు. వర్జిన్ ఐలండ్స్‌లో.. 'లిటిల్ సెయింట్ జేమ్స్ ఐలండ్'ను కొనుగోలు చేసి అక్కడ బాలికలతో సెక్స్ పార్టీలు నిర్వహించేవాడు. ఈ క్రమంలోనే.. 2006లో.. పద్నాలుగేళ్ల బాలిక తండ్రి ఒకరు అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎప్‌స్టీన్ పాపం బద్దలైంది. 2008లో కోర్టు అతణ్ని దోషిగా నిర్ధారించింది 13 నెలల ఖైదు విధించింది. అదే సమయంలో.. వర్క్ రిలీజ్ పేరిట జైల్లోంచి ఎడాపెడా యథేచ్ఛగా బయటకు వచ్చే వీలు కల్పించింది. 2019లో పోలీసులు అతణ్ని మరోసారి అరెస్టు చేశారు. ఈసారి.. లొలిట ఎక్స్‌ప్రెస్‌లో బాలికలను ఫ్లోరిడా నుంచి న్యూయార్క్‌కు అక్రమంగా రవాణా చేశాడన్న ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. అభియోగాలను పటిష్ఠంగా నమోదు చేయడంతో.. గతంలోలాగా తప్పించుకునే చాన్స్ లేదని గ్రహించి జైల్లోనే బలవంతంగా ఉసురు తీసుకున్నాడు. అనంతరం 2020 మార్చిలో అతడి విమానాన్ని ఫ్లోరిడాకు చెందిన వరల్డ్ ఏవియేషన్ సర్వీసెస్ కొనుగోలు చేసింది. అయితే.. ఎప్‌స్టీన్ దాన్ని ఎంత నీచమైన పనికి వాడాడో తెలిసిన తర్వాత దాన్ని ఆ సంస్థ నుంచి కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఇప్పుడు దాన్ని పూర్తిగా ధ్వంసం చేయడానికి సిద్ధమైనట్టు 'డెయిలీమెయిల్' వార్తా సంస్థ ఒక కథనంలో తెలిపింది.

భారత్ అమ్ములపొదిలో

కొత్త బ్రహ్మాస్త్రం.. కే-6 క్షిపణి!

(మొదటిపేజీ తరువాయి)



న్యూక్లియర్ మిస్సైల్ (ఎస్ఎల్‌బీఎం). అంటే.. జలాంతర్గాముల నుంచి ప్రయోగించగల ఖండాంతర క్షిపణి. చైనా నౌకా దళం హిందూ మహా సముద్రంలో పట్టు పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆ దేశం వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన జేఎల్-3 ఎస్ఎల్‌బీఎంకు దీటుగా కే-6 ఎస్ఎల్‌బీఎంను మన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు హైదరాబాద్‌లోని 'అడ్వాన్స్‌డ్ నేవల్ సిస్టమ్స్ లేబొరేటరీ'లో అభివృద్ధి చేస్తున్నారు. దేశ క్షిపణి కార్యక్రమ పితామహుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గౌరవార్థం తయారుచేస్తున్న 'కె' శ్రేణి క్షిపణుల్లో ఈ కే-6 అత్యంత అధునాతనమైనది. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే వీలున్న ఈ క్షిపణులు.. మన దేశ 'సెకండ్ స్ట్రైక్ క్యాపబిలిటీ' (ఎవరైనా తనపై అణ్వాయుధాన్ని ప్రయోగించినా.. సబ్‌మెరైన్ బేస్డ్ క్షిపణులతో వాటిపై అణు ప్రతిదాడులు చేసే శక్తి)కి అత్యంత కీలకం.

మూడంచెల క్షిపణి..

కే-6 ఎస్ఎల్‌బీఎం.. ఘన ఇంధనంతో పనిచేసే మూడంచెల క్షిపణి (ఇంధన వినియోగంలో నష్టాన్ని తగ్గించడానికి, క్షిపణి బరువు తగ్గించడానికి, ఎక్కువ దూరాలను అధిగమించడానికి ఇలా మూడంచెల క్షిపణులను వాడతారు. మన వద్ద ఉన్న అగ్ని-4 రెండంచెల ఘన ఇంధన క్షిపణి). దాదాపు 39 అడుగుల పొడుగు, ఆరున్నర అడుగుల వెడల్పుతో ఉండే ఈ క్షిపణులు 2 నుంచి 3 టన్నుల దాకా పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. వీటి రేంజ్ చాలా ఎక్కువ కావడంతో.. భారత జలాల్లోంచి ప్రయోగిస్తే చైనాలో మారుమూల ప్రాంతాలకు, యూరప్, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల దాకా వెళ్లగలవు. ఇవి శబ్దం కన్నా 7.5 రెట్ల వేగాన్ని అందుకోగల హైపర్ సానిక్ క్షిపణులు. వేగం.. గంటకు దాదాపు 9,200 కిలోమీటర్లు. అంత వేగంతో దూసుకొచ్చే ఈ క్షిపణులను గుర్తించి, అడ్డుకోవడం శత్రు దేశ రక్షణ వ్యవస్థలకు చాలా చాలా కష్టం. వీటికి ఎంఐఆర్‌వీ (మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్) సామర్థ్యం ఉంటుంది. అంటే.. ఒకే క్షిపణి నుంచి ఒకటి కన్నా ఎక్కువ అణు వార్‌హెడ్లు బయటకు వచ్చి, వేర్వేరు లక్ష్యాలపై దాడి చేయగలవు. అణ్వాయుధాలనే కాదు.. దీని ద్వారా సంప్రదాయ పేలుడుపదార్థాలను కూడా ప్రయోగించవచ్చు. అయితే.. ఈ క్షిపణుల బరువును మోయగలిగే స్థాయి ప్రస్తుతం మన వద్ద ఉన్న జలాంతర్గాములకు లేదు. మన వద్ద ఉన్న అరిహంత్, అరిఘాత్ దీన్ని మోయలేవు. ఈ శ్రేణిలో మూడో జలాంతర్గామి.. అరిదమన్ ఇంకా సీ ట్రయల్స్ దశలో ఉంది. ఇవి కాకుండా.. న్యూక్లియర్ పవర్డ్ బాలిస్టిక్ మిస్సైల్ జలాంతర్గామి ఎస్4*ను (నాలుగో సబ్‌మెరైన్) భారత నౌకాదళం 2024 అక్టోబరులో జలప్రవేశం చేయించింది. ఆ జలాంతర్గామి ద్వారా.. 3500 కిలోమీటర్ల రేంజ్ గల కలాం-4 (కే-4) మిస్సైల్‌ను ప్రయోగించవచ్చు (దాని తదుపరి తరమైన కె-5 శ్రేణి క్షిపణుల రేంజ్.. దాదాపు 5000 కిలోమీటర్లు). ఇప్పుడు తయారుచేస్తున్న కే-6 క్షిపణులను మోసుకెళ్లే జలాంతర్గాములు లేకపోవడంతో.. ఎస్-5 శ్రేణి స్ట్రాటజిక్ సబ్‌మెరైన్లను కొచ్చిన్ షిప్‌యార్డ్‌కు సమీపంలోని తయారీ కేంద్రంలో నిర్మిస్తున్నారు. ఈ ఎస్-5 జలాంతర్గాముల బరువు 13 వేల టన్నులు (డిస్‌ప్లేస్‌మెంట్). ఒక్కో ఎస్-5 జలాంతర్గామి 12 నుంచి 16 దాకా కే-6 క్షిపణులను మోసుకెళ్లగలదు. శత్రువుల సోనార్ వ్యవస్థలకు చిక్కకుండా ఈ జలాంతర్గామిపై పూసేందుకు 'మిశ్ర ధాతు నిగమ్' ఒక ప్రత్యేకమైన పదార్థాన్ని తయారు చేస్తోంది.

ప్రతి నెలా రూ.50-60 కోట్లు!



(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ చేశారని.. ఇతర నిందితులూ వాటాలు పంచుకున్నారని పేర్కొంది. చార్జిషీటులో ముఖ్యాంశాలివీ..

డిస్టిలరీకు బెదిరింపులు..

2019 ద్వితీయార్థంలో సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6) హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్లో డిస్టిలరీల యజమానులతో సమావేశం నిర్వహించారు. తాము చెప్పినంత కమీషన్ ఇవ్వడానికి అంగీకరించకపోతే ఒక్కరికి కూడా మద్యం సరఫరా ఆర్డర్ ఇవ్వబోమని భయపెట్టారు. మొదట్లో సరఫరాదారులు ముడుపులు ఎంతెంత ఇవ్వాలో ఏ-1 రాజశేఖర్‌రెడ్డి, ఏ-8 సుమిత్, ఏ-2 ఎండీ వాసుదేవరెడ్డి, ఏ-6 సజ్జల శ్రీధర్‌రెడ్డి నిర్ణయించారు. రెండో దఫా.. వాసుదేవరెడ్డి విజయవాడకు చెందిన సరఫరాదారులు, డిస్టిలరీలతో ప్రకాశ్/సుమిత్ సహకారంతో హైదరాబాద్‌లో సమన్వయం చేసుకుని ముడుపుల వ్యవహారాలను చర్చించారు. సేల్స్ డేటా ఆధారంగా డిస్టిలరీ, సరఫరాదారులు చెల్లించాల్సిన ముడుపుల వివరాలను సైఫ్ టేబుల్స్ వేసి కసిరెడ్డికి పంపేవాడు. అవి సుమిత్‌కు, ఆ తర్వాత చాణక్య/ప్రకాశ్‌కు కూడా అందేవి. విక్రయించిన మద్యం డబ్బులు బేవరేజెస్ కార్పొరేషన్ నంచి డిస్టిలరీల ఖాతాల్లో పడగానే.. సుమిత్/ప్రకాశ్ వాటి యజమానులకు ఫోన్ చేసి ముడుపులు చెల్లించాలని డిమాండ్ చేసేవారు. వారి అనుచరులు ఏ-9 కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్, దిలీప్, సందీప్, ఖురేషీ, చెన్ని, మల్లేశ్.. నానక్‌రామగూడ, జూబ్లీహిల్స్ తదిత ప్రాంతాల్లో వీపీఎన్/ఇంటర్నేషనల్ ఫోన్ నంబర్లతో వాట్సాప్, సిగ్నల్ నెట్‌వర్క్ ద్వారా డిస్టిలరీలు, సరఫరాదారులను సంప్రదించేవారు. వసూలు చేసిన సొమ్మును కసిరెడ్డికి చేర్చేవారు. వచ్చిన వసూళ్ల ఆధారంగా ఆర్డర్ ఆఫ్ సప్లయ్, ఇండెంట్ ప్లాన్ రూపొందించి దానిని సత్యప్రసాద్‌కు అప్పగించేవారు. ఈ ఇండెంట్ ఆధారంగా ఆర్డర్ ఫర్ సప్లయ్‌ను డిపో మేనేజర్లకు పంపించి పకడ్బందీగా అమలు చేయాలని సూచించేవారు. దాని కోసం సత్యప్రసాద్ డిపో మేనేజర్లతో వాట్సాప్ కాన్ఫరెన్స్ కాల్స్ నిర్వహించేవారు. ఇండెంట్ ప్రకారం చేస్తున్నారో లేదో పర్యవేక్షించేవారు. తమ ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయడానికి ఎండీ వాసుదేవరెడ్డి, విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి క్రమంగా తప్పకుండా సమావేశమయ్యేవారు. మద్యం ముడుపుల వసూళ్లను పర్యవేక్షించేందుకు తొలుత సుమిత్‌ను నియోగించారు. తర్వాత అతడి స్థానంలో చాణక్య/చాను/ప్రకాశ్‌ను రంగంలోకి దించారు. ప్రకాశ్, అతడి అనుచరులు డిస్టలరీలు, సరఫరాదారులతో మాట్లాడేందుకు వీపీఎన్/అంతర్జాతీయ ఫోన్ నంబర్లను వినియోగించారు. కార్పొరేషన్ నుంచి చెల్లింపులు జరిగిన రెండ్రోజుల్లోగా ముడుపులు చెల్లించాలని ఫోన్లు చేసేవారు. అలా ముడుపులిచ్చిన కంపెనీలకు మాత్రమే మద్యం ఆర్డర్లు ఇచ్చారు. మార్కెట్‌లో పాపులర్ బ్రాండ్లు విడుదల కాకుండా అడ్డుకున్నారు.

> గత ఐదేళ్లలో వందల కోట్ల వెండర్లు, డిస్టలరీలతో జరిగిన లావాదేవీలపై విచారణ చేయాలంటే ఎక్కువ సమయం తీసుకుంటుందని సిట్ వెల్లడించింది. 111 డిస్టలరీల్లో ప్రధానమైన 40 మేజర్ డిస్టలరీల లావాదేవీలను పరిశీలించామని.. 90 శాతం పైగా మద్యం ముడుపులు చేతులు మారినట్లు గుర్తించామని పేర్కొంది. ఇందులో 16 కీలకమైన డిస్టలరీలను పూర్తిగా విచారించింది. మద్యం ముడుపులు షెల్ కంపెనీలకు, గోల్డ్ మర్చంట్స్‌కు నిధుల బదిలీ, వసూళ్లు చేయడానికి సంబంధించిన డాక్యుమెంటరీ, డిజిటల్ ఆధారాలను కూడా చార్జిషీటుకు జతపరచింది.

సమయం పడుతుంది

ఎవరెవరి ద్వారానో మళ్లింపులు..

బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి డిస్టిలరీలకు నిధులు జమ కాగానే మద్యం డిస్టిలరీల నుంచి కమీషన్లు వసూలు చేసేందుకు పలు విధానాలు అవలంబించారు. వారి ఖాతాల నుంచి బులియన్ ట్రేడర్స్, బంగారం వ్యాపారులకు బదిలీ చేసి.. ఆ తర్వాత బంగారం కొనుగోలు జీఎస్టీల ఇన్‌వాయిస్‌లతో ముడుపులను కసిరెడ్డికి, చాణక్యకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా తమ కమీషన్‌ను మినహాయించుకునేవారు. కొన్ని సందర్భాల్లో డిస్టిలరీలు, మద్యం సరఫరాదారులు కూడా బంగారం వ్యాపారులతో కుమ్మక్కై నిందితులకు బంగారం రూపంలో ముడుపులు అందించారు. డిస్టిలరీల బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలిస్తే బంగారం వ్యాపారులతో వాటి అనుమానాస్పద లావాదేవీలు రూ.100-రూ.120 కోట్ల వరకు బయటపడ్డాయి.

119) From the investigation done so far, it is revealed that during the 2nd half of 2019, a meeting of the owners of the distilleries was held by the Sajjala Sridhar Reddy (A-6) at Hotel Park Hyatt, Hyderabad, where in the owners of the distilleries were told to co-operate with the orchestrated sale of liquor i.e. by raising planned indents and issuing manual OFS to select suppliers in the state of Andhra Pradesh. During the meeting, the owners were intimidated that if they do not accede to their proposals and no orders will be issued to them. Such intimidation for kickbacks by threatening them with no issuances of OFS and thereby receiving kickbacks amounts to extortion. Under the threat of loss of business, several distilleries agreed to pay kickbacks @ 12%. Soon, the percentage of kickbacks was increased to 20% of the base price. The collected amounts were eventually handed over to Kesireddy Rajasekhar Reddy(A-1). Rajasekhar Reddy would then pass the money to Vijay Sai Reddy(A-5), Mithun Reddy(A-4), Balaji (A-33) who would transfer it to former Chief Minister Y.S. Jagan Mohan Reddy. On an average, ₹50-60 crore was collected every month. (This is further corroborated by the statements of LW- 104)

మద్యం ముడుపులు జగన్‌కు చేరిన విధానాన్ని వివరిస్తున్న చార్జ్‌షీటులోని భాగం

షెల్ కంపెనీలకు..

ముడుపుల్లో ఇంకొన్ని నిధులను షెల్ కంపెనీలకు బదిలీ చేశారు. కొన్ని సార్లు లినెన్ గార్మెంట్స్, గోల్డ్ కాయిన్స్ తదితర వస్తువులను ప్రమోట్ చేసే చట్టబద్ధమైన కంపెనీల ఖాతాల్లోనూ జమచేశారు. అయితే వాటి జీఎస్టీ వివరాలు, వాహనాల వే బిల్లులను పరిశీలిస్తే.. ఆయా కంపెనీల వాహనాలు సరుకుతో టోల్‌గేట్లు దాటినట్లు ఆధారాలే లేవు. లిక్కర్ సిండికేట్ సభ్యుల బంధుమిత్రులకు చెందిన కొన్ని రియల్ ఎస్టేట్ కంపెనీలు, వ్యాపార సంస్థల ఖాతాల ద్వారా కూడా ముడుపులు మళ్లించారు. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్‌తో పాటు యూఏఈ (దుబాయ్) తదితర దేశాలకు చెందిన వ్యవస్థీకృత హవాలా నెట్‌వర్క్‌ల ద్వారా కూడా షెల్ కంపెనీలకు, నిందితులకు మద్యం ముడుపులు పంపించారు.

ఫైళ్లు మాయం..

మద్యం వ్యాపారాలకు సంబంధించి అవుట్‌లెట్ల వారీగా చూపించే ఫోర్‌క్యాస్ట్ స్టేట్‌మెంట్ ఫైల్స్‌ను లిక్కర్ ముఠా మాయం చేసినట్లు జమ్ముల రవీంద్ర అనే వ్యక్తి మొబైల్‌కు సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ నివేదికతో బయటపడినట్లు సిట్ పేర్కొంది. అలాగే.. కంప్యూటర్లలో ఈ వివరాలు నిక్షిప్తమై ఉంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని నిందితులు ముందు జాగ్రత్త పడ్డారు. అయితే విదేశాల్లో ఉండే పింగళి రాజీవ్ ప్రతాప్(ఏ-48) డేటా మొత్తాన్ని అక్కడి సిస్టమ్‌లో ఒక యాప్ ద్వారా భద్రపరచినట్లు తేలింది. రాజ్ కసిరెడ్డి తన అనుచరులతో కలిసి కోట్లాది రూపాయల అక్రమ సొమ్మును హవాలా రూపంలో దేశం దాటించేసి.. యూఏఈ, జింబాబ్వే, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో టెక్కర్ పేరుతో పలు కంపెనీలు స్థాపించి ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి అప్పగించాడు. అతడు దుబాయ్‌లో గోల్డెన్ వీసా పొంది ఇక్కడకు రాకుండా అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు.

ప్రజాధనం నష్టం.. ప్రజలకు విశ్వాస ద్రోహం..

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-24 మధ్య జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంతో ప్రజా ధనానికి నష్టం వాటిల్లడంతో పాటు ప్రజలకు విశ్వాస ద్రోహం చేసిందని సిట్ అభిప్రాయపడింది. ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు వారి నమ్మకాన్ని వమ్ము చేశారని, లిక్కర్ వ్యాపారులకు లాభాలు.. అధికారులకు ప్రయోజనాలు, ప్రజాప్రతినిధులకు ఓట్లు, వ్యవస్థను నడిపించిన మధ్యవర్తులకు లగ్జరీ జీవితం.. కింగ్ పిన్‌కు భవిష్యత్ పెట్టుబడులు.. ఇలా ఎవరికి వారు దోచుకున్నారని పేర్కొంది. ఇప్పటి వరకూ 48 మంది వరకూ నిందితులు ఉన్నారని, వారిలో 12 మంది అరెస్టయి జైల్లో ఉంటే.. 8 మంది విదేశాల్లో దాక్కున్నారని.. ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించి.. తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సిట్ తెలిపింది. ముమ్ముందు మరికొందరి పాత్ర వెలుగులోకి వచ్చే అవకాశముందని వివరించింది.

తల్లి, కుమార్తె పేరుతో రూ.100 కోట్ల ఆస్తులు..

ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి హైదరాబాద్ శివారులో 92 ఎకరాల భూములను తల్లి సుభాషిణి, కుమార్తె ఈశాన్వి పేరుతో కొనుగోలు చేశాడు. మాచనపల్లి, షాబాద్, దామరపల్లె ప్రాంతాల్లో ఉన్న ఈ భూముల మార్కెట్ విలువ రూ.100 కోట్లు కాగా.. రిజిస్ట్రేషన్ పత్రాల్లో కేవలం రూ.30 లక్షలుగా చూపించాడు. గచ్చిబౌలిలో ఈశాన్వి పేరుతో రూ.9 కోట్ల విలువైన వాణిజ్య స్థలం, కౌశిక్ కుమార్ అగర్వాల్ ఖాతాకు మళ్లించిన కోట్లాది రూపాయలను లిక్కర్ ముడుపుల సొమ్ముగానే సిట్ భావిస్తోంది. వైజాగ్‌లో కాల్ సెంటర్ ద్వారా కార్యకలాపాలు, ఇతరత్రా వివరాలు పరిశీలిస్తే మద్యం సొమ్మును ముందస్తు జాగ్రత్తతో ఆస్తుల పెంపునకు వినియోగించినట్లు తేలింది. పలు దేశాలకు తరచూ వెళ్లి వచ్చే కసిరెడ్డి దుబాయ్ కేంద్రంగా హవాలా నడిపించారని రుజువు చేసేందుకు సాక్షుల వాంగ్మూలాలను సిట్ చార్జిషీటుతో జతచేసింది.

జైలుకు మిథున్‌రెడ్డి

1వ తేదీ వరకు రిమాండ్

- విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- రాజమహేంద్రవరం జైలుకి తరలింపు



మిథున్ రెడ్డిని విజయవాడ సిట్ కార్యాలయం నుంచి కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

విజయవాడ/తిరుపతి(జీవకోన), జూలై 20(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి. భాస్కరరావు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. శనివారం సిట్ విచారణకు వచ్చిన మిథున్‌రెడ్డిని అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్(సిట్) తరపున ఇ. కోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, మిథున్‌రెడ్డి తరఫున హైకోర్టు సీనియర్ న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. "రిమాండ్‌పై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మిథున్‌రెడ్డి మూడు సార్లు ఎంపీగా గెలిచారు. ప్రోటెం స్పీకర్‌గా కూడా పనిచేశారు. ఆయనకు 'వై' కేటగిరి భద్రత ఉంది." అని చెప్పారు. దీనిపై న్యాయాధికారి.. మిథున్‌రెడ్డిని ప్రశ్నించగా.. తనకు ఎనిమిది మంది గన్‌మన్లతో కూడిన 'వై' కేటగిరి భద్రత ఉందని వివరించారు. మిథున్‌పై నమోదు చేసిన సెక్షన్లలో ఐపీసీ 409 వర్తించబోదని న్యాయవాది నాగార్జునరెడ్డి వాదించారు. వైద్య పరీక్షల నివేదికలో ఈసీజీకి సంబంధించి వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ఈ విషయంపైనా మరోసారి మిథున్‌రెడ్డిని న్యాయాధికారి ప్రశ్నించారు. ఈసీజీలో రెండుసార్లు హెచ్చుతగ్గులు వచ్చాయని మిథున్‌రెడ్డి తెలిపారు. తర్వాత ఎకో-2డీ పరీక్షలు చేశారన్నారు. దీనికి సంబంధించి ఇంతకుముందున్న సమస్యను మిథున్‌రెడ్డి వివరించారు. ఆ రిపోర్టులను న్యాయాధికారికి ఇచ్చారు. దీనిపై సిట్ తరపున పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. ఇంతకుముందు వైద్య నివేదికలు ఎలా ఉన్నా ప్రభుత్వాసుపత్రి వైద్యుల నివేదిక మాత్రం రిమాండ్‌కు అనుకూలమేనని ఉందని వివరించారు. మద్యం కుంభకోణంలో మిథున్‌రెడ్డి నేరం చేసినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయన్నారు. ఆయన దాఖలు చేసిన రెండు బెయిల్ పిటిషన్లను హైకోర్టు, సుప్రీం కోర్టు కొట్టేశాయని వివరించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం మిథున్‌రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి భాస్కరరావు తీర్పును వెలువరించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు.

బాబు హయాంలోనే స్కాం: సజ్జల

లిక్కర్ స్కాంలో ఎలాంటి ఆధారాలు లేకపోయినా అక్రమంగా అందరినీ అరెస్టు చేస్తున్నారని, అరెస్టయిన వారి ఉసురు చంద్రబాబుకు తగులుతుందని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. చంద్రబాబు హయాంలోనే మద్యం కుంభకోణం జరిగిందని, ఏడాదికి రూ.1,300 కోట్ల ప్రివిలేజ్ ఫీజు రద్దు చేసి, 40 వేలకుపైగా బెల్టు షాపులు పెట్టారని, నాలుగైదు డిస్టలరీలకు భారీగా ఆర్డర్లు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఆ స్కాంలో అరెస్ట్ అయిన చంద్రబాబు ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారని చెప్పారు. మద్యం కేసులో ఎలాంటి అధారాలు లేవన్నారు. ఇది చంద్రబాబు సృష్టించిన కట్టు కథ అని, న్యాయస్థానంలో నిలబడదని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

మిథున్‌పై కక్ష సాధింపే : మాజీ మంత్రి పెద్దిరెడ్డి

ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన తండ్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా పనిచేస్తోందో, చంద్రబాబు, లోకేశ్, పవన్ ఏవిధంగా ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నాం. గతంలో విమానాశ్రమం మేనేజరును కొట్టారని తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేశారు. ఆ కేసు నిలబడలేదు. ప్రస్తుత మద్యం కేసు కూడా నిలబడదు. చంద్రబాబు రాజకీయ జీవితంలో ఇది మాయని మచ్చగా మిగులుతుంది. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తాడు. వైసీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు." అని పెద్దిరెడ్డి వ్యాఖ్యానించారు.

అదే మందు.. కొత్త కొత్త పేర్లు!

ఏపీ మద్యం కుంభకోణంలో చార్జిషీటులో కీలక అంశాలు

- నిబంధనలకు విరుద్ధంగా బ్రాండ్ల పేరు మార్చి దోపిడీ
- ఆటోమేటిక్ విధానం తీసేసి మాన్యువల్‌గా ఆర్డర్లు



మద్యంలో ముడుపులు రావాలి.. కంపెనీలను అడిగితే కొంతవరకే ఇస్తాయి.. అవి కూడా ఎంతకాలం ఇస్తాయో తెలియదు. అధికారం ఉన్నంతకాలం కమీషన్లు రావాలంటే ఏం చేయాలి? ..ఏపీలో మద్యం కుంభకోణం సూత్రధారులకు మొదట్లో వచ్చిన అనుమానమిది. బాగా ఆలోచించి దానికో పరిష్కార మార్గం కనిపెట్టారు. అసలు కంపెనీలు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేకుండా. అవి తమ అక్రమాలకు సహకరిస్తే చాలు. అదెలాగంటే.. ప్రభుత్వానికి మద్యం సరఫరా చేసినందుకు కంపెనీలకు బిల్లులు చెల్లిస్తారు. ఉదాహరణకు.. ఒక కేసుకు కంపెనీకి రూ.500 చెల్లిస్తున్నారనుకుంటే దానిని రూ.వెయ్యి చేసేద్దాం.. మద్యం కంపెనీకి అదనంగా అందే రూ.500 మనం తీసుకుందాం.. ఇలా ప్రణాళిక రచించారు. అయితే దానికో అడ్డంకి ఏర్పడింది. నిబంధనల ప్రకారం రేటు అగ్రిమెంట్‌ను మధ్యలో మార్చలేరు. అందుకే ఒకే విధంగా పలికే బ్రాండ్లను తెరపైకి తెచ్చారు. అవే బ్రాండ్ల పేర్లతో కొత్త బ్రాండ్లు తెస్తే ప్రజలు గుర్తించలేరు. ఆ కొత్త బ్రాండ్లకు ధరలు ఎంత కావాలంటే అంత పెంచుకోవచ్చు. అలా కంపెనీలకు ధరలు పెంచేసి, ఆ పెంచిన మొత్తాన్ని ఇటు లాగేద్దామనే ప్రణాళికను అమలుచేశారు. మద్యం స్కాం చార్జిషీటులో ఏపీ సీఐడీ ఈ అంశాలను కీలకంగా ప్రస్తావించింది. పలకడానికి ఒకే విధంగా ఉండే బ్రాండ్లను ఎలా ప్రవేశపెట్టారు.. అప్పటివరకూ ఇస్తున్న రేటెంత.. పేరు మార్చి ఎంత పెంచారు.. తద్వారా ప్రభుత్వానికి జరిగిన నష్టమెంత.. అనే వివరాలను అందులో పొందుపరిచారు. ఉదాహరణకు..

- హేవార్డ్స్ క్లాసిక్ విస్కీని హేవార్డ్స్ ఫైన్ విస్కీగా పేరు మార్చి ధరను రూ.696 నుంచి రూ.1,037కి (49%) పెంచారు. తద్వారా కంపెనీకి రూ.22.9 కోట్లు అదనంగా వెళ్లాయి.
- బ్యాగ్‌పైపర్ ప్రీమియం విస్కీకి ప్రతిగా బ్యాగ్‌పైపర్ గోల్డ్ రిజర్వ్ విస్కీ పేరుతో కొత్త బ్రాండ్ తెచ్చారు. ధరను రూ.696 నుంచి రూ.1,759కి పెంచారు. 92.25 కోట్లు అదనంగా కంపెనీకి వెళ్లాయి.
- బకార్డి కార్టా బ్లాన్కా క్లాసిక్ సుపీరియర్ వైట్ రమ్‌కు.. ప్రత్యామ్నాయంగా బకార్డి కార్టా బ్లాంకా అల్ట్రా ప్లాటినం సుపీరియర్ వైట్ రమ్‌ను ప్రవేశపెట్టారు. ధరను రూ.1,879 నుంచి రూ.3,075కు పెంచారు. మంజీరా బ్లూసెలెక్ట్ విస్కీకి బదులు మంజీరా బ్లూ ప్రీమియం డీలక్స్‌విస్కీ తెచ్చారు. ధరను రూ.620నుంచి రూ.853 చేశారు.
- ఓల్డ్ టైమర్ డీలక్స్ విస్కీ బ్రాండ్‌కు సారూప్యంగా ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ తీసుకొచ్చి ధరను రూ.696 నుంచి రూ.853 చేశారు.ఇలా అడ్డగోలుగా ధరలు పెంచేసి విక్రయించి, ఆ మేరకు కమీషన్ల రూపంలో కంపెనీల నుంచి దండుకున్నారు.

నచ్చినట్టు ఆర్డర్లు..

బేవరేజెస్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం కంపెనీలకు ఆర్డర్లు ఆటోమేటిక్‌గా వెళ్లాలి. అంటే మార్కెట్‌లో అమ్మకాలను ఆధారంగా చేసుకుని ఆయా బ్రాండ్ల డిమాండ్‌కు అనుగుణంగా ఆటోమేటిక్‌గా ఆర్డర్లు వెళ్తాయి. ఇందుకోసం గత మూడు నెలల అమ్మకాలను సాఫ్ట్‌వేర్ పరిగణనలోకి తీసుకుంటుంది. ఆ అమ్మకాలపై గరిష్ఠంగా 150 శాతం వరకు ఆర్డర్లు ఇవ్వాలి. ఆ విధానంలో అయితే వైసీపీ బ్రాండ్లకు ఎక్కువ ఆర్డర్లు ఇవ్వలేరు. అందుకే ఆటోమేటిక్ విధానం తొలగించి.. మాన్యువల్ విధానం తీసుకొచ్చారు. మాన్యువల్ విధానంలో తమకు నచ్చినట్లుగా కొత్త బ్రాండ్లకు ఆర్డర్లు ఇచ్చారు.

పక్కా వ్యూహంతో స్కామ్

డిస్టిలరీల నుంచి ముడుపులు.. బోగస్ కంపెనీలతో దారి మళ్లింపు

- షెల్ కంపెనీలతో వైట్‌గా మార్చిడి.. ఎప్పటికప్పుడు వాటాల పంపిణీ
- ఎన్నికల ఖర్చుకు 250 కోట్లు.. ఏపీఎస్‌బీసీఎల్ అధికారుల కుమ్మక్కు



అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం పక్కా వ్యూహం ప్రకారం సాగింది. మద్యం కంపెనీల నుంచి ముడుపులు వసూలు చేయడం, బోగస్ కంపెనీలను సృష్టించి డబ్బు దారి మళ్లించడం, షెల్ కంపెనీల ద్వారా బ్లాక్‌మనీని వైట్‌గా మార్చడం.. వసూలు చేసిన మద్యం ముడుపులను వాటాలు పంచుకోవడం, నెలనెలా 'పెద్దల'కు చేర్చడం, ఎన్నికల ఖర్చు కోసం కొంత వైసీపీ అభ్యర్థులకు పంపిణీ చేయడం.. అంతా ఓ పథకం ప్రకారమే జరిగింది. విశ్వసనీయం సమాచారం మేరకు... ముడుపుల వసూలులో కీలకంగా వ్యవహరించిన ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి ఎప్పటికప్పుడు మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి, బాలాజీ గోవిందప్ప, కృష్ణమోహన్‌రెడ్డికి అందజేశాడు. ఎవరికి అందాల్సింది వారికి అందగా.. అక్కడి నుంచి అంతిమలబ్ధిదారు జగన్‌కు చేరాల్సిన వాటా చేరింది. అలాగే.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఈ లిక్కర్ ముడుపులే ఖర్చు పెట్టారు. అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని లాంసమ్ ఎటానియా, కృషి వ్యాలీ అపార్ట్‌మెంట్, తాడేపల్లిలోని ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లలో బాక్సుల్లో సిద్ధంగా ప్యాక్ చేసి ఉంచిన 250 కోట్ల రూపాయలను వైసీపీ అభ్యర్థులకు అందజేశారు. హైదరాబాద్, విజయవాడ నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(ఏ-39)కి సంబంధించిన వాహనాల్లో ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో ఎన్నికల ఖర్చుల కోసం తరలించారు. తాడేపల్లిలోని ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్‌లో ప్రణయ్ ప్రకాశ్ నుంచి 8 కోట్లు, 9 కోట్లు చొప్పున 13సార్లు తీసుకెళ్లారు. 2024 ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ వరకూ ఇక్కడి నుంచి తీసుకెళ్లిన సొమ్ముతో పాటు వెంకటేశ్ నాయుడు(ఏ-34), రాజ్ కసిరెడ్డి (ఏ-1), బూనేటి చాణక్య(ఏ-8), పైలా దిలీప్ (ఏ-30) పలు మార్లు అందజేసిన మొత్తం 250 కోట్లుగా తేలింది. 'తుడా' వాహనాల్లో తీసుకెళుతూ చిల్లకల్లు పోలీసులకు పట్టుబడ్డ 8.37 కోట్లు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి(ఏ-38) పర్యవేక్షణలో ఆయన అనుచరులు రామరాజు, గిరిబాబు, బాలాజీ యాదవ్ తరలించినట్లు తేలింది.

ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో లిక్కర్ మాఫియా ముందు జాగ్రత్త పడింది. ముడుపుల వ్యవహారాలు చూసిన పలువురి ఫోన్లు లాక్కొని దుబాయ్‌కి పంపించింది. జూబ్లీహిల్స్‌లోని రాజ్ కసిరెడ్డి ఆఫీసుకు వారిని పిలిపించిన పైలా దిలీప్(ఏ-30).. వారి ఫోన్లు తీసుకుని, వాటి ధరకు రెట్టింపు నగదు చెల్లించాడు. ఆ తర్వాత బూనేటి చాణక్య సూచన మేరకు దుబాయ్ చేరుకుని బిజినెస్ బేలోని దమాక్ అపార్ట్‌మెంట్‌లో వరుణ్ తదితరులు ఉన్నారు.

మద్యం ముఠా దోపిడీకి ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు పూర్తిగా సహకరించారు. ప్రతి నెలా తన వాటా కోసం కేంద్ర సర్వీసుల్లో ఉన్న వాసుదేవ రెడ్డి, ఐఏఎస్ హోదా ఇప్పిస్తారన్న ఆశతో సత్యప్రసాద్ తోడ్పాటు అందించారు. డిస్టిలరీ యజమానులు, మేనేజర్లతో పాటు ప్రొక్యూర్మెంట్ అధికారులను బ్లాక్ లిస్ట్ చేస్తామని బెదిరించి దారికి తెచ్చుకున్నారు.

త్వరలో మరో చార్జిషీట్

'ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిన ఈ కుంభకోణంలో 40 మంది పాత్ర ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చాం. కానీ పది కంపెనీలు, ఆరుగురు వ్యక్తుల పాత్రపై ప్రాథమిక అభియోగపత్రంలో వివరిస్తున్నాం. ఇతరుల పాత్రపై త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేస్తాం' అని కోర్టుకు సిట్ తెలిపింది.

అత్యాచారయత్నం.. ఆపై బెదిరింపులు
భయంతో దివ్యాంగురాలి ఆత్మహత్య

- హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో ఘటన

సరూర్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): యువకుడి వేధింపులు భరించలేక ఓ దివ్యాంగురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని మీర్‌పేటలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా అన్నంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 12 ఏళ్ల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి అల్మాస్‌గూడలో నివాసముంటున్నారు. ఆయనకు ఓ కుమారుడు, ఇద్దరు దివ్యాంగ (చెవిటి, మూగ) కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె ఇంటి వద్ద టైలరింగ్ చేస్తుంది. ఈ క్రమంలో వారి ఇంటికి ఎదురుగా ఉండే శ్రీకాంత్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. 20 రోజుల క్రితం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై శ్రీకాంత్ అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. మనస్తాపానికి గురైన యువతి బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది, కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించడంతో కోలుకుంది. ఇంటికొచ్చిన తర్వాత కూడా శ్రీకాంత్ వేధింపులు ఆగలేదు. తల్లిదండ్రులకు విషయం చెబితే చంపేస్తానని శ్రీకాంత్ బెదిరించాడని చెల్లెలికి తెలిపింది. ఈ క్రమంలో తనవల్ల తల్లిదండ్రులకు ప్రాణభయం ఉందన్న భయంతో శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రీకాంత్ వేధింపులు భరించలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని బాధిత యువతి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై ముల్తానీల రాళ్ల దాడి

వాహనాల ధ్వంసం, ఎస్సైతో సహా 8 మందికిగాయాలు

అదిలాబాద్ జిల్లా సిరిచెల్మ అటవీ పరిధిలో ఘటన



కేశవపట్నంలో భారీగా మోహరించిన పోలీసులు

ఇచ్చోడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో మొక్కలు నాటడానికి అటవీ అధికారులు, పోలీసులు వెళ్లగా.. తమ భూముల్లో మొక్కలు నాటొద్దంటూ ముల్తానీలు(పోడు రైతులు) వారిపై రాళ్ల దాడి చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సిరిచెల్మ అటవీ పరిధిలోని కేశవపట్నం గ్రామంలో గత రెండు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం జరిగిన దాడిలో ఇచ్చోడ ఎస్ఐ సహా 8 మంది పోలీసులకు గాయాలయ్యావగా.. వారి వాహనం ధ్వంసం అయ్యింది. వెంటనే వారిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రతీ ఏటా ఈ అటవీ ప్రాంతంలో అధికారులు మొక్కలు నాటుతుంటారు. అందులో భాగంగానే శనివారం సిరిచెల్మ అటవీ పరిధిలోని 172, 174 కంపార్ట్‌మెంట్లలో మొక్కలు నాటేందుకు అధికారులు.. వారి భద్రత కోసం పోలీసులు వెళ్లారు. అక్కడి భూములు సాగు చేస్తున్న ముల్తానీలు.. నాటిన మొక్కలను పీకేసి ఆ భూములు తమవేనని, తమ భూముల్లో మొక్కలు నాటవద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ జోలికి వస్తే ఇక్కడే కొడవళ్లతో ఆత్మహత్యలు చేసుకుంటామని.. అక్కడున్న మహిళా రైతులు బెదిరించడంతో అధికారులు వెళ్లిపోయారు. తిరిగి ఆదివారం ఉదయం అధికారులు, పోలీసులు పకడ్బందీగా గ్రామానికి వెళ్లగా.. గ్రామస్థులంతా ఏకమై పోలీసులపై దాడి చేశారు. దీంతో కేశవపట్నంలో భారీగా పోలీసులను మోహరించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఇచ్చోడ పోలీసు స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. పోడు భూముల సమస్యపై అటవీ అధికారులతో చర్చలను కొనసాగించారు.

త్వరలో భారత్‌లో పుతిన్ పర్యటన!

న్యూఢిల్లీ, జూలై 20: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాలుగేళ్ల తర్వాత భారత్‌లో పర్యటించనున్నట్లు తెలిసింది. ఈ ఏడాది చివరిలో జరిగే భారత-రష్యా సదస్సులో పుతిన్ పాల్గొనే అవకాశముందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. భారత- రష్యా సదస్సు గతేడాది మాస్కోలో జరిగిందని, ఇప్పుడు భారత్ వంతు వచ్చిందని భారత విదేశాంగశాఖ మంత్రిత్వశాఖ ప్రతినిధి రంధీర్ జైశ్వాల్ చెప్పారు. ఈ ఏడాది చివరిలో జరిగే ఈ సదస్సులో ఇరు దేశాల మధ్య రక్షణ, శక్తి, ఈయూ ఆంక్షలు, పౌర అణు భాగస్వామ్యం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశముందని ఆయన చెప్పారు. కాగా, మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని మోదీతో పుతిన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని అంతమొందించాలని పుతిన్ పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది చివరిలో చైనాలో జరిగే ఎస్‌సీఓ సదస్సులోనూ మోదీ, పుతిన్ భేటీ అయ్యే అవకాశముంది.

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

పాలపిట్ట తెలంగాణ ప్రత్యేక సంచిక

తెలంగాణ ఏర్పడి పుష్కర కాలం అవుతున్న సందర్భంగా పాలపిట్ట తెచ్చిన తెలంగాణ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభ జూలై 26 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత రూప్ కుమార్ డబ్బీకార్, ఆవిష్కర్త ఏనుగు నరసింహారెడ్డి. సభలో నామోజు బాలాచారి, మామిడి హరికృష్ణ, పొట్లపల్లి శ్రీనివాసరావు, ఎం. నారాయణశర్మ, గుడిపాటి, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ ప్రసంగిస్తారు.

పాలపిట్ట బుక్స్

చలసాని ప్రసాద్ వర్ధంతి

విరసం నాయకులు చలసాని ప్రసాద్ పదో వర్ధంతి సభ జూలై 27 ఉ.10గం.లకు విశాఖ పౌర గ్రంథాలయంలో జరుగుతుంది. ఈ సందర్భంగా చలసాని ప్రసాద్ డిజిటల్ లైబ్రరీని విరసం సీనియర్ సభ్యురాలు కృష్ణాబాయి, అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ ఆవిష్కరిస్తారు. సత్యనారాయణమూర్తి, మల్లీశ్వరి, ఇప్టూ ప్రసాద్, బాల సుధాకర్ మౌళి, సీఎస్ఆర్ ప్రసాద్, రివేరా తదితరుల ప్రసంగాలు ఉంటాయి.

రివేరా

'మహా పాదయాత్ర' దీర్ఘ కవిత

అడపా రామకృష్ణ దీర్ఘ కవిత 'అమరావతి మహిళల మహాపాదయాత్ర' ఆవిష్కరణ సభ జూలై 27 ఉ.10గం.లకు ఎస్‌హెచ్ఒ మీటింగ్ హాల్, 2/1 బ్రాడీపేట, గుంటూరులో జరుగుతుంది. స్వాగతం బండికల్లు జమదగ్ని, సభాధ్యక్షత తూములూరి రాజేంద్రప్రసాద్, ముఖ్యఅతిథి జాస్తి వీరాంజనేయులు, ఆత్మీయ అతిథి శిరేలా సన్యాసిరావు.

పట్టాభి కళాపీఠము

'విశ్వంభర' సినారె పురస్కారం

సి. నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణ రెడ్డి సాహిత్య పురస్కారాన్ని అస్సామీ కవి నీలిమ్ కుమార్ స్వీకరిస్తారు. ఈ కార్యక్రమం జూలై 29 సాయంత్రం రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కార గ్రహీతను రూ.5లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరిస్తారు.

జె. చెన్నయ్య

కథా సంపుటాలకు ఆహ్వానం

'ఎన్జీరంగా సాహిత్య పురస్కారాలు 2025'కు ప్రత్యేకంగా రచయిత్రుల నుండి కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. మొదటి, రెండవ బహుమతులు వరుసగా: రూ.10వేలు, రూ.5వేలు. రచయిత్రులు 2021-2024 మధ్య ప్రచురితమైన తమ కథా సంపుటాలు 4 ప్రతులను ఆగస్ట్ 9 లోపు చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202 శ్రీవెంకటసాయి రెసిడెన్సి, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు – 523 002కు పంపాలి. ఫోన్: 9849799711.

జక్కంపూడి సీతారామారావు

నాగభైరవ సాహిత్య పురస్కారం

నాగభైరవ సాహిత్య పురస్కారానికి గాను అనువాద సాహిత్యంలో రూ.10వేల మొదటి బహుమతికి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అనువాద నవల 'నెత్తురు నది', రూ.5వేల రెండవ బహుమతికి కోనేరు కల్పన అనువాద కథల సంపుటి 'దర్పణం' ఎంపిక అయ్యాయి. ఆగస్ట్ 17న ఒంగోలులో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం ఉంటుంది.

నాగభైరవ ఆదినారాయణ



పాఠకదేవుళ్ళకు...

చక్కగా టేకాఫ్ అయిన రచయిత
ఎక్కడెక్కడో గగనసీమల్లో తిరిగి తిరిగి
మరలా ల్యాండయ్యేందుకు
ఒక్క దయామయుడైన పాఠకుడుండాలి
కారుమబ్బులకు కొండలున్నట్లు
కారే మేఘాలకు నేల అండ ఉన్నట్లు

పాఠకుడు ఒక పిడికెడు మట్టి
కవులు విత్తనాలై విస్తరిస్తారు
పాఠకుడు ఓ చమురు ప్రమిద
రచయితలు వత్తులై వెలిగిపోతారు

ఆఖరున..
సృజనకారుల చేత ఊపిరిపోసుకున్న
రసభరితమైన పసి రచన
పాఠకుడు ఊయలై
హాయిగా తననెపుడు
ఊపుతాడా అని ఎదురుచూస్తుంది

■ నలిమెల భాస్కర్

కొత్త సాహిత్య వారధి 'విదేశీ సిరీస్'



ఛాయా పబ్లికేషన్స్ సంస్థ 'విదేశీ సిరీస్' పేరుతో రానున్న రెండున్నర ఏళ్ళలో పదిహేను అంతర్జాతీయ భాషల నుంచి 25 పుస్తకాలను తెలుగులోకి అనువదించి తేనుంది. ఇప్పటికే ఆయా ప్రచురణకర్తలతో ఒప్పందాలు పూర్తయ్యాయి. ఈ సిరీస్‌లో ఒర్హాన్ పాముక్, హాన్ కాన్ వంటి నోబెల్ గ్రహీతల పుస్తకాలతోపాటు, బుకర్ ప్రైజ్ పొందిన రచయితల పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ ప్రయత్నం గురించి ఛాయ పబ్లికేషన్స్ సంస్థ సీఈవో **అరుణాంక్ లత**తో వివిధ జరిపిన సంభాషణ ఇది:

ఈ 'విదేశీ సిరీస్' ఆలోచన ఎలా కలిగింది, దీని ఉద్దేశం ఏమిటి?

సమకాలీన ప్రపంచ సాహిత్యం తెలుగులోకి రావడం ఆగిపోయి దశాబ్దాలు గడుస్తోంది. ఈ లోటును తీరుస్తూ ఆ సాహిత్యాన్ని సామాన్య పాఠకులకు చేరువ చేసే ఉద్దేశ్యంతో ఈ సిరీస్‌ను ప్రారంభించాము. కొందరికే అందుబాటులో ఉండే ప్రపంచ సమకాలీన సాహిత్యాన్ని మారుమూల తెలుగు పాఠకులకు చేరవేయడం దీని లక్ష్యం.

ఇందులో పుస్తకాల్ని, రచయితల్ని ఏ ప్రాతిపదిక మీద ఎంపిక చేసుకున్నారు?

ఒకే జానౄ కాకుండా వేర్వేరు థీమ్స్ జానౄల నుండి తీసుకున్నాం. రచయితలూ, అనువాదకులూ అందరూ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలున్నవారే. ముఖ్యంగా ఈ జాబితాలో బుకర్, బుకర్ ఇంటర్నేషనల్ బహుమతి పొందిన పుస్తకాలు, నోబెల్ బహుమతి పొందిన రచయితలూ ఉండేలా చూసుకున్నాం. వీటిలో బుకర్ బహుమతి పొందిన ఇంగ్లిష్ నవల 'ప్రొఫెట్ సాంగ్' (2023); మూడు బుకర్ ఇంటర్నేషనల్ బహుమతులు పొందిన నవలలు: కొరియన్ నవల 'ది వెజిటేరియన్' (2016), డచ్ నవల 'డిస్‌కంఫర్ట్ ఆఫ్ ది ఈవెనింగ్' (2020), జర్మన్ నవల 'కైరోస్' (2024); అలాగే, ముగ్గురు నోబెల్ రచయితల పుస్తకాలు: నార్వేజియన్ రచయిత యాన్ ఫోసే నవల 'షైనింగ్' (2023), టర్కిష్ రచయిత ఒరాన్ పాముఖ్ నవల 'మై నేమ్ ఈజ్ రెడ్' (1998), కొరియన్ రచయిత హాన్ కాంగ్ నవలలు 'ది వెజిటేరియన్' (2016), 'వీ డు నాట్ పార్ట్' (2025) ఉన్నాయి. వీటిలో రెండు పుస్తకాలు మినహాయిస్తే మిగతావన్నీ గడచిన ఇరవై ఏళ్ళలో వచ్చినవే.



ప్రచురణకర్తలతో ఒప్పందాలు సులభం గానే జరిగాయా? ఆయా ప్రచురణకర్తలు ఇలాంటి ఒప్పందాల విషయంలో ఏ అంశాలపై దృష్టి పెడతారు, ఇందులో ఆయా రచయితల పాత్ర ఎంతవరకు?

హక్కులు అనేది కాస్త క్లిష్టమైన వ్యవహారమే. ఒక పుస్తకం మనం తీసుకోవాలి అని అనుకున్న తరువాత దాన్ని డీల్ చేసే సంస్థ ఏది అనేది వెతుక్కోవడం కూడా పెద్ద విషయమే. ఎక్కువగా విదేశీ రచయితలకు లిటరరీ ఏజెంట్స్ ఉంటారు. కొందరిని లిటరరీ ఏజెన్సీలు రిప్రజెంట్ చేస్తాయి. ఆ ఫలానా ఏజెన్సీలో తనను రిప్రజెంట్ చేసే ఏజెంట్ ఒకరు ఉంటారు. ఇవన్నీ కనుక్కుని వాళ్ళ ఈమెయిల్ ఐడీ తీసుకున్నాక వారికి రాసిన మెయిల్‌కి స్పందిస్తారని లేదు. వాళ్ళు చాలామందిని చూసుంటారు గనుక ఎక్కువ మంది మొదటి మెయిల్‌కే స్పందించరు. దానికి తోడు, మనం వేసే పుస్తకాల సంఖ్యా, మనం ఆఫర్ చేసే డబ్బులూ వాళ్ళకి పెద్ద విషయంలా అనిపించదు. రిపీటెడ్‌గా రాస్తే తప్ప ఈ ప్రపోజల్స్ వర్కవుట్ అవ్వవు. ఇందులో ఒకటీ రెండు ఈమెయిల్స్‌కే ఒప్పుకున్న వాళ్ళున్నారు, పదుల సంఖ్యలో ఈమెయిల్స్ రాస్తే తప్ప స్పందించనివాళ్ళూ ఉన్నారు.

వాళ్ళు ప్రధానంగా ఎన్ని పుస్తకాలు వేస్తున్నారు, ఏ రకంగా వేస్తున్నారు అనే దానిపై దృష్టి పెడతారు. పుస్తకం పేపర్ బ్యాక్, హార్డ్ బౌండ్, ఆడియో రైట్స్ వేటికవే ప్రత్యేకంగా హక్కులు తీసుకోవాల్సిందే. ప్రచురణ సంస్థ గురించిన ఒక సవివరమైన పరిచయం కూడా వాళ్ళు తెలుసుకునేందుకు ఇష్టపడతారు.

ఈ మొత్తం ప్రక్రియలో రచయితల పాత్ర దాదాపు ఉండదు అనే చెప్పొచ్చు. వారి తరఫున ఇదంతా నెగోషియేషన్స్ ఏజెంట్స్ నిర్వహిస్తారు. కాంట్రాక్ట్‌లో సంతకం చేయడం మాత్రమే రచయిత పని. ఎందుకంటే గత ఏడాది బుకర్ ఇంటర్నేషనల్ వచ్చిన రచయిత్రి జెన్ని ఎర్పన్‌బెక్‌నీ, 2023 బుకర్ వచ్చిన పాల్ లించ్‌నీ ప్రత్యక్షంగా కలిసినా కూడా వాళ్ళు తమ ఏజెంట్స్ తోనే మాట్లాడమని చెప్పారు.

ఈ పాతిక పుస్తకాలలోనూ పదహారు పుస్తకాలు 'లిటరరీ ఫిక్షన్' జానౄకు చెందినవే ఉన్నాయి, ఎందుకు?

ఛాయ పబ్లికేషన్స్‌కు ముందు నుంచీ సీరియస్ పుస్తకాలు వేస్తుందనే పేరు ఉన్నది కనుక ఈ 'విదేశీ సిరీస్'తో దాన్ని ఇంకాస్త ముందుకు తీసుకుపోవాలి అనుకున్నాం. ఇందులో భాగంగా తెస్తున్న పుస్తకాలు వివిధ థీమ్స్‌కి సంబంధించినవి, కొన్ని పాపులర్ ఫిక్షన్ స్టైల్‌లో ఉన్న లిటరరీ ఫిక్షన్. వీటిని యువ రచయితలూ, రాబోయే తరం అందిపుచ్చుకుంటుందనీ, ఈ అనువాద సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేస్తుందనీ మా ఆశ.

ఈ సిరీస్‌లో అరబిక్, ఫినిష్, ఐస్‌లాండిక్, కొరియన్, నార్వేజియన్, రష్యన్ తదితర భాషల పుస్తకాలు ఉన్నాయి. వీటన్నిటి అనువాదమూ వయా ఇంగ్లీష్ అనువాదాల నుంచే జరుగుతున్నదా?

రెండు పుస్తకాలు మినహా మిగతావన్నీ వయా ఇంగ్లీష్ నుంచి చేస్తున్నవే. అయితే, ఇంగ్లీష్ అనువాదకుల నుంచి వారి అనువాదాన్ని వాడుకునేందుకు హక్కులు తీసుకుంటున్నాం. ఇలా వాళ్ళని సంప్రదించడం చాలా అరుదైన విషయమనీ, చాలా భాషల్లోకి వారి అనువాదాలను ఉపయోగించే చేస్తున్నా కనీసం వారి పేరు కూడా పేర్కొనడం లేదని వారు అన్నారు. తమ అనువాద హక్కుల గురించి ఇప్పుడు వారంతా బయటకి వచ్చి సంఘటితం అవుతున్నారు.

రెండు తప్ప వీటిలో ఏ నవలా మూల భాష నుంచి నేరుగా రానప్పుడు తెలుగు అనువాదం మూలానికి మరీ దూరంగా జరిగే అవకాశం లేదా?

మూలం నుండి దూరం జరగకూడదు అనే ఉద్దేశ్యంతో ప్రముఖ ప్రచురణ సంస్థలు వేసిన పుస్తకాలను, అనువాదకుల ప్రొఫైల్‌ని గమనంలో పెట్టుకునే పుస్తకాలను ఎన్నుకున్నాం. వీరంతా ప్రతి పుస్తకం ఐదారు సార్లు, కొందరు ఇంకా ఎక్కువ సార్లు ఎడిట్ చేస్తారు. తరచి తరచి చూసిన తర్వాతే ఈ పుస్తకాలు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ లోకి వచ్చేటప్పుడు 'ట్రాన్స్‌లేషన్ లాస్' తక్కువ గనుక తెలుగులో ఆ సమస్య ఉండదనే అనుకుంటున్నాం.

తెలుగు అనువాదకుల ఎంపిక ఎలా జరుగుతోంది? అనువాదాల శైలి విషయంలో ఏమైనా నియమాలు విధించుకున్నారా?

ఈ సిరీస్ ద్వారా కొత్త అనువాదకులను పరిచయం చేస్తున్నాం. ఇప్పటికే అనువాదం చేసిన నలుగురు అనువాదకుల అనువాదాలను చూసి వారికి కొన్ని పుస్తకాలు ఇచ్చాం. అయితే, ఈ సిరీస్‌కి ముగ్గురు సంపాదకులను కేటాయించాం. వారు ఇంగ్లీష్ – తెలుగు అనువాదం చూడటం, మూలానికి దూరం కాకుండాను, అట్లే రీడబిలిటీ ఉండేలాను చూస్తారు. అంతేగాక రీడర్ రివ్యూ అనే పద్ధతినీ పాటిస్తున్నాం. ఎంపిక చేసిన పాఠకులకు అచ్చుకు ముందే పుస్తకాలు పంపించి ఎలా ఉందో రివ్యూలు తీసుకుంటున్నాం.

ప్రస్తుతం భారతీయ/ తెలుగు రీడర్‌షిప్ విషయంలో విదేశీ ప్రచురణకర్తల దృక్పథం ఎలా ఉంది?

భారతీయ రీడర్‌షిప్ అంటే వారి దృష్టిలో ఇంగ్లీష్ రీడర్‌షిప్ మాత్రమే. ఒక్క మలయాళం మినహా మిగతా భారతీయ భాషల్లో అనువాద సాహిత్యం వేల కాపీలు అమ్ముడుపోయేదీ తక్కువే. భారతీయ భాషలు సంఖ్య ప్రకారం పెద్దవేగానీ రీడర్‌షిప్ ప్రకారం చిన్నవి. వారు ఈ విషయం చెబితే అర్థం చేసుకుంటున్నారు. ఒక కొత్త భాషలోకి పుస్తకం వెలుతుందిలెమ్మనే అభిప్రాయంతో ఉన్నారు. బహుశా ఈ పుస్తకాలు కొత్త మార్కెట్‌కి దారులు వేస్తాయేమోనన్న దృక్పథంతోనూ ఉన్నారు.

ఈ 'విదేశీ సిరీస్' ప్రయాణంలో 15 భాషల నుంచి పుస్తకాలు తెస్తున్నాం గనుక, కేవలం మనం తేవడంతోనే ఆగిపోకుండా మన సాహిత్యాన్ని అటువైపు తీసుకుపోయే ప్రయత్నం కూడా చేస్తున్నాం. త్వరలో మన పుస్తకాలూ ఫ్రెంచ్ వీధుల్లోనో, జర్మన్ బుక్ షాప్స్‌లోనో, అమెరికన్ మాల్స్‌లోనో... ఆయా భాషల్లో కనిపించొచ్చు. ■



వలస పక్షులు

రెండు జల్లుల తెరిపిలో
బట్టలారేసుకున్నట్లు
కాలం తీగెలపై
బతుకులు ఆరేసుకోవాలి
కన్నీటిలోనూ
రంగులు వెతుక్కునే
ఆశలు మనవి

ఎన్ని తెరచాపలు కట్టినా
చెమట సంద్రంలోని
ఆకలి నావ నడక
కుదుటపడదు
కంటి నుండి కంటికి
కన్నీటిని రాజేసే
తడి నిప్పు ఆరదు

సాలెగూడులో చిక్కిన
పురుగుల్లా
గడియారంలోని
ముళ్ళు పెట్టే మూల్లులకు
చీకటి కిటికీ

రెప్పలు చాచగానే
తూరుపు బండి
వేకువ కూత పెడుతుంది

ఇంకో కొత్త రోజుకి
రెక్కలివ్వడానికి
నిద్రకన్ను గుడ్డిలాంతరులా
తెరుచుకుంటుంది

ఆకుల్లేని కొమ్మల్లో
వసంతాన్ని వెదుక్కుంటూ
విరిగిన బతుకుతెరువుకి
ఊతకర్రలు కట్టి
ఆకలి కడుపు దాకా
మెతుకులను ఎగదోస్తున్నా
మన కలలన్నీ వలసపక్షులే
కన్ను చూపే నిజమేమో
ఓ ఎండిన సరస్సు

■ మిరప మహేష్
99480 39026

ముఖచిత్రంపై ఇప్పటికీ అసంతృప్తి

నా మొదటి పుస్తకం


ఎస్. ఎ. రవూఫ్

1983. కాకినాడ 'రంగరాయ' కాలేజీలో నేను మెడిసిన్ మొదటి సంవత్సరం చదువుతున్న రోజులవి. అప్పుడు నేను తొమ్మిది, పది, ఇంటర్ తరగతులు చదివే కాలంలో రాసిన కవితల్ని కంపైల్ చేసి ప్రచురించిన నా మొదటి కవితా సంపుటి 'అంతర్నేత్రం'. ఈ పుస్తకం ప్రింటింగ్ ప్రెస్‌కి వెళ్ళే క్రమంలో నేను ఇంటర్ చదువుకున్న సర్వోదయా కళాశాలలో మాకు తెలుగు, బోటనీ చెప్పిన అధ్యాపకులు, సాహిత్యం పట్ల విశేషమైన ఆసక్తి కలిగిన కాళిదాసు పురుషోత్తం గారు, సత్యా గారు ముక్త కంఠంతో, "తొందరపడి పుస్తకాన్ని అప్పుడే అచ్చు వేయకు. తేడా కొడితే విమర్శకులు చీల్చి చెండాడుతారు" అని హెచ్చరించారు. నా కవిత్వం మీద నాకు గట్టి నమ్మకంతో మా లెక్చరర్ల మాటల్ని లెక్కచేయక మొండిగా అడుగు ముందుకు వేశాను. ఆ మొండి ధైర్యం తోనే అప్పట్లో సమకాలీన తెలుగు కవిత్వానికి దీపధారిగా నిల్చిన కవి ఇస్మాయిల్‌ని కాకినాడ లచ్చిరాజు వీధి లోని వారి ఇంట్లో కలిశాను. పరిచయాలూ, ఉపోద్ఘాతాలూ ఏమీ లేకుండా నా కవిత్వపు కాగితాల బొత్తిని ఇస్మాయిల్ గారి చేతుల్లో పెట్టి, "పుస్తకం వేస్తున్నాను. మీరు ముందుమాట రాయాలి," అన్నాను. నా మాటలకి ఆయన విస్తుపోయి నా వంక ఎగాదిగా చూసి నిష్కర్షగా, "ముక్కూమొహం తెలియనివాళ్ళకి నేను పీఠికలూ, పరిచయాలూ రాయను" అన్నారు. "మీకు కుదిరినప్పుడే చదివి, నచ్చితేనే రాయండి" అని వచ్చేశాను. మొదట రాయనన్న ఇస్మాయిల్ గారే వారంలోపే అద్భుతమైన పరిచయం రాశారు. నా కవిత్వాన్ని జెన్, హైకూ జపనీయ పద్యాలతో పోల్చుతూ, "రవూఫ్‌వి తెరుచుకున్న పద్యాలు! పద్యం పరిధిని మించి విస్తృతార్థాన్ని ఇస్తాయి. సార్వజనీన, సార్వత్రిక సత్యాల్ని ఆవిష్కరిస్తాయి," అని రాశారు. ఒక యువకవి కవిత్వ పుస్తకానికి ఇస్మాయిల్ ముందుమాట రాయటం నాతోనే మొదలు. నాకు అది ఒక విశిష్ట అనుభవం!



> పరిచయాలూ, ఉపోద్ఘాతాలూ ఏమీ లేకుండా నా కవిత్వపు కాగితాల బొత్తిని ఇస్మాయిల్ గారి చేతుల్లో పెట్టి, "పుస్తకం వేస్తున్నాను. మీరు ముందుమాట రాయాలి," అన్నాను. నా మాటలకి ఆయన విస్తుపోయి నా వంక ఎగాదిగా చూసి నిష్కర్షగా, "ముక్కూ మొహం తెలియనివాళ్ళకి నేను పీఠికలూ, పరిచయాలూ రాయను" అన్నారు.

అంతర్నేత్రం పుస్తక ప్రచురణ అప్పుడే ప్రింటింగ్ రంగంలోకి దిగిన నరసరావుపేటలోని వాసవి ప్రింటర్స్‌లో జరిగింది. నన్ను అమితంగా ప్రేమించే మా మేనమామ సుభాని ప్రచురణ బాధ్యతని తలకెత్తుకున్నారు. కవర్ పేజీపై ముఖచిత్రం, టైటిల్ అక్షరాలు మా పెదనాన్న జైనుల్ ఆబెదిన్ గారివి.



కవర్ పేజ్ అనుకున్నట్టు రాలేదు. అదే అసలు లోపం. ఆ అసంతృప్తి నాలో ఇప్పటికీ ఉంది. ఈ పుస్తకాన్ని అమ్మా నాన్న (సమీవున్నీసా, నూర్ అహమద్) లకి అంకితం ఇచ్చాను. పుస్తకం ప్రెస్ లోంచి బైటికి వచ్చినప్పుడు నాకు కలిగిన అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఏనుగెక్కినంత సంబరం!

'అంతర్నేత్రం' పుస్తకావిష్కరణ కాకినాడలోనే జరిగింది. అక్కడి ప్రభుత్వ గ్రంథాలయంలో ఆర్. ఎస్. సుదర్శనం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, 'ప్రామిసింగ్ పొయెట్' అన్నారు. అదే సభలో 1980 లో 'కొత్త కలాలు' శీర్షికన నన్ను పరిచయం చేసిన ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు 'రవూఫ్‌ని డిస్కవర్ చేసింది నేనే' అన్నారు. సభలో ఇస్మాయిల్, స్మైల్, గోదావరి శర్మ, జానకీ జాని గార్లు పాల్గొనటం నా సుకృతం!

నా మొదటి కవితా సంపుటి 'అంతర్నేత్రం' నాకు తెచ్చిన పేరు అంతా ఇంతా కాదు. రాత్రికి రాత్రే కాలేజ్ క్యాంపస్ లోనూ, బైట కూడా సెలబ్రిటీని అయిపోయాను. ఆనాటి నించి నా పేరు 'అంతర్నేత్రం రవూఫ్'గా స్థిరపడిపోయింది. అదే సంవత్సరం జరిగిన రంగరాయ వైద్య కళాశాల రజతోత్సవాలకి విచ్చేసిన, అప్పటికే రచయితగా ప్రసిద్ధులైన, డాక్టర్ పరుచూరి రాజారామ్ నా 'అంతర్నేత్రం' పుస్తకాన్ని పట్టుకొని "ఇక్కడ రవూఫ్ అంటే ఎవరు?" అంటూ మా మెన్స్ హాస్టల్‌కి నన్ను వెతుక్కొంటూ రావటం నాకు దక్కిన గొప్ప గౌరవం! ■

ముందు తరం నమ్మకాన్నీ ధైర్యాన్నీ ఇచ్చింది

చదువు ముచ్చట

మానస ఎండ్లూరి



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

కొత్త తరం రచనలు, కొత్త రకం రచనలు ఎన్నో వస్తున్న కాలం ఇది కాబట్టి ఒక పుస్తకమంటూ చెప్పడం కష్టమే. ఎక్కువ కథలు చదవడానికి ఇష్టపడతాను. స్ఫూర్తి కందివనం కథలు 'డిమ్కి', పసునూరి రవీందర్ కథలు 'అవుట్ ఆఫ్ కవరేజ్ ఏరియా', రూబీనా పర్వీన్ కథలు 'జమిలి పోగు', కరుణ కుమార్ కథలు 'సవర్లకొండ', సురేంద్ర శీలం నవల 'నడూరి మిద్దె', మహి బెజవాడ కథలు 'గన్స్ అండ్ మాన్సూన్స్', బూదూరి సుదర్శన్ నవల 'కెమిస్ట్రీ', ఉషజ్యోతి బంధం కవిత్వం 'ఉన్మత్త'.. ఇవి ఈ మధ్యకాలంలో నేను పూర్తిగా చదివి ఇష్టపడినవి.

బాల్యంలో/ యవ్వనంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

నా పదవ ఏట రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో చలం 'మైదానం' నవల చదివిన గుర్తు. అప్పుడేం అర్థం కాలేదు గాని ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకి మళ్ళీ చలం సాహిత్యమే నన్ను బాగా కట్టిపడేసింది. డిగ్రీ సిలబస్‌లో భాగంగా చదివిన హెన్రీ డేవిడ్ థోరో రాసిన 'వాల్డెన్' పుస్తకం నన్ను ఎందుకో కుదిపేసింది. ఆయన ప్రతిపాదించిన జీవన విధానాలు; ప్రకృతిని, జీవితాన్ని గురించి ఆయన చెప్పే తత్వపు విశేషాలతో, ప్రకృతికి దగ్గరగా అతితక్కువలో జీవిస్తూ ఉండడం గురించి రాసిన పుస్తకం ఇది. చదవడంలో ఉండే ఒక గొప్ప అనుభూతిని ఇచ్చిన పుస్తకం ఇది. ఆ తర్వాత స్మైల్. బాబా రాసిన 'బేచారే' కథలు ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు.

మీ పఠనంపై ఇంట్లో తల్లిదండ్రుల ప్రభావం?

అమ్మ డా. పుట్ల హేమలత, నాన్న డా. ఎండ్లూరి సుధాకర్‌లు ఇద్దరూ రచయితలు, విరివిగా చదివిన వారిగా ఇంట్లో పుస్తకాలు ఎప్పుడూ అందుబాటులోనే ఉండేవి. ఫలానాది చదవకూడదు అనే మాటే ఉండేది కాదు. పురాణాల నుండి నేటి ప్రతి పుస్తకం దాకా చదవాలని నాన్న ఎప్పుడూ చెప్పేవారు. అమ్మ ఎక్కువ అనువాదాలను, వాటి అసలు రచనలను చదవమని చెప్తుండేవారు. భాష మీద, అర్థాల మీద పట్టుని ఇష్టపడేవారు.

మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?

నాకంటే ముందు రాసిన ప్రతి రచయిత– అని చెప్తాను. నేను రాస్తున్న క్రైస్తవ, దళిత, స్త్రీ అస్తిత్వ కథల నుంచి ప్రేమ కథల వరకు సంఘటన, సందర్భం బట్టి వాటిని నేను చూసే తీరు మారినా, ప్రతి అస్తిత్వానికి ముందు తరం రచయితలు నిర్దిష్టమైన దారులు వేశారు. ఒక నమ్మకాన్ని, ధైర్యాన్ని తర్వాతి వారికి ఇచ్చారు.

మీరు రాసిన కథల్లో మీకు బాగా నచ్చిన పాత్ర?

నేను రాసిన 'బొట్టు భోజనాలు' కథ లోని కథా నాయిక పాత్రను గురించి ఇప్పటికీ పాఠకులు గుర్తు చేస్తుంటారు. అప్పటివరకు స్నేహితులుగా కలిసిమెలసి ఉండే ఆఫీస్ కలీగ్స్ పండక్కి తన ఆహ్వానాన్ని నిరాకరించినప్పుడు ఆ పాత్ర వండిన ఆ వంటకాలని, ఆ పరిస్థితిని హ్యాండిల్ చేసిన విధానాన్ని వివక్షను అర్థం చేస్కున్న ఏ ఒక్కరూ మర్చిపోలేరు.

ఏ గత కాలం రచయితనైనా కలవగలిగితే ఎవరిని కలుస్తారు?

మొట్టమొదటి తెలుగు దళిత కథా రచయిత్రి తాడి నాగమ్మను కలుస్తాను. ఈ ఊహ తల్చుకోడానికే ఆనందంగా ఉంది. ఆమె 1930లలో కథలు రాశారు. నిజానికి ఆమె పెద్దగా దళిత కథలు రాయలేదు. ఆమె అభిరుచి అంతా అంతర్జాతీయ రాజకీయాలు. ఆమె అభివ్యక్తి వేరు. ఆమె రాసిన 'మొదటి ముద్దు' కథపై ఇప్పటికీ విశ్వవిద్యాలయాల్లో చర్చలు చేస్తుంటారు. ఆమె టీచర్‌గా పని చేస్తూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు వైద్యం కూడా చేసేవారు. ఆమెను గురించి పూర్తి వివరాలు, కథలతో రచయిత, చరిత్రకారులు సంగిశెట్టి శ్రీనివాస్ పుస్తకం తెచ్చారు. ఆమెను కలిస్తే అప్పటి దళిత స్త్రీ స్థితిగతులు, దళిత కులాలలోని వ్యత్యాసాలు, రాజకీయ అభివృద్ధి గురించి మాట్లాడతాను.



రచన విషయంలో మీకు మీరు అర్థం చేసుకున్న ఏదైనా అంశం?

నా వరకు ఒక మంచి కథ రాయడమంటే కొన్ని రోజులు మనసు అతలాకుతలం అవుతుంది. మరింక దేనికీ చోటుండదు. కొన్ని సంకలనాల కోసమని నన్ను నేను తొందర పెట్టుకుని రాసిన కథలు పాఠకుల ప్రశంసలు పొందినా నాకు సంతృప్తి లేకుండా చేశాయి. అప్పుడే గాఢంగా అనుకున్నాను– మన దగ్గర బ్రహ్మాండమైన వస్తువు సిద్ధంగా ఉన్నా, బలవంతంగా రాయలేం అనీ, రాయకూడదు అని. ఆలస్యం చేసే నష్టం కంటే, తొందరపాటు తెచ్చిపెట్టే తంటా ఎక్కువ.

(మానస ఎండ్లూరి కథల సంపుటి 'మిళింద' 2018లోను, శరణ్ కుమార్ లింబాలే మరాఠీ నవలకు మానస తెలుగు అనువాదం 'ఊరికి దక్షిణాన' 2021లోను వచ్చాయి.)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని భవానీనగర్, స్నేహనగర్, మసీద్, హనుమాన్ టెంపుల్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మంజూరు చేయండి

- వరంగల్‌లో స్పోర్ట్స్ స్కూల్‌కు కూడా అనుమతులు ఇవ్వండి
- సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్ ఎమ్మెల్యేల విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఉనికిచర్ల వద్ద స్టేడియం, స్కూల్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- డీపీఆర్ తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు



సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగారాజు

వరంగల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్న వరంగల్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని మంజూరు చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. వరంగల్‌లో కేవలం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఒక్కటే ఉందని, పెరుగుతన్న జనాభా, క్రీడాకారుల అవసరాలను తీర్చలేకపోతుందని వివరించారు.

ఈ క్రమంలో హనుమకొండ జిల్లా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియంతో పాటు తెలంగాణ క్రీడాపాఠశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీని కోసం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల వద్ద జాతీయ రహదారి పక్కన కూడా లేఅవుట్ సమీపంలో 30ఎకరాల స్థలం అందుబాటులో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకవచ్చారు. యువతలో క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని స్టేడియంతో పాటు క్రీడాపాఠశాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే సంబంధిత స్పోర్ట్స్ అథారిటీ కార్యదర్శికి ఫోన్ చేసి వెంటనే వరంగల్‌లో క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాలకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉనికిచర్ల వద్ద అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి డీపీఆర్ తయారు చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా స్టేడియం, క్రీడాపాఠశాల ఏర్పాటుకు కావాల్సిన అన్ని వివరాలతో నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేల సమక్షంలోనే సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా, తమ విజ్ఞప్తికి వెంటనే సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ జోష్

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం కోటా



- సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భారీగా సీట్ల కేటాయింపు
- జడ్పీ చైర్మన్‌లు, ఎంపీపీల్లో పెరగనున్న ప్రాతినిధ్యం
- గత ఎన్నికల్లో కేవలం 22 శాతమే రిజర్వేషన్
- అయినా జనరల్ స్థానాల్లో ఓసీలను ఢీకొట్టిన బీసీలు
- ఈసారి రిజర్వేషన్ల పెంపుతో వెల్లివిరుస్తున్న ఆనందం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఈసారి స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం లభించనుంది. 2019లో జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో 22శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను ప్రభుత్వం ఈసారి ఆర్డినెన్స్ ద్వారా 42శాతానికి పెంచుతోంది. దీంతో బీసీలకు స్థానికంలో ప్రాధాన్యత డబుల్ కానుంది. కులగణన నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభాలో 56.33శాతం బీసీలు ఉన్నారని తేలింది. దీంతో కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు బీసీ సంఘాల నేతల డిమాండ్‌కు అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మునిసిపల్ ఎన్నికల్లో ఇప్పుడున్న వాటికి అదనంగా బీసీలకు 20శాతం రిజర్వేషన్లను పెంచి 42 శాతం అమలు చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 36,46,955 మంది జనాభా ఉండగా, ఇందులో బీసీలు 14,28,043మంది (40 శాతం) ఉన్నట్లుగా గుర్తించారు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో 45శాతానికి పైగా ఉన్నట్లు సమాచారం. పదేళ్లలో బీసీల జనాభా నాలుగు నుంచి ఐదు శాతం పెరిగినట్లుగా అంచనా. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు పట్టుబడుతుంటంతో ఆర్డినెన్స్ ద్వారా బీసీల డిమాండ్‌ను తీర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

2019లో జనరల్ స్థానాల్లో బీసీల హవా

గత 2019 లోకల్‌బాడీ ఎన్నికల్లో 34శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను గత ప్రభుత్వం 22శాతానికి కుదించింది. 50శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదనే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లను కుదించాల్సి వచ్చింది. అయినప్పటికీ అనేక మంది జనరల్ స్థానాల్లో విజయం సాధించి బీసీలు సత్తా చాటారు. అప్పట్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో బీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాభా ఆధారంగా ఎస్టీలకు అధికంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినప్పటికీ రిజర్వేషన్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో సైతం బీసీలు పోటీ చేసి విజయం సాధించారు. మొత్తం 1,688 స్థానాల్లో 422 సీట్లలో బీసీలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. ములుగు జిల్లాల్లో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికి జనరల్ స్థానాల్లోపోటీ చేసి 29మంది బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 22శాతం రిజర్వేషన్ల కంటే అదనంగా 200స్థానాల్లో బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తంగా 25.5శాతం సీట్లు బీసీల పరం అయ్యాయి. ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 792 స్థానాలు ఉండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 198ఎంపీటీసీ స్థానాలు ఉంటే కేవలం బీసీలకు 5స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, మరో 32 జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ఫలితంగా (మిగతా 8లో..)

2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీసీల ప్రాతినిధ్యం ఇలా

	వరంగల్	హనుమకొండ	జనగామ	మానుకోట	భూపాలపల్లి	ములుగు
గ్రామ పంచాయతీలు	325	210	281	461	240	150
బీసీ రిజర్వుడు	48	46	39	22	51	06
మొత్తం బీసీలు నెగ్గినవి	63	68	95	67	100	29
మొత్తం ఎంపీటీసీలు	134	130	128	198	102	72
బీసీ రిజర్వుడు	35	30	17	05	23	25
మొత్తం బీసీలు నెగ్గినవి	53	63	55	37	43	26
మొత్తం జడ్పీటీసీలు	11	12	12	16	11	08
బీసీ రిజర్వుడు	01	03	01	00	02	02
మొత్తం బీసీలు నెగ్గినవి	05	05	01	02	04	03

నేడు భూపాలపల్లి జిల్లాకు ముగ్గురు మంత్రుల రాక

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు 6



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాగునీరు ఇవ్వకపోతే..

- సీఎం ఇంటి ఎదుట ధర్నా చేస్తాం
- రైతులను ఆగం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సాగుకు నీరు ఇవ్వకపోతే సీఎం ఇంటి ముందు ధర్నా చేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తున్నదని, తెలంగాణ వచ్చిందే నీళ్ల కోసం, అలాంటి నీళ్ల కోసం రైతులు అరిగోసపడుతున్నట్లు తెలిపారు. ఎస్సారెస్పీ కాలువలోకి వెంటనే సాగునీరు విడుదల చేయాలన్నారు. ఈ సీజన్‌లో నీరు విడుదల (మిగతా 8లో..)



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి



అమ్మవారిని దర్శించుకున్న రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఏకే సిన్హా

అమ్మవారి సన్నిధిలో ఉన్నతాధికారులు

వరంగల్ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఏకే సిన్హాతో పాటు చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ డి.సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారికి ఈవో శేషు భారతి, ధర్మకర్తలు ఆశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

బస్తీ దవాఖానాలేవి?

- జనాభా కనుగుణంగా ఏర్పాటులో నిర్లక్ష్యం
- 10వేల జనాభాకు ఒకటి చొప్పున ఉండాలి
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటైనవి తొమ్మిది మాత్రమే
- ప్రతీ మునిసిపాలిటీలో గరిష్టంగా ఐదు ఏర్పాటు చేయాలి
- ఉమ్మడి జిల్లాలో 12 పురపాలికలు
- ఆరు మునిసిపాలిటీల్లో అసలే లేవు

7

బోనమెత్తిన మంత్రి కొండా సురేఖ

- స్వగ్రామం వంచనగిరి మైసమ్మతల్లి ఆలయంలో ఘనంగా వేడుకలు
- ప్రజా పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి మొక్కులు

గీసుగొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్వగ్రామం వంచనగిరిలో మైసమ్మతల్లి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బంగారం బోనం సమర్పించారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మైసమ్మతల్లి ఆలయానికి ఆమె కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు మంత్రి తెలిపారు. స్వగ్రామంలో గత 4ఏళ్లుగా ప్రతి సంవత్సరం అమ్మవారికి గ్రామస్తులతో కలిసి బోనాలు సమర్పిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల సంస్కృతికి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు బోనాల ఉత్సవాలు ప్రతీకలన్నారు. వరంగల్ భద్రకాళి అమ్మవారికి ఆషాడమాసంలో మొదటి బోనం సమర్పిస్తామనుకున్నామని, కొందరు ఈ అంశంపై అభ్యంతరం వ్యక్తం చేయటంతో వెనక్కి తగ్గినట్లు చెప్పారు. బోనం అంటే ఎప్పుడైనా, ఎక్కడైనా అమ్మవారికి సమర్పించు కోవచ్చని వేదపండితులు సూచించినట్లు ఆమె తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలే ఎక్కువగా అమ్మవారిని కొలుస్తుంటారన్నారు. కొన్ని దశాబ్దాల కిందట ఇక్కడ ఉండే కోటగండి వద్ద అమ్మవారు వెలిసినట్లు చెప్పారు. మూడు రాళ్ల పెట్టి వాటి మధ్యలో దీపం పెట్టి మైసమ్మ అమ్మవారిగా కొలిచేవారన్నారు. కాగా, కొద్ది సంవత్సరాల కిందట కోటగండి మైసమ్మ తల్లికి ప్రత్యేక ఆలయాన్ని తాను నిర్మించినట్లు చెప్పారు. ఆ తల్లి దీవెనలు తమ కుటుంబంపై ఉండటం వల్లే తాము ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు. కాగా, బోనాలతో గ్రామం నుంచి ఆలయానికి గ్రామస్థులతో మంత్రి తరలి వెళుతున్నపుడు రడం భరత్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో కొండా దంపతుల కుమార్తె సుష్మితాపటేల్, అల్లుడు డాక్టర్ అభిలాష్, నాయకులు గోపాల నవీన్‌రాజు, రడం భరత్, వీరగోని రాజ్‌కుమార్, రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



బోనంతో మంత్రి సురేఖ, కుమార్తె సుష్మితాపటేల్

నగరంలో డూప్లి'కేటుగాళ్లు'

కన్సల్టెన్సీ, ఆన్‌లైన్ సెంటర్ల ముసుగులో నకిలీ సర్టిఫికెట్ల విక్రయాలు

- ప్రభుత్వ అధికారుల సంతకాలు ఫోర్జరీ
- అడిగినంత ఇస్తే ఏ సర్టిఫికెటైనా ఇచ్చేస్తారు..

మట్టెవాడ జూలై 20 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లి చదవాల్సిన అవసరం లేదు.. కార్యాలయానికి వెళ్లనక్కర్లేదు.. ఎలాంటి దరఖాస్తులు చేయకుండనే ఈజీగా నకిలీ సర్టిఫికెట్లు పొందవచ్చు. ఈ దందా నగరంలో కొన్నేళ్ళుగా యథేచ్ఛగా సాగుతోంది. ఆన్‌లైన్ సెంటర్లు, ఆధార్ నమోదు సెంటర్లు, కొన్ని జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఈ దందాతో రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఈ విషయంలో ఎన్ని కేసులు నమోదు అవుతున్నాయి.. ఎంతో మంది పట్టుబడుతున్నారు.. అయినా తగ్గేది లేదు అన్నట్లు డూప్లికేట్ గాళ్ళు రెచ్చిపోతున్నారు. అడిగినంత ఇస్తే బర్త్‌డే నుంచి డెత్ డే వరకు ఏ సర్టిఫికెట్ అయినా వెంటనే ఇచ్చేస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్లపై పోలీసులు కఠినంగా వ్యవరిస్తున్నప్పటికీ అక్రమ దందాను ఆపలేకపోతున్నారు.

ఏయే సర్టిఫికెట్లు ఇస్తారు..

డబ్బులిస్తే బర్త్‌డే, డేత్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డుల చేర్పులు మార్పులు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికేట్లు, నివాస ధ్రువీకరణ, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, డిపెండెంట్ సర్టిఫికెట్లు, మెడికల్, మనీ లాండరింగ్ సర్టిఫికెట్లు, ఓటర్ ఐడీ కార్డులు, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికేట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో లబ్ధి పొందేందుకు అర్హత పత్రాలు, విదేశాలకు వేళ్ళే వారికి నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లను బహిరంగంగా విక్రయిస్తున్నారు.



అధికారుల సంతకాల ఫోర్జరీ..

ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నగరంలో పెద్ద ఎత్తున నకిలీ సర్టిఫికెట్ల దందాను కొనసాగిస్తున్నారు. తహసీల్దార్, రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి దొంగ స్టాంపులు వేసి మరీ విక్రయిస్తున్నారు. కొంతమంది నకిలీ ఓటర్ ఐడీకార్డులతో పాస్‌పోర్టులు పొందుతున్నట్లు తెలుస్తోంది.

మచ్చుకు కొన్ని కేసుల వివరాలు..

- 2022లో వివిధ యూనివర్సిటీల పేరుతో నకిలీ సర్టిఫికెట్లను తయారు చేస్తున్న ముఠాను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరివద్ద 88 నకిలీ సర్టిఫికెట్లు, స్టాంపులు, ప్రింటర్లను స్వాధీన పరుచుకున్నారు. ఈ ముఠా అప్పటికే 665నకిలీ సర్టిఫికెట్లను జారీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో 15 మందిని అరెస్ట్ చేశారు.
- 2023లో నకిలీ సర్టిఫికెట్లతో ఎంబీబీఎస్ సీట్లు పొందిన కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.
- 2024 సెప్టెంబరులో వరంగల్‌లో తహసీల్దార్ సంతకాలు ఫోర్జ రీ చేసి నకిలీ ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్లు, నకిలీ కుల, ఆదా య ధ్రువపత్రాలను జారీ చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేశారు. వరంగల్ రవాణా కార్యాయంలో నకిలీ ఇన్సూరెన్స్, వెహికిల్ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను జారీ చేసిన కేసులో 10మందిని అరెస్ట్ చేశారు.
- 2025 జూలై 12న వరంగల్ ఎంజీ రోడ్డులో ఆన్‌లైన్ సెంటర్ పేరుతో నకిలీ సర్టిఫికేట్లను తయారు చేస్తున్న ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులతో పాటు మరి కొందరిని అరెస్టు చేశారు.

నక్షత్ర దీక్షల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి



వీరభద్రస్వామి నక్షత్ర దీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

భీమదేవరపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి నక్షత్ర దీక్షల పోస్టర్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈనెల 25న శ్రావణమాసం ప్రారంభం కానుంది. 27న వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఈ నెల 27న ప్రారంభమై ఆగస్టు 23 వరకు వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పోస్టర్‌ను హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ఆదివారం ఆవిష్కరించారు. గత సంవత్సరం వీరభద్రస్వామి నక్షత్ర దీక్షను మంత్రి తీసుకున్నారు. నక్షత్ర దీక్ష సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు భక్తిభావంతో ముందుకు సాగాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఏసీపీ సదానందం, ఆలయ ఈవో కిషన్‌రావు, మాజీ చైర్మన్ పిడిశెట్టి కనకయ్య, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజయ్య, నక్షత్ర దీక్షల గురుస్వామి మొగిలిపాలెం రాంబాబు, వినయ్‌శర్మ, శ్రీకాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకు ప్రీ పీహెచ్‌డీ ఫీజులు చెల్లించాలి

కేయూ క్యాంపస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్, సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, కామర్స్, లా, ఎడ్యుకేషన్ విభాగాల్లో ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజును జూలై 30వ తేదీ వరకు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో ఆగస్టు 7 వరకు చెల్లించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. 2021-22 ఏడాదిలో రెండో, మూడో జాబితాలో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు కూడా ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజును చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అభ్యర్థులకు నిర్వహించనున్న పరీక్షల తేదీలను తర్వాత ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్ల కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్ల నూతన కార్యవర్గం

నర్సంపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఆదివారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, అధ్యక్షుడిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీష్‌రెడ్డి, కార్యదర్శిగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లఅండలు శ్రీరామ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నర్సంపేట, చేర్యాల, స్టేషన్‌ఘన్‌పూర్, ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్‌లు పాలాయి శ్రీనివాస్, నల్లనాగుల శ్వేతవెంకటాచారి, జూలకంటి లావణ్యశిరీష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు భూపాలపల్లి జిల్లాకు ముగ్గురు మంత్రుల రాక

- పర్యటనను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు వరంగల్ ఎంపీ కడియం కావ్య సోమవారం పర్యటించనున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 11 గంటలకు గోరికొత్తపల్లి మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారని, గణపురం మండలం చెల్పూరులో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. చెల్పూరులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రులు మాట్లాడుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భూపాలపల్లి భాస్కరగడ్డలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శిస్తారన్నారు. పాత ఎస్పీ కార్యాలయంలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించిన గ్రంథాలయాన్ని మంత్రులు, ఎంపీల చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. విలేకరుల సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, బుర్ర కొమరయ్య, అప్పం కిషన్, శిరుప అనిల్, ముంజాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చెల్పూర్, రేగొండలో ఏర్పాట్లు పూర్తి

గణపురం/రేగొండ (ఆంధ్రజ్యోతి) : గణపురం, రేగొండ మండలాల్లో మం త్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్, పొన్నం ప్రభాకర్ పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గణపురం మండలం చెల్పూరులో బస్టాండ్ నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. రెండు మండలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ నేపథ్యంలో అధికారులు సభా స్థలిని చదును చేసి వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

జోరు వర్షం

- ఆత్మకూరులో దంచికొట్టిన వాన

హనుమకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జోరుగా వర్షం కురిసింది. సరాసరి 26.6 మి.మీ వర్షం పడింది. ఆత్మకూరులో వాన దంచికొట్టింది. ఈ మండలంలో అత్యధికంగా 90మి.మీ కురిసింది. హనుమకొండ మండలలో 49.4మి.మీ, పరకాల మండలంలో 46.4 మి.మీ, ధర్మసాగర్ మండలంలో 33.2మి.మీ వర్షపాతం రికార్డయింది. భీమదేవరపల్లిలో అతితక్కువగా 2.6 మి.మీ వర్షం పడింది. వేలేరులో 5 మి.మీ, ఎల్కతుర్తిలో 3.4 మి.మీ, హసన్‌పర్తిలో 28 మి.మీ, కాజీపేటలో 14.9 మి.మీ, ఐనవోలులో 3.9మి.మీ, దామెరలో 33,5మి.మీ,శాయంపేటలో 24.3మి.మీ, నడికుడలో 31.2మి.మీ వర్షం పడింది. ఇప్పటివరకు మూడు మండలాలు వేలేరు, హనుమకొండ, ఆత్మకూరులో సాధారణ వర్షపాతం రికార్డయింది. 11 మండలాల్లో ఇప్పటికీ 25 శాతం లోటు వర్షపాతం ఉంది. ఎల్కతుర్తిలో అత్యధికంగా 40శాతం లోటు నమోదైంది. సాధారణంగా 298.3మి.మీ వర్షం పడాలి. కానీ 222.9 మి.మీ కురిసింది. గత 24 గంటల్లో వరంగల్ జిల్లా కేంద్రంలో 61 మి.మీ, జనగామలో 15.6 మి.మీ, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో 54.6 మి.మీ, ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలో 42.5మి.మీ, భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో 15.6 మి.మీ వర్షం పడింది. రానున్న 24 గంటల్లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

అక్రమంగా అటవీ భూమి చదును

నల్లబెల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందాపూర్ శివారులో అక్రమంగా ఫారెస్ట్ భూమిని కొందరు వ్యక్తులు డోజర్లతో చదును చేస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఫారెస్ట్ భూమిని చదును చేసిన అనంతరం డోజర్ వాహనాలు మొక్కజొన్న పంటల్లోంచి పోనివ్వడంతో నష్టం జరిగిందని రైతులు తెలిపారు. అంతేకాక, ఫారెస్ట్ భూమిని చదును చేస్తున్నారని తెలిసినా ఫారెస్ట్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పంటలకు నష్టం జరిగిందని ఈ నష్టానికి బాధ్యులెవరని ప్రశ్నించారు. తమ పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధ్యులపై ఫిర్యాదు చేశాం..

ఫారెస్ట్ భూమిని కొందరు వ్యక్తులు డోజర్లతో చదును చేస్తున్నారని సమాచారం రాగానే, తక్షణమే ఘటన స్థలి వద్దకు వెళ్లామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి సోమ తెలిపారు. మమ్మల్ని చూసి డోజర్ల వాహనాలతో చదును చేస్తున్న ప్రాంతం నుంచి తప్పించుకున్నారన్నారు. అనంతరం బాధ్యులను గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.



గోవిందాపూర్ శివారులో డోజర్లతో అటవీ భూమిని చదును చేసిన దృశ్యం

ఎన్నికలంటేే కాంగ్రెస్ పార్టీకి భయం

- రానున్న ఎన్నికల్లో మెజారిటీ గ్రామాల్లో బీఆర్ఎస్ పాగా వేయాలి
- జంప్ జిలానీలను పార్టీలోకి తీసుకోం
- బీజేపీ వల్లే తన ఓటమి
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుగొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ భయపడుతుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ఎస్ఎస్ గార్డెన్‌లో పోలీస్ ధర్మారావు అధ్యక్షతన గీసుగొండ, సంగెం మండలాల పార్టీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 20 నెలల కాలంలో చేసింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలు మోసపూరితం అని ప్రజలు గ్రహించారన్నారు. రానున్న ఎన్నికలలో మెజారిటీ గ్రామాల్లో బీఆర్ఎస్ పాగా వేస్తుందని చెప్పారు. గతంలో పార్టీని వీడిన జంప్ జిలానీలను కాళ్లు మొక్కిన మళ్లీ పార్టీలోకి తీసుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీకి క్రాస్ ఓటింగ్ జరగటం వల్లే తాను ఓడిపోయానని ఇందులో కాంగ్రెస్ గొప్పతనం ఏమిలేదని స్పష్టంచేశారు.కాంగ్రెస్‌లో చిల్లర నాయకుల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయ న్నారు. వారు మట్టి, ఇసుక దందాను పనిగా పెట్టుకున్నా రన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కాంగ్రెస్‌పార్టీ తొత్తులుగా మారారని ఆరోపించారు. రూ.93 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. సీఎంకు ముందు చూపు లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. సీఎంకు దుర్భాషలాడటం తప్ప రైతులను ఆదుకోవాలన్న సోయి లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా వ్యవహరి స్తుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత తాము కూడా గెట్టుపెట్టి రాజకీయం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత కుమ్మలాటలు ఉన్నాయని, వాటికి బీఆర్ఎస్ పార్టీ కొంత పొగపెడితే సరిపోతుంద న్నారు. సోషల్ మీడియా కాంగ్రెస్ పార్టీ అవినీతిపై అలర్ట్‌గా ఉండి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు అధైర్యపడకుండా కష్టపడి పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీలు పోలీస్ ధర్మారావు, గూడ సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొల్లూరి రవీందర్, మాజీ ఎంపీపీ దొనికెల మల్లయ్య, కార్పొరేటర్ గద్దె బాబురావు, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సుంకరి శివ, బోడకుంట్ల ప్రకాష్, ముంత రాజయ్య, గోలి రాజయ్య, అంకతి నాగేశ్వర్‌రావు, పులుగు సాగర్‌రెడ్డి, సారంగపాణి, సదానందం, కంబాల కోటి, యార బాలకృష్ణ, సిరిసె శ్రీకాంత్, దిలీప్‌కుమార్, పెండ్లి కుమారస్వామి, గోవర్ధన్, పోశాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏకమైతేనే రిజర్వేషన్లు సాధ్యం

- మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి



సమావేశంలో మాట్లాడుతున్న పరికిపండ్ల నరహరి

బాలసముద్రం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజిక వర్గాలు, రాజకీయ పార్టీలు ఏకమైతేనే పార్లమెంట్ చట్టం ద్వారా రిజర్వేషన్లు సాధ్యమవుతాయని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అన్నారు. ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు బోర్డు సౌజన్యంతో జన అధికార సమితి ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఓబీసీల పోరుబాట పుస్తక సమీక్ష సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి వ్యాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, గోట్స్ షీప్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య, వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరికిపండ్ల నరహరి మాట్లాడుతూ బీసీలు ముందుగా సామాజిక న్యాయం గురించి కాకుండా అధికారం గురించి మాత్రమే ఆలోచించాలని అన్నారు. రాష్ట్రంలో బీసీలలో ప్రధానంగా ఐదు కులాలు అధిక జన సంఖ్య కలిగి ఉన్నారని వారంతా ఏకతాటిపైకి వస్తే అధికారం చేజిక్కించుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామని ఇది ఎంత వరకు సాధ్యమనే సందేహాలు కూడా ఉన్నాయన్నారు. పలు రాష్ట్రాలో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని చూస్తే రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రెండు అగ్రకులల కలయికతో రాజ్యాధికారం సాధిస్తున్నారని బీసీలంతా ఏకదాటిపైకి వస్తే పరిణామం ఎలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీసీల పోరుబాట పుస్తక సమీక్షను ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ నిర్వహించారు.

సమావేశంలో జనాధికార సమితి అధ్యక్ష, కార్యదర్శులు చేరాల నారాయణ, కృష్ణమూర్తి, పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, సీనియర్ జర్నలిస్టు రచయిత గడ్డం కేశవమూర్తి, వేముల సదానందం, డాక్టర్ పద్మజాదేవి, కరేటి శంకర్‌రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవి హైనా పాదముద్రలు

మల్హర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ నుంచి తాడిచర్లకు వెళ్లే అటవీ మార్గంలో గుర్తించిన పాదముద్రలు హైనాకు చెందినవిగా ఫారెస్టు అధికారులు తెలిపారు. మండల ప్రజలు ఎవరూ హైరానా చెందాల్సిన అవసరం లేదన్నారు. పులి పాదముద్రల ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గ్రామస్థులు భయాందోళనకు గురికావద్దని సూచించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

చిట్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రామచందర్ మాదిగ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వికలాంగులకు రూ.6వేలు, వితంతువులకు రూ.4వేలు పెన్షన్ ఆగస్టు నుంచి అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి రానున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా కోఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్య క్షుడు వంశీకృష్ణ, మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్, సీనియర్ నాయ కులు ఓదెల, భిక్షపతి, తిరుపతి, సురేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో ఘనంగా బోనాల పండగ





పోతరాజుల నృత్యాలు

కాజీపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. విష్ణుపురి, సోమిడి, విద్యానగర్, మహిళలు మంగళహారతులతో బోనాలు ఎత్తుకుని మహంకాళి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకునే క్రమంలో పోతరాజులు భారీ ర్యాలీ నిర్వహించారు. పోతరాజులు పసుపు, కుంకుమ పూసుకుని చేతిలో కొరడాలతో నృత్యం చేశారు. పోతరాజులు నృత్యాలు చేస్తున్న క్రమంలో స్థానికులు వారితో ఫొటోలు దిగడానికి పోటీ పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు బోనాలు పండగ ఘనంగా జరిగింది. స్థానిక మహిళలు అమ్మవారికి పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. ఈ పండగలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వైసుధాకర్‌రెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మంజులకు బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డు





మంజుల వేసిన చిత్రం

హనుమకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారిణి సాగంటి మంజుల బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డుకు ఎంపికయ్యారు. గత నెల నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించిన చిత్రకళ పోటీలకు సాగంటి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అయిన మంజుల సైనికులకు వందనం-సిందూర్ అనే అంశం ఇతివృత్తంగా గీసిన చిత్రానికి గాను ఈ అవార్డు లభించింది. ఈ అవార్డుకు దేశ వ్యాప్తంగా మొత్తం 20 మంది ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఎంపికైన ఏడుగురిలో మంజుల ఒకరు. మిగతా ముగ్గురు వడ్లపూడి లక్ష్మణ్, ఎం.రజనీకాంత్, దేవరాజ్ రమేష్, ఎ.శ్రీకాంత్‌బాబు, ఎం.మహేష్‌తో పాటు మరొకరు ఉన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందిగా కోనోకార్పస్ చెట్లు

- సెంట్రల్ లైటింగ్‌ను కమ్మేస్తున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



హనుమకొండ బాలసముద్రంలో డీవైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

హనుమకొండ టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో హనుమకొండనగరంలో పార్కులు , డీవైడర్ల మధ్యలో నాటిన కోనోకర్పస్ మొక్కలు ప్రజలకు హానికరంగా మారాయి. ఈ మొక్కలు రోడ్ల వెంట, వివిధ పార్కుల వద్ద ఎంతో ఆకర్షణీయంగా ఉండేందుకు రూ.కోట్లు ఖర్చు చేసి మొక్కలు నాటించారు. ఈ మొక్కలతో గాలి పీల్చుకోవాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం డీవైడర్ల మధ్యలో నాటిన మొక్కలు నేడు అవి వృక్షాలుగా మారి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నాయి. గత 8 ఏళ్ల క్రితం ప్రభుత్వం గ్రేటర్ పరిధిలో నగరంలోని పలు ప్రధాన రహదారుల డీవైడర్ల మధ్యలో కోనోకర్పస్ మొక్కలను నాటించారు. ప్రస్తుతం ఆమొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులకు, నగర ప్రజలకు ప్రమాదకరంగా మారాయని ఆ మొక్కల వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు నగర వాసులు వాపోతున్నారు. హనుమకొండ బస్టాండ్ కూడలి నుంచి బాలసముద్రం కూడలిలో డీవైడర్ మధ్యలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి సెంట్రల్ లైటింగ్‌ను సైతం చెట్లు కమ్మేస్తున్నాయని రాత్రి సమయాల్లో చెట్ల పొదలలో నుంచి వెలుతురు రాక ప్రయాణికులు చీకట్లోనే ప్రయాణిస్తున్నట్లు వాపోతున్నారు. ఒక వైపు కోనోకర్పస్ మొక్కలతో అనారోగ్యానికి గురవుతున్న ప్రజలకు , వాహనాల రాకపోకలకు చెట్ల ద్వారా ఇబ్బందులు పడుతున్నట్లు నగర ప్రజలు, ప్రయాణికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు ప్రజలకు ఇబ్బందిగా మారిన కోనోకర్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో పూల మొక్కలు డీవైడర్ల మధ్యలో నాటాలని అధికారులను కోరుతున్నారు.

సూదనపల్లిలో యువకుడి ఆత్మహత్య

కురవి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన నాగబోయిన నగేష్(26) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకుని మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న నగేష్ మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడని, మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. నగేష్ మృతితో తల్లిదండ్రులు వీరన్న,యాదమ్మలు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, నగేష్ మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎడ్లబండ్లు ఎడబాయే!

» సాగులో యాంత్రీకరణ ప్రభావం
» రోజురోజుకు పశువుల తగ్గుముఖం
» ట్రాక్టర్ల రాకతో వడ్రంగి పరికరాలు కనుమరుగు


నల్లబెల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బండెనక బండికట్టి పదహారు బండ్లు కట్టి.. అని పాడుకుంటూ.. రైతులు జోడెడ్ల బండితో వ్యవసాయ పనులు హుషారుగా చేసేవారు. తొలకరి వర్షం కురవడంతో పంట భూములు పచ్చగా చిగురు వచ్చేవి. నాటి పశువుల కేరింతలతో రైతులు మురిసిపోయేవారు. కానీ, నేడు రైతుల రథం జోడెడ్ల బండ్లు కనుమరుగైపోయాయి.

ఇంటి ముందు కానరాని జోడెడ్లు

ఇంటి ముందు జోడెడ్లు, ఎడ్ల బండి ఉంటే రైతులు ఆభరణాలుగా భావించేవారు. రైతులు వ్యవసాయ పనులకు పనిముట్లు, ఎరువులు, పంటను తరలించేందుకు ఎడ్లబండ్లను ఉపయోగించేవారు. రోజురోజుకు వాటి వినియోగం తగ్గిపోయింది. రైతుల ఇంటి ముందు రాజహంసల ఉండే బండ్లు నేడు కానరావడం లేదు. రైతుల జీవితంలో మమేకమై వారికి చైతన్య రథంలా సేవలందించిన ఎడ్లబండ్లు నేడు కనిపించకుండా పోయాయి. నాడు మండలాల్లో, డివిజన్లలో ఎడ్ల పోటీలు పండుగలకు పెట్టేవారు. పోటీల్లో గెలుపొందిన జోడెడ్లకు బహుమతులు ఇచ్చేవారు.

బండ్లుపోయే.. ట్రాక్టర్లు వచ్చే..

ప్రతీ గ్రామంలో ట్రాక్టర్లు వచ్చేశాయి. వ్యవసాయ పనులకు ఉపయోగపడుతున్నాయి. దీంతో చాలా సమయం ఆదా అవుతుంది. రైతులు ఎడ్లబండ్లను పక్కన పెట్టి ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. రైతులు టేకు కలపను తీసుకువచ్చి వడ్రంగితో వ్యవసాయ పనిముట్లు చేయించుకునేవారు. ట్రాక్టరు ద్వారా చేసే వ్యవసాయ పనులతో పెట్టుబడులు ఎక్కువ అవుతుండడంతో ఒకప్పటి ఎడ్ల బండ్లను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.



కనిపించని ఆనాటి వైభవం

వ్యవసాయ పనుల్లో మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో క్రమేణ యాంత్రీకరణ పెరిగింది. ఎడ్ల పోషణ రైతులకు కష్టంగా మారింది. వాటిని పెంచలేక రైతు కష్టాల్లో కూరుకుపోయాడు. దీంతో ఎడ్ల బండ్లు మూలనపడ్డాయి. నాడు ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న బండ్లు, నేడు ఒకటి లేదా రెండు కనిపిస్తున్నాయి. నేడు అవి కూడా మూలనపడే అవకాశం ఉంది. నాడు ఎడ్ల బండ్లు, పశువులు లేనివారు కిరాయి మాట్లాడుకొని వ్యవసాయ పనులు చేసుకునేవారు.

ఇప్పుడన్నీ యంత్రాలతోనే పనులు

అజ్మీరా తిరుపతినాయక్, రైతు, రుద్రగూడెం



ఇప్పుడన్నీ యంత్రాలతోనే వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. నాడు తక్కువ ఖర్చుతో పశువులు, ఎడ్ల బండ్లతో వ్యవసాయం చేసేవాళ్లం. నేడు ప్రతీ పనికి యంత్రాల అవసరం ఎక్కువైంది. వ్యవసాయ పనికి పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. నేటి కంటే నాటి వ్యవసాయమే బాగుండేది. నాటి వ్యవసాయానికి జోడెడ్లు, బండ్లు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కాలక్రమేణా ఎడ్ల బండ్లు, పశువులు తగ్గిపోవడం బాధాకరం.

రైతులకు అవసరమైన యంత్రాలు ఇవ్వాలి

బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రైతు, కన్నారావుపేట



జోడెడ్లు తగ్గిపోవడంతో, నేడు రైతులకు యంత్రాలతో వ్యవసాయ పనుల అవసరం పెరిగింది. దీంతో రైతులకు పెట్టుబడి భారం మరింత పెరిగింది. ప్రభుత్వం రైతులకు యంత్రాల కొనుగోలుకు రాయితీ ఇవ్వాలి. పంటలకు సరైన గిట్టుబాటు ధరను కల్పించాలి. ప్రభుత్వం రైతులకు ఎరువులను అందించడంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి. అలాగే రైతులకు ఉపయోగపడే యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలి.



కాటారం అటవీ ప్రాంతంలో భోజనాలు చేస్తున్న ప్రజలు

వన భోజనాల సందడి

కాటారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ఆదివారం వనభోజనాల సందడి కనిపించింది. పలు వాడలకు చెందిన వందలాది మంది వనభోజనాలకు తరలివెళ్లారు. మండల కేంద్ర శివారులో 353(సీ) జాతీయ రహదారి పక్కన అటవీప్రాంతానికి పలు కుటుంబాలు వంటలకు వెళ్లి సామూహిక భోజనాలు చేశారు. వరుణుడు కరుణించి వానలను సమృద్ధిగా కురిపించి పంటలు బాగా పండేలా చూడాలంటూ ప్రతి ఏటా వన భోజనాలకు తరలివెళ్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ప్రజలతో కలిసి పలు పార్టీలకు చెందిన నాయకులు విందు, వినోదాలతో సందడి చేశారు. భోజనాల అనంతరం యువకులు, పిల్లలు డీజే పెట్టుకుని డ్యాన్సులు చేశారు.

మంగపేట మండలంలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రజలు వనభోజనాలకు వెళ్లారు. ఉదయాన్నే చేరుకొని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వంటలు వండుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

శాంతిభద్రతలపై సర్కారు ఫోకస్

» భూపాలపల్లి జిల్లాకు కొత్త ఠాణా, కొత్త సర్కిల్ మంజూరు
» నేడు ప్రారంభించనున్న మంత్రులు
» పరిశీలనలోనే ఉమెన్, ట్రాఫిక్, సైబర్ పీఎస్‌లు

కృష్ణకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలానికి కొత్త ఠాణా మంజూరుతో పాటు కొత్తగా సర్కిల్ ఏర్పాటుకు గెజిట్ విడుదల చేసింది. భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 12 పోలీస్‌స్టేషన్లు ఉండగా.. మూడు సర్కిళ్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ఠాణాతో జిల్లాలో ఠాణాల సంఖ్య 13కు చేరుకుంది. అలాగే, సర్కిళ్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. అయితే, ఇంకా జిల్లా కేంద్రానికి మంజూరు కావాల్సిన ఉమెన్, ట్రాఫిక్, సైబర్ ఠాణాలు ప్రతిపాదనల్లోనే ఉన్నాయి.

కొత్త పోలీస్ స్టేషన్, కొత్త సర్కిల్

భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలంలోని గ్రామంగా ఉన్న కొత్తపల్లిగోరి గ్రామాన్ని ప్రభుత్వం మండలంగా మార్చింది. దీంతో ఆ మండలంలో కొత్తగా ఠాణా మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నేడు (సోమవారం) మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్, ఎస్పీలు నిమగ్నమయ్యారు. ఇక జిల్లాలో ప్రస్తుతం మహదేవపూర్, కాటారం, చిట్యాల సర్కిళ్లు ఉన్నాయి. చిట్యాల సర్కిల్‌ను రెండుగా విభజించి పరిపాలన దృష్ట్యా గణపురం కేంద్రంగా చిట్యాల సర్కిల్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడనున్న గణపురం సర్కిల్ పరిధిలో గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్లు ఉండనున్నాయి.

పరిశీలనలో మరో మూడు ఠాణాలు

భూపాలపల్లి 2016 అక్టోబరు 11న జిల్లాగా అవతరించింది. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో ఇప్పటి వరకు దాదాపు కావాల్సిన ఠాణాలన్నీ ఏర్పాటయ్యాయి. కానీ, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాత్రం ప్రధానంగా ఇంకా మూడు ఠాణాలు ఏర్పాటు కావాల్సి ఉంది. జిల్లా కేంద్రంగా మారడంతో ఈ ప్రాంతానికి రోజురోజుకు వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఠాణా అత్యంత అవసరమైంది. ఏడాదిన్నర కిందట ఎస్పీ కిరణ్‌ఖరే చొరవతో తాత్కాలికంగా ట్రాఫిక్ ఠాణా ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. కానీ, అధికారికంగా ఠాణా మంజూరుకు గెజిట్ విడుదల కాలేదు. అలాగే మహిళల సమస్యల పరిష్కారానికి ఉమెన్ ఠాణా సైతం ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్లలో మహిళా పోలీసు అధికారులు లేక మహిళలు వారికి ఎదురయ్యే సమస్యలను పురుష పోలీసులకు చెప్పుకోలేక మథన పడుతున్నారనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో మహిళా ఠాణా ఏర్పడితే జిల్లా పరిధిలోని మహిళలు, యువతులకు ఆమోదయోగ్యంగా ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు ఇక రోజురోజుకు సైబర్ నేరాలు సైతం జిల్లాలో మితిమీరుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సైబర్ ఠాణాలను కేవలం కమిషనరేట్ పరిధుల్లోనే ప్రారంభిస్తుండగా.. జిల్లాలో అత్యధికంగా సైబర్ మోసాలు జరుగుతున్న దృష్ట్యా ప్రత్యేకంగా సైబర్ ఠాణా అవసరమని పోలీస్ యంత్రాంగం గుర్తించింది. కొన్నేళ్ల కిందటే ఈ మూడు ఠాణాల ఏర్పాటుకు పోలీస్‌శాఖ ప్రతిపానలు పంపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ఈ ఠాణాల ఏర్పాటుపై నిర్లక్ష్యం వహించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి.



మంత్రులు ప్రారంభించనున్న కొత్తపల్లిగోరి తాత్కాలిక పోలీస్‌స్టేషన్

మంత్రులు హామీ ఇచ్చేనా ?

నేడు జిల్లాకు ముగ్గురు మంత్రులు వస్తున్న దృష్ట్యా జిల్లా కేంద్రంలో అవసరమయ్యే మూడు ఠాణాలపై మంత్రులు మాట ఇచ్చేనా ? అనే చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం ఠాణాల ఏర్పాటులో తాత్సారం చేయగా.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకింత దృష్టి సారించి కొత్త మండలానికి అతి తక్కువ సమయంలోనే కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, నూతన సర్కిల్ మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఈ తరుణంలో ప్రతిపాదనల్లో ఉన్న ఈ మూడు ఠాణాలను సైతం త్వరగా మంజూరు చేసేలా దృష్టి సారించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ నెల 21న ముగ్గురు మంత్రులు జిల్లాకు రానున్నందున కొత్త ఠాణా ప్రారంభ వేదికలోనే ఈ మూడు ఠాణాల మంజూరుకు హామీ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

రద్దీగా వన దేవతల గద్దెలు

10 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. వనదేవతలకు భక్తులు సంస్కృతి, సంప్రదాయాల్లో పూజలు చేసి దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గద్దెలకు చేరుకున్నారు. ఎత్తు బంగారం(బెల్లం), కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరెలు, సారెలు సమర్పించారు.

హేమాచలంలో భక్తుల సండే సందడి

మంగపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో వారంతపు సెలవు దినం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 20 వేల మంది భక్తులు దేవాలయానికి చేరి చింతామణి జలధారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. ఉప దేవాలయాల్లో దేవుళ్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ, ప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టత, స్వామివారి చరిత్రను వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అర్చక, ఉద్యోగులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

బస్తీ దవాఖానాలేవి ?

• జనాభాకనుగుణంగా ఏర్పాటులో నిర్లక్ష్యం
• పదివేల జనాభాకు ఒకటి ఉండాలి
• ఉమ్మడి జిల్లాలో ఉన్నవి తొమ్మిది మాత్రమే
• ప్రతీ మునిసిపాలిటీలో గరిష్ఠంగా ఐదు ఏర్పాటు చేయాలి

హనుమకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన బస్తీ దవాఖానాల ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా మురికివాడల్లో నివసించే నిరుపేదలు, గుడిసెవాసులు వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి గానీ, అర్బన్ హెల్త్ సెంటర్లకుగానీ రావలసిన అవసరం లేకుండా వారికి అందుబాటులో ఉండేలా ప్రతీ పది వేల జనాభకు ఒక బస్తీదవాఖానా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్దేశం బాగానే ఉన్నా ఆచరణే లేదు.

బస్తీ దవాఖానాలు తొమ్మిదే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన మూడు మునిసిపాలిటీలను కలుపుకొని మొత్తం 12 ఉన్నాయి. మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి, జనగామతో పాటు కొత్త మున్సిపాలిటీలు ములుగు, కేసముద్రం, స్టేషన్ ఘనపూర్ వీటిలో ఉన్నాయి. వీటికితోడు వరంగల్ మహానగర పాలక సంస్థ ఉన్నది. ప్రతీ పదివేల జనాభాకు ఒకటి చొప్పున బస్తీదవాఖానాను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రకారం కొత్తవాటిని మినహాయిస్తే పాత తొమ్మిది మునిసిపాలిటీళలో గరిష్ఠంగా 5 నుంచి 6 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పది లక్షలకుపైగా జనాభా కలిగిన వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో డివిజన్‌కు ఒకటి చొప్పున 68 ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఇందుకు భిన్నంగా లక్ష జనాభాకు ఒకటి చొప్పున కూడా ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. వరంగల్ కార్పొరేషన్‌తో కలుపుకొని ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో మొత్తంగా 9 బస్తీ దవాఖానాలే ఏర్పాటయ్యాయి. వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 2 వరంగల్‌లో, 3 హనుమకొండలో నెలకొల్పారు. 5 లక్షలకుపైగా జనాభా కలిగిన జనగామ మునిసిపాలిటీ పరిధిలో, 4 లక్షలకు పైగా జనాభా కలిగిన మహబూబాబాద్ పురపాలికలో ఒకటి చొప్పున, భూపాలపల్లి మునిసిపాలిటీలో 2 ఏర్పాటయ్యాయి.

మందుల లేమి

బస్తీ దవాఖానాలకు వచ్చే రోగులకు మందులు సరిగా అందుబాటులో ఉండడం లేదు. ప్రభుత్వం అందజేస్తున్న మందులు 15 రోజులకు మాత్రమే సరిపోతున్నాయని, మిగతా రోజుల్లో రోగులు స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లు, లేదా పీహెచ్‌సీలకు వెళ్లి తీసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో పలుమార్లు రోగులకు, సిబ్బందికి మధ్య తరుచూ వాగ్వాదాలు జరుగుతున్నాయి. ప్రతీ బస్తీదవాఖానాకు ఒక డాక్టర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు సహాయకులు, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఫార్మసిస్టును నియమించాలని రోగులు కోరుతున్నారు.



జనగామ మునిసిపాలిటీ పరిధిలోని బస్తీ దవాఖానా

సిబ్బంది కొరత

బస్తీదవాఖానాలో ఓ మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, ఒక సహాయకుడు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలి. కాని ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీరు వైద్య సేవలు అందించాలి. కాని వారు సమయపాలన పాటించ డంలేదు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, టీకాలు వేయడం లాంటి 57 రకాల వైద్య సేవలు అందించాలి. అంతకు మించిన ఆరోగ్య సమస్య లు, అత్యవసర చికిత్సలకు ఇతర ప్రభుత్వ దవాఖానాలకు రెఫర్ చేయా లి. కానీ సిబ్బంది కొరత కారణంగా ఎక్కడా అమలు కావడం లేదు.

సేవలు అంతంత మాత్రమే..

ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో ప్రస్తుతం ఉన్న బస్తీ దవాఖానాల ద్వారా వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరైన సిబ్బంది లేకపోవడం, మందులు కూడా సరిగా ఇవ్వకపోవడం వల్ల ఈ దుస్థితి తలెత్తుతోంది. బస్తీ దవాఖానాలకు ప్రతీ రోజు 60 నుంచి 70 మంది రోగులు వస్తుంటారు. వారికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులను అందించాలి. ఈ ప్రక్రియను పూర్తిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అనంతరం 3 గంటల లోపు వివరాలను ఆన్‌లైన్ డేటాలో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ సరైన డాటా ఎంట్రీ సిబ్బంది, పరిపడా నర్సులు లేరు.

ఆరు పురపాలికల్లో అసలే లేవు

తొర్రూరు, మరిపెడ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, డోర్నకల్ పురపాలికల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా ఏర్పాటు కాలేదు. వరంగల్‌లో మూడు బస్తీ దవాఖానాలు మంజూరు కాగా స్థలం అందుబాటులో లేదన్న కారణంతో రెండింటినే ఏర్పాటు చేశారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఉప కేంద్రాలు లేకపోవడంతో పురపాలికలోని అన్ని డివిజన్ల ప్రజలకు వైద్య సేవలు అందడం కష్టంగా మారింది. కొన్ని మురికివాడలు, కాలనీలు పట్టణానికి దూరంగా ఉండగా వీరు ఎక్కువగా జిల్లా కేంద్రానికి రావలసి వస్తోంది. లేదా సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళుతున్నారు. దీంతో రోగుల తాకిడి ఎక్కువై గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. వానా కాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశముంది. పురపాలికల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకలు చాలకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

పాఠశాలల్లో వృత్తి విద్యా బోధన

» ఇప్పటికే 10 పాఠశాలల్లో అమలు
» మరో 8 పాఠశాలల్లో పీఎంశ్రీ
» విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి

జనగామ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ- 2020) ప్రకారం పాఠశాల విద్యార్థుల్లో అనుభవపూర్వక నైపుణ్యాలను పెంపొందించడానికి ఫుల్ టైమ్ వృత్తి విద్య కోర్సులు బోధించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జనగామ జిల్లాలో సమగ్రశిక్ష ద్వారా 10 పాఠశాలల్లో ఈ కోర్సులు బోధిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా జిల్లాలో నూతనంగా 8 పాఠశాలల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభిస్తున్నారు. ప్రతి పాఠశాలలో రెండు వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తారు. 9, 10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ కోర్సులను బోధిస్తారు. వృత్తి విద్యను ప్రధాన స్రవంతి పాఠ్యాంశాలకు అనుసంధానించి సెకండరీ స్థాయిలో 9, 10 తరగతులకు సబ్జెక్టుగా, ఇంటర్‌లో తప్పనిసరి సబ్జెక్టుగా అందిస్తారు.

కొత్తగా అమలు చేస్తున్న పాఠశాలలు

వృత్తి విద్యా కోర్సులను ఇప్పటికే 10 పాఠశాలల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా పీఎంశ్రీ పథకంలో కొత్తగా మల్కాపూర్, ఘన్‌పూర్, ధర్మకంచ, తరిగొప్పుల, కూనూరు, పాలకుర్తిలోని జడ్పీహెచ్ఎ స్‌లు, చౌడారంలోని కేజీబీవీ, జఫర్‌గఢ్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ (బాలికలు), మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, అసిస్టెంట్ ప్లంబర్, సీయింగ్ మిషన్ ఆపరేటర్, హెమ్ హెల్త్ ఎయిడ్ ట్రైనీ కోర్సులను అమలు చేస్తున్నారు.



బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న లింగాల ఘణపురం మోడల్ స్కూల్ విద్యార్థులు

ఒకేషనల్ ల్యాబ్‌ల ఏర్పాటు

కోర్సులకనుగుణంగా పూర్తి వనరులతో ఒకేషనల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. అర్హత, అనుభవం ఉన్న ఇద్దరు వృత్తి విద్యా బోధకులను నియమిస్తారు. విద్యార్థులు వారికి ఇష్టం ఉన్న కోర్సుల్లో చేరవచ్చు. కోర్సు చివరలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలతో పాటు ఫీల్డ్ సందర్శన ఉంటుంది. ప్రతి సంవత్సరం విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లాగే ఈ కోర్సులకూ ఫైనల్ పరీక్షలు నిర్వహించి సెకండరీ బోర్డు, సంబంధిత సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సంయుక్తంగా వృత్తి విద్యా సర్టిఫికెట్‌ను జారీ చేస్తాయి. ఈ సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లు నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా వృత్తిపరమైన కోర్సులను అందిస్తాయి. విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలను మదింపు చేస్తాయి. ల్యాబ్‌ల నిర్వహణ, పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల ఫీల్డ్ సందర్శనకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

వృత్తి విద్య ప్రధాన లక్ష్యాలు

విద్యార్థులకు నైపుణ్య ఆధారిత శిక్షణ అందించి ఉపాధిని పెంచడం. పరిశ్రమ అవసరాలు, విద్యా వ్యవస్థ మధ్య అంతరాన్ని తగ్గించడం. విద్యార్థులు స్వయం ఉపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం. విద్యార్థుల డ్రాపౌట్లను తగ్గించడం. రోజువారి పాఠశాల విద్య అభ్యసనలో వెనుకబడుతున్న విద్యార్థులకు ప్రత్యామ్నాయ విద్యను అందించి వారిలో మార్కెట్ ఆధారిత నైపుణ్యాలు పెంచడం.

నైపుణ్యాభివృద్ధికి వృత్తి విద్య దోహదం

బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో




దేశంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో 41 శాతం వృత్తి విద్య అధ్యయనం తమ నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని భావిస్తున్నట్లుగా ఒక సర్వేలో తేలింది. ఆచరణాత్మక శిక్షణతో విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడుతుంది. వృత్తి విద్య అభ్యసన, ఆవశ్యకత ప్రధానమైనదిగా ఎన్‌ఈపీ-2020 గుర్తించింది. 2030 లోగా అన్ని ఉన్నత పాఠశాలల్లో వృత్తి విద్యను భాగం చేయాలని నిర్ణయించింది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు వృత్తి విద్యపై ఆసక్తిని పెంచుకొని, నైపుణ్యం సాధించినప్పుడు భవిష్యత్తులో పలు రంగాల్లో స్థిరపడి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు.

వృత్తి కోర్సుల బోధనకు ఏర్పాట్లు చేశాం..

డి.భోజన్న, డీఈవో, జనగామ



సమాజంలో వృత్తి విద్య నిపుణులకు ప్రాముఖ్యత పెరిగింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం విడతల వారీగా పాఠశాలల్లో వృత్తి విద్య బోధనను ప్రవేశపెడుతుంది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 10 పాఠశాలలకు తోడుగా ఈ సంవత్సరం కొత్తగా 8 పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులను బోధించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఆ పాఠశాలల హెచ్ఎంలు కోర్సులపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పేరెంట్స్ తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలి.



యువత సన్మార్గంలో నడవాలి

వరంగల్ క్రైం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : యువత సన్మార్గంలో నడవాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం పెద్దమ్మగడ్డలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడడం వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. రాత్రి వేళ పిల్లలు ఎక్కడ తిరుగుతున్నారనే దానిపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నివారణకు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్సై పరశురాములు, ఏఎస్ఐ రఘుణారెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్



ప్రెస్ క్లబ్ వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

వడ్డెపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి):ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ. లక్ష కోట్ల నిధులను కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి జిల్లా మీడియా కన్వీనర్ కందగట్ల మోహన్, వరంగల్ జిల్లా కన్వీనర్ ఓడపల్లి శ్యాంకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 22న హైదరాబాద్ గన్‌పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసన, ధర్నాకు సంబంధించిన కరపత్రాల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో పాల్గొన్న ప్రతీ ఉద్యమకారుడికి గుర్తింపు కార్డులు, ఉచిత బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జార్ఖండ్ రాష్ట్రం తరహాలో ప్రతీ ఉద్యమకా రుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలంతోపాటు ప్రతీ నెల రూ. 25 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని అన్నారు. కమిటీలతో కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు తగిన న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు సోమ మధు, భట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

బాలసముద్రం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఇ. నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సహ అధ్యక్షుడిగా ఎం.ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కె.సమ్మారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా సీహెచ్. సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పెంటయ్య నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినా ఒక సమస్యను కూడా పరిష్కరించలేదని అన్నారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని పెన్షనర్లంతా ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన ఉద్బోదించారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి

యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్



అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వడ్డెపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చలో సెక్రటేరియట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 23న హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ వద్ద నిర్వహించే ధర్నా, నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి రాకేష్, జిల్లా నాయకులు మనోజ్, దినేష్, చిన్న బన్ని, శివ, శ్రీనివాస్, ప్రణయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం సభ్యులు

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేయూ ఫస్ట్ గేట్ సమీపంలోని శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 54వ డివిజన్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మండల శంకరయ్య, ఉపాధ్యక్షులుగా రావుల ఉదయధీర్‌రెడ్డి, రెడ్డి విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామోజీ భిక్షపతి, కార్యదర్శిగా రమేష్‌కుమార్, వేణుగోపాల్, వాసుదేవరెడ్డి, కోశాధికారిగా నూకల మధుసూదన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా విశ్రాంత ఉద్యోగి అశోక్‌కుమార్, హనుమంతరావు, డాక్టర్ రావుల జగదీశ్‌ప్రసాద్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షులు బాల్‌రెడ్డి, గౌరవ సలహాదారుడు శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపేది ?

» కంచెలు లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు » ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు





విజయపాల్, టీచర్స్ కాలనీల్లో కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

వడ్డెపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో విద్యుత్ శాఖ రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. కంచెలు లేకపోవడం వల్ల పశువులు ప్రమాదాల బారిన పడుతున్నాయి. వెంటనే వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని పలు కాలనీల వాసులు విద్యుత్ శాఖ అధికారులను వేడుకుంటున్నారు.

హనుమకొండ 58వ డివిజన్‌లోని వడ్డెపల్లి, 60వ డివిజన్‌లోని విజయపాల్ కాలనీ, కేయూ ఎంప్లాయీస్ కాలనీ, రిజిస్ట్రేషన్ రోడ్డులోని టీచర్స్‌కాలనీ ఫేస్ -2తో పాటు వివిధ కాలనీలలో రోడ్డు పక్కన విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేవు. ఈ ప్రాంతాల్లో పశువులు రేయింబవళ్లు రోడ్లపై సంచరిస్తుంటాయి. కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లను అవి తాకితే ప్రమాదాలు జరుగుతాయని వడ్డెపల్లికి చెందిన పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. వడ్డెపల్లిలో సుమారు వందలాది కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. గేదెలు, ఆవులను పెంచుతూ వాటి ద్వారా వచ్చిన పాల ఉత్పత్తులను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రూ.వేలు వెచ్చించి తెచ్చిన గేదెలు, ఆవులు ప్రమాదాలకు గురయితే భారీగా తాము నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. చిన్న పిల్లలు సైతం ఆటలు ఆడుతూ ఆకతాయిగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను తాకే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖతో పాటు జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి రోడ్డుకు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

35 ఏళ్ల తర్వాత ఆత్మీయ వేడుక



మామునూరు పాఠశాలలో కలుసుకున్న బాల్య మిత్రులు

శంభునిపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వారంతా చిన్ననాటి మిత్రులు.. 35 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకొని ఆత్మీయతను పంచుకున్నారు. 1990-91 బ్యాచ్‌కు చెందిన మామునూరు క్యాంపు జడ్పీఎస్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం రంగశాయిపేట ఆర్టీఏ జంక్షన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ వేడుకలు జరుపుకున్నారు. నాటి గురువులు స్వామి, జలగం చలపతిరావులను ఘనంగా సత్కరించారు. స్నేహితులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. స్నేహితులకు ఆపద వస్తే తోడుండేందుకు 10 మంది సభ్యులతో కూడిన కమిటీని వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డి. మహవీర్ ప్రసాద్, జావిద్, మధుసూదన్ రావు, ఖదీర్, హనుమాన్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, మాధురి, చంద్రకళ, రుద్రమదేవి, సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రైతు సమాఖ్య నాయకులు

సరిపడా యూరియా అందివ్వాలి

గిర్మాజీపేట,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రైతులకు సరిపోను యూరియా అందించడంతో పాటుగా పెండింగ్‌లో ఉన్న 2 లక్షల రుపాయల రుణమాఫీని సత్వరం అమలు చేయాలని, పంటరుణాలు ఇవ్వాలని అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. ఆదివారం వారు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి రైతుల సమస్యలపై వినతి పత్రం అందచేశారు. యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తగినంత యూరియా సరఫరా చేయాలని, అలాగే ప్రతి రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వల్లేపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, హంసారెడ్డి, గోనె కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఎస్ఆర్ నగర్‌లో సహాయక చర్యలు

వరంగల్‌సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలా మూసుకపోవడంతో వరదనీరంతా ఇండ్లలోకి చేరింది. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు స్పందించి ఏనుమాముల సీఐ సురేష్‌కు, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ సురేష్ పోలీసు బలగాలతో ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జేసీబీతో మూసుకుపోయిన నాలాలోని చెత్తను తొలగించడంతో వరదనీరు సాఫీగా వెళ్లిపోయింది. దీంతో ఎస్ఆర్‌నగర్ వాసులు వరదముప్పు తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇంతియాజ్, ముచ్చర్ల స్టాలిన్, శ్రీనివాస్, రాకేష్, రాజేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఏకలవ్య పాఠశాలల ఉద్యోగుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఏకలవ్య పాఠశాలల ఉద్యోగులు

వడ్డెపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏకలవ్య ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన ఏకలవ్య పాఠశాలల ఉద్యోగుల సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి షఫీ మాట్లాడారు. ఏకలవ్య పాఠశాలల్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ 12 నెలల వేతనం చెల్లించాలని కోరారు. గతంలో చెల్లించిన మాదిరిగానే నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగానే అతిథి ఉద్యోగుల ఖాళీలను ప్రభుత్వం గుర్తించకూడదని అన్నారు. మహిళా ఉద్యోగులు, సిబ్బందికి వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి అకారణం చేత ఉద్యోగులను తొలగించకూడదని ఆరోగ్య ప్రమాద బీమాసౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏకలవ్య పాఠశాలల ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ జోష్

(5వ పేజీ తరువాయి)

ఆ జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు. మొత్తం 35శాతం ఎంపీటీసీ సీట్లను బీసీలు కైవసం చేసుకున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70 జడ్పీటీసీలు ఉండగా, 9 జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 20 మంది బీసీలు జడ్పీటీసీలుగా ఎన్నికయ్యారు. కోటా కంటే అదనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. గిరిజన ప్రాబల్యం ప్రాంతం కావటంతో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వు కాలేదు. అయినప్పటికీ జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు విజయం సాధించారు. వరంగల్ జిల్లాలో 11జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వు చేశారు. ఇక్కడ మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక జడ్పీ చైర్మన్ పదవి బీసీలకు దక్కింది. ములుగు జడ్పీ సీటు జనరల్‌కు కేటాయించినప్పటికీ ఏటూరునాగారం జడ్పీటీసీగా గెలిచిన కుసుమ జగదీష్‌కు చైర్మన్ పదవి దక్కింది. అయితే పూర్తికాలం పదవిలో కొనసాగలేదు. గుండెపోటుతో 2023 జూన్‌లో మృతి చెందారు.

లోకల్‌బాడీలో పెరుగనున్న బీసీల ప్రాతినిధ్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లను కల్పించేందుకు ఇప్పటికే కేబినెట్ ఆమోదం పొందిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. గవర్నర్ ఆమోద ముద్ర పడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో గతం కంటే 20శాతం అధికంగా సీట్లు రానున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 జడ్పీటీసీ, ఎంపీపీలు ఉన్నాయి. వీటిలో కనీసం 30 వరకు బీసీలకు రిజర్వుడు అయ్యే అవకాశం ఉంది. ఆరు జడ్పీ చైర్మన్‌లల్లో ఒకటిరెండు సీట్లు బీసీలకు రిజర్వు కోటాలో దక్కే చాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. 778మంది ఎంపీటీసీ స్థానాలు, 1,708 గ్రామ పంచాయతీల్లో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో మినహా ఇతర జిల్లాల్లో భారీగా సీట్లు బీసీలకు రిజర్వు కానున్నాయి. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో స్థానిక సంస్థల్లో మొత్తం 2,550 పదవులు ఉండగా, అందులో ఈసారి అత్యధిక స్థానాలు బీసీలకు దక్కే అవకాశం ఉంది.

సాగునీరు ఇవ్వకపోతే..

(5వ పేజీ తరువాయి)

చేయకుంటే వరినాట్లు వేయడం కష్టమేనని తెలిపారు. గత తెలంగాణ ప్రభుత్వ హయాంలో రైతుల అవసరానికి సకాలంలో సాగునీరు అందించామని, చెరువులు, కుంటల సమృద్ధిగా నింపినట్లు పేర్కొన్నారు. నీళ్ల బంద్ పెట్టాలని రైతులు చెప్పే వరకు గత ప్రభుత్వంలో నీళ్ల ఇచ్చామన్నారు. షైలారం రిజర్వాయర్ రాయపర్తి మండలానికి వరమని, ముందుచూపుతో ఇది సాధ్యమైందని తెలిపారు. గ్రౌండ్ వాటర్ బాగా పెరిగి బోర్లలో కూడా బ్రహ్మాండంగా నీళ్ల ఉండేవని, ప్రస్తుతం షైలారం రిజర్వాయర్ నీళ్లలేక వెలవెల బోతోందన్నారు. కేశవపురంలో ఆగిన దేవాదుల సబ్ కెనాల్ పనులు వెంటనే పునరుద్ధరించి, ఎస్సారెస్పీ కాలువకు ఎగువన ఉన్న గ్రామాలు కేశవపురం, కొలన్‌పల్లి, కాట్రపల్లి, పోతిరెడ్డిపల్లి, తండాలు, కిష్టపురం, మొరిపిరాల పైభాగం కొండూరు, గన్నారం, తిరుమలాయపల్లి, బురాన్‌పల్లి గ్రామాలకు నీరు అందుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలువ పనులు ఆపడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని, పరిపాలన చేతగాక సకాలంలో రైతులకు నీళ్ల అందించడం లేదన్నారు. వారం రోజుల్లో రాయపర్తి మండలానికి కాలువ నీరు రాకపోతే రైతులు, ప్రజలు చేయబోయే నిరసనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంట్లో గొడవపడి.. రైలు పట్టాలపై పడుకొని..

- యువకుడు ఆత్మహత్యాయత్నం - కాపాడిన పోలీసులు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గణేష్‌తో పోలీసులు

మడికొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం అయోధ్యపురం రైల్వేగేటు సమీపంలోని రైల్వే పట్టాలపైన ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని మడికొండ పోలీసులు కాపాడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ కుసుంబ గణేష్ అయోధ్యపురం వద్ద రైల్వే పట్టాలపై పడుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న మడికొండ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి గణేష్‌ను కాపాడారు.

ఈ విషయాన్ని అతడి సోదరుడు శివాజీకి పోలీసులు సమాచారం ఇచ్చారు. గణేశ్ ఇంట్లో అమ్మతో గొడవపడి మనస్తాపం చెందినట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ గణేష్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన పీసీలు సీహెచ్.రాజు, కె.వాసును ఆయన అభినందించారు.

శిథిల కల్వర్టుతో కష్టాలెన్నో ?

» ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
» కొత్త కల్వర్టు నిర్మించాలని జవహర్‌కాలనీ వాసుల డిమాండ్



జవహర్ కాలనీ, గోపాల్‌పూర్‌ల మధ్య శిథిలమైన కల్వర్టు

వడ్డెపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్, జవహర్ కాలనీల మధ్య ద్వారకాసాయి కాలనీ వద్ద ఉన్న కల్వర్టు శిథిలమైపోయింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా జీడబ్ల్యూఎంసీకి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతన కల్వర్టును నిర్మించాలని జవహర్ కాలనీ, ద్వారకా సాయి కాలనీలతో పాటు వివిధ కాలనీల ప్రజలు జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ను వేడుకుంటున్నారు.

నిత్యం ప్రమాదాలే..

జవహర్ కాలనీ, గోపాల్‌పూర్‌ల మధ్య రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థలో మగ్గుతోంది. వర్షాలకు కల్వర్టు పూర్తిగా దెబ్బతిని వాహనచోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో వాహన చోదకుల బాధలు వర్ణనాతీతం. గుంతలమయమైన రోడ్డుతోపాటు కల్వర్టు శిథిలమై ఉండడం వలన ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు సైతం శిథిలావస్థలోనే ఉన్నాయి. జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి వెంటనే కొత్త కల్వర్టును నిర్మించడంతో పాటు రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీలను నిర్మించాలని వివిధ కాలనీల వాసులు కోరుతున్నారు.



కథలు చెబుతున్నారా..?

తల్లిదండ్రులు రోజూ కథలు చెబుతూ ఉంటే పిల్లల్లో మానసిక వికాసం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఇలా రోజూ కథలు వినడం వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- కథ వింటూ పిల్లలు ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుంటారు. కథలో లీనమై జరగబోయేదాన్ని ముందుగానే ఊహిస్తూ ఉంటారు. దీనివల్ల వారిలో ఊహాశక్తి, సృజనాత్మకత పెరుగుతాయి.
- కథల్లోని పాత్రలకు ఎదురయ్యే కష్టాలు, వాటి నుంచి బయట పడిన విధానాలు... పిల్లలను అమితంగా ఆకర్షిస్తాయి. వీటిని బాగా గుర్తుపెట్టుకుంటారు కూడా. దీంతో పిల్లలు స్వయంగా సమస్యలను పరిష్కరించుకోవడం ఎలాగో నేర్చుకుంటారు.
- ముఖంలో భావాలను పలికిస్తూ కథ చెబుతూ ఉంటే పిల్లలు శ్రద్ధగా వింటారు. ధ్యాస మొత్తాన్ని కథపైనే ఉంచుతారు. దీనివల్ల పిల్లల్లో ఏకాగ్రత, కుదురు పెరుగుతాయి.



- కథలోని పాత్రల పేర్లు, ఊళ్ల గురించి పిల్లలు సందేహాలు అడుగుతూ ఉంటారు. అప్పటి జీవన విధానం, వృత్తులు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణలపై ప్రశ్నలు వేస్తూ ఉంటారు. వీటి గురించి ఎప్పటికప్పుడు వివరంగా చెబుతూ ఉంటే భాషకు సంబంధించిన ఎన్నో పదాలను పిల్లలు తెలుసుకుంటారు.
- తరచూ చందమామ కథలు, కాశీ మజిలీ కథలు చెబుతూ ఉంటే..... సమాజం, కట్టుబాట్లు, క్షమ, దయ, నైతిక విలువల గురించి పిల్లలకు అర్థమవుతుంది. మంచి, చెడుల తారతమ్యాన్ని ఆలోచించడం మొదలుపెడతారు.
- పిల్లలు సాధారణంగా వినడం కంటే మాట్లాడడం మీదే దృష్టి పెడుతూ ఉంటారు. వీళ్ల దృష్టిని మరల్చే విధంగా కథ చెబితే క్రమంగా వినడం అలవాటు చేసుకుంటారు. అలాగే తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను కూడా శ్రద్ధగా వినగల్గుతారు.
- కథలు వినడం వల్ల పిల్లలకు లోకజ్ఞానం తెలుస్తుంది. నీతి, అవినీతి గురించి అవగాహన ఏర్పడుతుంది. సమాజంలో మెలగాల్సిన తీరు అర్థమవుతుంది. భావోద్వేగాలు పరిచయమవుతాయి. సొంతంగా ఆలోచించే సామర్థ్యం పెరుగుతుంది.
- కథలు వింటూ ఉంటే పిల్లలకు చదవాలనే ఆసక్తి కలుగుతుంది. కథల పుస్తకాలు తీసుకుని సొంతంగా చదవడం ప్రారంభిస్తారు. దీంతో పిల్లలకు పుస్తక పఠనం అలవడుతుంది.

మరణం అంచుల వరకు వెళ్లింది. విధిని ఎదిరించి ధైర్యంగా నిలబడింది. ప్రమాదంలో కుడి చేయి కోల్పోయినా.. ఆత్మవిశ్వాసంతో అపురూప విజయాలు అందుకుంది. 'ప్రపంచ పారా గ్రాండ్ ప్రీ'లో రెండు స్వర్ణాలు గెలిచి.. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది వలసంగారి భవాని. మారుమూల పల్లె నుంచి వచ్చి.. పడి లేచిన కెరటంలా సంచలనాలు నమోదు చేస్తున్న ఈ పారా అథ్లెట్.. తన క్రీడా ప్రయాణం గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చింది.

పడి లేచిన కెరటంలా...
గెలిచి నిలిచి

"అది 2009... సెప్టెంబరు. అప్పుడు నాకు తొమ్మిదేళ్లు. ఇంటి బయట ఆగి ఉన్న లారీ పైకెక్కి ఆడుకుంటున్నా. సరదాగా గెంతుతుండగా నా కుడి చేయి విద్యుత్ తీగలకు తాకింది. షాక్ కొట్టి లారీలో పడిపోయా. గమనించిన మా నాన్న చంద్రయ్య నన్ను కాపాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయన విద్యుదాఘాతానికి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. అపస్మారక స్థితిలో ఉన్న నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. చేతికి వెంటనే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. రూ.1.75 లక్షలు అవుతుందన్నారు. ఎలాగో కట్టాం. నా కుడి చేతి నరాలకు సర్జరీ చేశారు కానీ, విజయవంతం కాలేదు. ఆరు రోజుల తర్వాత... భుజం వరకు చేతిని తొలగించకపోతే గుండెకు ప్రమాదమన్నారు. చెయ్యి తీసేశారు. ఎడమ తొడ, కాళ్లు, అరికాళ్లకు కూడా చాలా గాయాలయ్యాయి. 25 రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. వైద్యానికి మొత్తంగా రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యాయి. అన్నయ్య, అమ్మ కలిసి ఆ అప్పు తీర్చడానికి చాలా కష్టపడ్డారు. ఆస్పత్రిలో, ఇంటికి వచ్చాక మా పెద్దమ్మ లింగమ్మ నన్ను కంటికి రెప్పలా చూసుకుంది. నాకు ధైర్యం చెప్పింది.

ఏడాది వరకు..

కోలుకున్నాక 'నాన్న ఎక్కడ'ని అడిగితే... చేపల వేటకు చెన్నై వెళ్లారని, త్వరలోనే వచ్చేస్తారని ఇంట్లో వాళ్లు చెబుతూ వచ్చారు. దాదాపు ఏడాది తరువాత కానీ నాకు తెలియలేదు. నాన్న ఇక లేరని. నాన్నే లోకంగా బతికిన నేను ఆ విషాదాన్ని జీర్ణించుకోలేకపోయాను. ఇప్పటికీ ఆయన నా వెంటే ఉంటారని నమ్ముతాను. నెల్లూరు జిల్లా సర్వేపల్లిలోని ముత్తుకూరులో ఓ మత్స్యకార కుటుంబం మాది. నాన్న చంద్రయ్య, అమ్మ బుజ్జమ్మ వ్యవసాయ కూలీలు. వ్యవసాయ పనులు లేనప్పుడు నాన్న చేపల వేటకు వెళ్లేవారు. అన్నయ్య వెంకటేశ్వర్లు డ్రైవర్.

నాకు నేను ధైర్యం చెప్పుకొని...

చిన్నప్పటి నుంచీ క్రీడల్లో పాల్గొనేదాన్ని. ఖోఖో, కబడ్డీ, పరుగు పోటీల్లో ముందుండేదాన్ని. ప్రమాదానికి ముందు 4-100 రిలేలో పాల్గొని రజత పతకం సాధించా. నాన్నకు ఆ మెడల్ చూపిస్తే భుజాలపై ఎక్కించుకొని ఊరంత తిప్పి, అందరికీ చెప్పి సంబరపడ్డారు. ఆయన ఆనందం చూసి... ఎప్పటికైనా మంచి క్రీడాకారిణి కావాలని కలలు కన్నా. కానీ విద్యుద్ఘాతంతో ఆటలకు దూరమవ్వాల్సి వచ్చింది. పదో తరగతి వరకు పోయిన చెయ్యి తిరిగి వస్తుందని అనుకునేదాన్ని. ఆ తర్వాత కానీ తెలియలేదు బతికినంత కాలం ఒంటి చేత్తోనే నెట్టుకురావాల్సి వస్తుందని. పోలీసు అవ్వాలనేది నా చిన్ననాటి కోరిక. ఇక అది సాధ్యం కాదని తెలిసి ఎంతో బాధపడ్డాను. అలాగని కుంగిపోలేదు. డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ఉండగా.. నెల్లూరు స్టేడియంలో జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ నిర్వహిస్తారని తెలిసింది. 2019లో జరిగిన ఆ పోటీల్లో 100, 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో పాల్గొని మూడు పసిడి పతకాలు గెలిచాను. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాను.

బలంగా నిశ్చయించుకున్నా..

జిల్లా స్థాయి పోటీలంటే ఏదో నాకున్న ఆసక్తితో బరిలోకి దిగి పతకాలు నెగ్గా. కానీ రాష్ట్ర స్థాయి క్రీడలకు అర్హత సాధించడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. క్రీడలనే కెరీర్‌గా మలుచుకోవాలని ఆ క్షణమే బలంగా నిశ్చయించుకున్నా. రాష్ట్ర స్థాయిలో రాణించాలంటే కోచింగ్ అవసరం. దాంతో నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలోని శాప్ కోచ్ షేక్ జానీంను కలిశాను. నా పట్టుదల, సామర్థ్యం చూసి సాధారణ అథ్లెట్లతో కలిపి సార్ నాకు శిక్షణ ఇచ్చారు. ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 100, 200 మీటర్ల స్ప్రింట్, లాంగ్‌జంప్ ఈవెంట్లలో స్వర్ణ పతకాలు సాధించాను. ఈ విజయం జాతీయ స్థాయి పోటీలకు కావల్సినంత స్ఫూర్తినిచ్చింది. 2021లో బెంగళూరులో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్‌జంప్‌లో రజతాలు, 200 మీటర్ల పరుగులో కాంస్యం గెలిచాను.

మలుపు తిప్పిన పోటీ...

జాతీయ స్థాయిలో నేను సాధించిన తొలి పతకాలు ఇవే కావడంతో వాటిని చూసి అమ్మ ఎంతో సంబరపడింది. అప్పటి నుంచి ఈ ఏడాది వరకు జరిగిన ఖేలో ఇండియా పారా అథ్లెటిక్స్, జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధిస్తూనే ఉన్నా. అయితే నా కెరీర్‌ను మలుపు తిప్పింది మాత్రం రెండేళ్ల కిందట థాయ్‌లాండ్‌లో జరిగిన 'వరల్డ్ ఎబిలిటీ పారా గేమ్స్'. టీ-46 కేటగిరీలో 100, 200 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు గెలిచాను. నా కెరీర్‌లో ఇవే తొలి అంతర్జాతీయ మెడల్స్. తాజాగా ఈ నెలలో చెక్ రిపబ్లిక్‌లో నిర్వహించిన 'ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీ' 100 మీటర్ల రేసును 13.70 సెకన్లలో, 200 మీటర్ల రేసును 29.07 సెకన్లలో పూర్తి చేసి రెండు స్వర్ణ పతకాలు సాధించాను. 34 దేశాలకు పైగా అథ్లెట్లు తలపడిన ఈ మెగా ఈవెంట్‌లో గట్టి పోటీ ఎదురైంది. అన్నిటినీ దాటి రెండు స్వర్ణ పతకాలు సాధించిన తొలి భారతీయురాలిని నేనే అంటే గర్వంగా ఉంది. కెరీర్‌లో ఇప్పటివరకు ఇరవైకి పైగా పతకాలు గెలిచాను.

ప్రస్తుత లక్ష్యం...

గత వారం బెంగళూరు వేదికగా జరిగిన ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ పోటీల్లో 100, 200 మీటర్ల స్ప్రింట్‌లో రెండు రజత పతకాలు సాధించా. ప్రస్తుతం నేను పోటీ పడే రెండు విభాగాల్లో 100 మీటర్లలో 11.97 సెకన్లు, 200 మీటర్లలో 27.92 సెకన్లు ప్రపంచ అత్యుత్తమ టైమింగ్‌గా ఉంది. నా వ్యక్తిగత టైమింగ్ 13.56 సెకన్లు, 29.05 సెకన్లు. మరింత అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ తీసుకొని దీన్ని మెరుగు పర్చుకోవాల్సి ఉంది. వచ్చే ఏడాది జపాన్‌లో జరిగే ఆసియా పారా క్రీడల్లో దేశానికి స్వర్ణ పతకం అందించాలనే పట్టుదలతో సాధన చేస్తున్నా."

• ఎస్.ఎస్.బి. సంజయ్



అదొక్కటే ఆధారం..

అమ్మ కిడ్నీల వ్యాధితో బాధపడుతోంది. కూలీ పనులకు వెళ్ల లేకపోతోంది. నాకు వచ్చే రూ.6 వేల పింఛన్, అమ్మకు వచ్చే రూ.4 వేల వితంతు పింఛనే మేము బతకడానికి ఆధారం. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలంటే ఈవెంట్‌కు రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. నా డైట్‌కు కూడా కష్టమవుతోంది. మా ఊరు నుంచి నెల్లూరు 30 కిలోమీటర్లు. ఉదయం ఐదున్నరకు బస్సు ఎక్కితే, గంట ప్రయాణం తర్వాత స్టేడియానికి చేరుకొంటా. రెండు గంటలు సాధన తరువాత మళ్లీ ఇంటికి చేరేసరికి గంట పడుతుంది. మళ్లీ మధ్యాహ్నం 3.30కు వెళ్లి 7.30కు వస్తాను. రోజు 4 గంటలు ప్రయాణం చేయాల్సి వస్తోంది. దగ్గర్లో సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో నెలలో రెండుసార్లు గుంటూరు వెళ్లి నాగార్జున యూనివర్సిటీలో సాధన చేస్తున్నా. ఎంపీఏ చదవాలని ఉంది. యూనివర్సిటీలో ఫ్రీ సీటు ఇస్తే అక్కడే చదువుకుంటూ సాధన చేస్తాను.

చేయూత కోసం..

ఇప్పటివరకు నేను సాధించిన పతకాలకు రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాలసీ, జీఓలు ప్రకారం సుమారు రూ.20 లక్షలు రావాల్సి ఉంది. చంద్రబాబు గారి ప్రభుత్వం వచ్చాక రూ.2 లక్షలు ఇచ్చారు. చెక్ రిపబ్లిక్ పోటీల్లో పాల్గొనేందుకు రూ.1.96 లక్షలు ఖర్చు కాగా శాప్ ఛైర్మన్ రవినాయుడు గారి చొరవతో ఎన్ఆర్ఐ సెల్ ద్వారా రూ.1 లక్ష సాయం అందించారు. పెండింగ్ బకాయిలు విడుదల చేస్తే నా కష్టాలు కొన్ని అయినా తీరుతాయి. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకయ్యే ఖర్చులను సర్కార్ భరిస్తే దేశానికి మరిన్ని పతకాలు అందిస్తా. ఇక, నాకు క్రీడల్లో ధోనీ, హీరోల్లో బాలకృష్ణ అంటే చాలా ఇష్టం. జీవితంలో ఒకసారైనా వారిద్దరినీ కలవాలనేది నా ఆకాంక్ష.

వెండి మొక్క

ప్రకృతిలో మనకు అవసరమైనవన్నీ ఉంటాయి. కానీ కొన్నిసార్లు మనమే గుర్తించలేకపోతాం. అలాంటిదే అలాంగియం సాల్విఫోలియం మొక్క. అనారోగ్యానికి ఔషధంగానే కాక వెండి నానో కణాల తయారీకి ఉపయోగపడుతుంది ఇది. ఈ మొక్క గురించి వివరాలు తెలుసుందాం..



దీనిని అంకోల్ చెట్టు, ఊడుగ చెట్టు అని కూడా అంటారు. ఇది భారత్, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్, ఆగ్నేయాసియాలోని కొన్ని ప్రాంతాల్లో పెరుగుతుంది. తూర్పు కనుమలలోని అడవుల వద్ద ఈ మొక్క ఎక్కువగా కనిపిస్తుంది. ఇది 10 నుంచి 12 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఈ మొక్కకు లేత పసుపు రంగు ఆకర్షణీయమైన పువ్వులు పుస్తాయి. సువాసన వెదజల్లే ఈ పూలు వేసవిలో వికసిస్తాయి. ఈ మొక్కకు బెర్రీ రంగు పండ్లు కాస్తాయి. ఈ పండ్లలో ఒకేఒక్క విత్తనం ఉంటుంది. ఈ పండును సంప్రదాయ వైద్యంలో, ఆయుర్వేదంలో వినియోగిస్తారు. జ్వరం, వాపులు, జీర్ణ సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తారు. ఈ పండ్ల జీవ సంబంధ సమ్మేళనాలలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ మైక్రోబయల్ లక్షణాలు ఉండొచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ మొక్క దాహాన్ని తగ్గించడంలోనూ ఉపయోగపడుతుంది. ఈ చెట్టు పండు ఒక్కదానిని తింటే మండే ఎండాకాలంలోనైనా సరే 3-4 గంటల పాటు దాహం వేయదు. ఈ మొక్క ఆకులను వెండి నానో కణాల తయారీ ప్రక్రియలో వాడతారు.

• డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్
drananthanenisreenath@gmail.com.

మునగాకుతో జుట్టుకు పోషణ



జుట్టు ఆరోగ్యంగా ఉండడం కోసం రకరకాల హెయిర్‌ప్యాక్‌లు వాడుతుంటారు. అయితే మునగాకు పొడితో తయారు చేసిన ప్యాక్ వలన జుట్టుకు పోషణ అంది ఆరోగ్యంగా మారుతుంది. ఆ వివరాలు తెలుసుకుందాం..

- మునగాకులో విటమిన్ బి, సి, జింక్, ఐరన్, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి కుదుళ్ల సమస్యలను దూరం చేసి జుట్టు ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.
- మునగాకు పొడి చుండ్రు, దురద వంటి సమస్యలకు విరుగుడుగా పనిచేస్తుంది.
- మునగాకులోని జింక్ కుదుళ్లలో సీబమ్‌ను క్రమబద్ధీకరిస్తుంది.
- యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు కుదుళ్ల సమస్యలను దూరం చేస్తాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి తెల్లజుట్టు రాకుండా సహాయపడతాయి.
- మునగాకు పొడిలో ఉండే బెహెలిక్, ఓలియిక్ ఆమ్లాలు జుట్టు ఆరోగ్యాన్ని కాపాడి కురులు పెరిగేలా సహాయపడతాయి.


ఇలా తయారు చేయాలి : ఒక గిన్నెలో టేబుల్ స్పూన్ మునగాకు పొడి, మరో టేబుల్ స్పూన్ ఉసిరి పొడిని తీసుకోవాలి. ఇందులో కొంచెం పెరుగు వేసి మెత్తని పేస్టులా కలపాలి. దీనిని కుదుళ్లకు బాగా పట్టేలా ప్యాక్‌లా వేసుకోవాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఇంటి పనులు త్వరగా పూర్తవడం కోసం ఈ రోజుల్లో చాలామంది ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు ఉపయోగిస్తున్నారు. అయితే అవి ఎక్కువకాలం పనిచేయాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. అవేంటో తెలుసుకుందాం..



మిక్సీ: చట్నీలు, పిండి, మసాలాలు వంటివి రుబ్బడానికి అనువుగా ఇప్పుడు అందరి ఇళ్లల్లో మిక్సీ ఉంటోంది. అయితే చాలా మంది మిక్సీ జార్‌లను వాడిన తర్వాత సింక్‌లో పడేసి చాలా సమయం తరువాత శుభ్రం చేసుకుంటారు. అయితే ఇలా చేయడం వలన బ్లేడులు మొద్దుబారిపోతాయి. అలాగే గిన్నెల్లో మరకలు అంటుకుపోతాయి. అందుకే మిక్సీ జార్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. బ్లేడ్‌లు పదును తగ్గినట్లు అనిపిస్తే జార్‌లో కల్లుప్పు(క్రిస్టల్ సాల్ట్) వేసి మిక్సీ పట్టాలి. ఇలా చేస్తే బ్లేడ్‌లు పదునుగా మారతాయి. అలాగే మరకలు పడ్డాయని మిక్సీని నీటితో కడగకూడదు. తడి గుడ్డతో తుడిచి శుభ్రం చేసుకోవాలి.



రైస్ కుక్కర్: అన్నం పొంగడం, పక్కనే ఉండి చూసుకోకపోతే మాడిపోవడం వంటి సమస్యలకు పరిష్కారంగా రైస్ కుక్కర్ వాడుతున్నారు. అయితే ఈ కుక్కర్ వాడేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోకపోతే చాలా ప్రమాదం. కుక్కర్ గిన్నెను కుక్కర్‌లో పెట్టేముందు గిన్నె కింద భాగం తడి లేకుండా చూసుకోవాలి. అలాగే కుక్కర్ మీద అన్నం పొంగి మరకలు పడినా ఎట్టిపరిస్థితుల్లోనూ నీటితో కడగకూడదు. కుక్కర్ వైర్‌ను ప్లగ్ తీసేసి వస్త్రంతో కుక్కర్ మీది మరకలను తుడిచేయాలి.



ఫ్రిడ్జ్: కూరగాయలు, కూరలు, పాలు వంటివి పాడవకుండా నిల్వ చేయడానికి ఫ్రిడ్జ్‌ను వాడుతుంటాం. అయితే చాలామంది ప్రతీ ఆహార పదార్థాన్ని ఫ్రిడ్జ్‌లో పెట్టేస్తారు. అలా చేయకూడదు. బయట నిల్వ ఉండే వాటిని బయటే ఉంచాలి. అలాగే ఫ్రిడ్జ్‌లో వేడి వేడి పదార్థాలను పెట్టకూడదు. గిన్నెల మీద మూత పెట్టకుండా ఆహారాన్ని ఫ్రిడ్జ్‌లో పెట్టకూడదు. ఒకవేళ అలా పెడితే ఆ పదార్థం వాసన మిగిలిన ఆహార పదార్థాలకు పడుతుంది. ఊరెళుతున్నాం కదా అని ఫ్రిడ్జ్‌ని స్విచ్ఛాఫ్ చేసి వెళ్లకూడదు. ఒకవేళ అలా ఫ్రిడ్జ్ ఆపాలి అనుకుంటే అందులోని వస్తువులన్నీ తీసేసి లోపల తడి లేకుండా ఆరబెట్టి ఫ్రిడ్జ్ డోర్ వేసేయాలి.



వాషింగ్ మెషీన్ : వాషింగ్ మెషీన్‌ను సక్రమంగా ఉపయోగిస్తే అది ఎక్కువకాలం చక్కగా పని చేస్తుంది. రెండు మూడు రోజులు బట్టలు వేయడం కుదరలేదని ఆ మొత్తం బట్టలు ఒకేసారి వాషింగ్ మెషీన్‌లో వేసేయకూడదు. లోడ్‌కు మించి ఎక్కువ బట్టలు వేస్తే వాషింగ్ మెషీన్ పాడైపోతుంది. వారానికి ఒకసారి కచ్చితంగా డ్రమ్ శుభ్రం చేయాలి. అలాగే పైప్‌లు, ఫిల్టర్, రబ్బరును తరచూ శుభ్రం చేయాలి.

ఉల్లి పంట... దాని ధర అమాంతంగా పెరిగి జనం కంట నీరు తెప్పిస్తుంది. హఠాత్తుగా పతనమైపోయి రైతులకు ఆవేదన మిగుల్చుతుంది. దీనికి కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన 23 ఏళ్ల కల్యాణి రాజేంద్ర షిండే సరికొత్త పరిష్కారంతో ముందుకొచ్చారు. ఆమె తీసుకున్న చొరవ రైతుల నష్టాలను భారీగా తగ్గించి... నికరమైన ఆదాయానికి భరోసా ఇస్తోంది.

ఆనియన్ క్వీన్



"మా నాన్నంటే నాకు ప్రాణం. ఎప్పుడూ సరదాగా, నవ్విస్తూ ఉండే ఆయన దిగాలుగా ఉంటే ఎంతో బాధగా ఉండేది. అలాంటి సందర్భాలు రాకూడదని దేవుణ్ణి కోరుకొనేదాన్ని. కానీ "ఈ ఏడాది కూడా నష్టమేనమ్మా!" అని ఆయన కన్నీళ్ళు ఆపుకొంటూ చెబుతుంటే మా ఇంటిల్లిపాదికీ ఏడుపొచ్చేది. ఇది మా ఒక్కరి కథ కాదు... లక్షలమంది ఉల్లి రైతుల వ్యథ. మహారాష్ట్రలోని లాసల్‌గావ్... ఆసియాలోనే అతి పెద్దదైన ఉల్లిపాయల హోల్‌సేల్ మార్కెట్. నేను ఆ ఊర్లోనే పుట్టాను. మా ప్రాంతంలో దాదాపు రైతులందరూ ఉల్లి సాగుచేస్తారు. వారిలో మా నాన్న కూడా ఒకరు. ఉల్లి పంట వేసినప్పటి నుంచి కోతకు వచ్చేసరికి దాదాపు నాలుగు నెలల సమయం పడుతుంది. ఆ తరువాత వాటిని ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు నిల్వ ఉంచుతారు. సరుకు దెబ్బతింటే... ధరల్లో ఎనిమిది వందల శాతం హెచ్చుతగ్గులు చోటు చేసుకోవడం నేను గమనించాను. మార్కెట్‌లో హఠాత్తుగా చోటు చేసుకొనే ఒడుదొడుకుల కారణంగాను, సరుకు దెబ్బతినడం వల్లా రైతులు తీవ్రమైన నష్టాలకు గురవడం సాధారణమైపోయింది. ఇవన్నీ చూస్తూ పెరిగాను. 'రైతుల కష్టాలు తీరే మార్గం లేదా?' అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని.

ఆ నష్టం దేశానిది కూడా...

నాసిక్‌లో 2018లో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు... టీసీఎస్ ఫౌండేషన్ నిర్వహణలోని ఓపెన్ సోషల్ ఇనీషియేటివ్ సెంటర్... 'డిజిటల్ ఇంపాక్ట్ స్క్వేర్'కు ఎంపికయ్యాను. సామాజికమైన వివిధ సవాళ్లను పరిష్కరించడానికి డిజిటల్ సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన సంస్థ ఇది. దాని ద్వారా రైతుల సమస్యలను క్షేత్ర స్థాయిలో శాస్త్రీయంగా అధ్యయనం చేసే అవకాశం దొరికింది. మన దేశంలో ఉత్పత్తి అయ్యే ఉల్లి పంటలో 40 నుంచి 50 శాతం వరకూ వినియోగదారులకు చేరేలోగానే పాడవుతోంది. అది ప్రతీ ఏడాది అయిదు కోట్ల మంది వినియోగించే పంటతో సమానం. దేశ ప్రజల అవసరాలకు మించిన ఉత్పత్తిని మన రైతులు చేస్తున్నారు. కానీ పంట కోత తరువాత తలెత్తే పరిస్థితులు వారు నష్టపోవడానికి దారి తీస్తున్నాయి. సంప్రదాయమైన గిడ్డంగుల్లో నిల్వ చేయడం, ఆధునికమైన పర్యవేక్షణ పద్ధతులు అనుసరించకపోవడం లాంటి కారణాల వల్ల... పంట లోలోపలే కుళ్ళిపోతోంది. మరింత వివరంగా చెప్పాలంటే... పంట కుళ్ళిపోయిందా? లేదా? అని నిర్ధారించడానికి రైతులు తమ వాసన శక్తి మీద తరచుగా ఆధారపడుతున్నారు. కానీ కుళ్ళిన వాసన వచ్చేసమయానికి సగం పంట పనికిరాకుండా పోతోంది. ఈ నష్టం విలువ ప్రతి సంవత్సరం సుమారు రూ.40 వేల కోట్లు. ఈ నష్టం కేవలం రైతు కుటుంబాలదే కాదు, దేశానిది కూడా. ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలనుకున్నాను. దానికోసం తీవ్రంగా పరిశోధన చేశాను.

ముందే హెచ్చరిస్తుంది...

అయిదేళ్ళ క్రితం నాసిక్ నుంచి లాసల్‌గావ్‌కు తిరిగి వచ్చి 'గోదామ్ ఇన్నోవేషన్స్' అనే అనే అగ్రిటెక్ స్టార్టప్‌ను ఏర్పాటు చేశాను. కేవలం రూ. మూడు లక్షల నిధులతో ఇది మొదలైంది. ఉల్లిపాయలు దెబ్బతినడాన్ని ముందుగానే గుర్తించేందుకు... ఒక ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సాంకేతికతతో... ఒక చిన్న పరికరానికి రూపకల్పన చేశాను. దానికి 'గోదామ్ సెన్స్' అనే పేరు పెట్టాను. ఈ తరహా పరికరం తయారీ దేశంలోనే తొలిసారి. ఉల్లిపాయలు నిల్వ చేసే గోదాముల్లో దీన్ని అమర్చితే... నిశ్శబ్ద సంరక్షకుడిలా గమనిస్తూ ఉంటుంది. ఉష్ణోగ్రతలను, తేమను నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఉల్లిపాయలు పాడవడం ప్రారంభమైన తొలి దశలో... వాటి నుంచి కొన్ని వాయువులు వెలువడతాయి. మొత్తం సరుకులో ఒక శాతం పాడవడం మొదలైనా సరే... ఆ పరికరం హెచ్చరికలు పంపుతుంది. సరుకు బాగా దెబ్బతిన్న తరువాత మేలుకొనేకన్నా... ముందుగా గుర్తించడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ఈ పరికరాన్ని అమర్చి చూశాం. ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో... ఆ వివరాలను ప్రభుత్వ సంస్థల దృష్టికి తీసుకువెళ్ళాం. వాటి నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఇప్పుడు 'డైరెక్టరేట్ ఆఫ్ ఆనియన్ అండ్ గార్లిక్ రీసెర్చ్' (డిఓజిఆర్), భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) తదితర సంస్థలు మాకు భాగస్వాములుగా ఉన్నాయి. భారీ, మధ్యతరహా, చిన్న తరహా రైతుల అవసరాల మేరకు... నెలవారీ చార్జీలతో గోదాముల్లో 'గోదామ్ సెన్స్' పరికరాలను అమరుస్తున్నాం. వాటి ద్వారా కనీసం 30 నుంచి 40 శాతం నష్టాన్ని రైతులు నివారించుకోగలుగుతున్నారు. దానికోసం పాత గోదాములనే కొత్తగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు పలు రాష్ట్రాల్లో... ఉల్లి నిల్వ చేసే చాలా గోదాముల్లో ఈ పరికరాన్ని వినియోగిస్తున్నారు. తద్వారా వారికి నష్టం తగ్గి... నికరమైన ఆదాయం లభిస్తోంది."

సాంకేతికతపై అవగాహనతో....



రైతు సంఘాలు, మీడియా నన్ను 'ఆనియన్ క్వీన్' అని పిలుస్తున్నాయి. దానికన్నా... మా నాన్నలాంటి ఎందరో రైతులను నష్టాల ఊబి నుంచి కాపాడగలగడం నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. రైతులకు కొత్త సాంకేతికతలను పరిచయం చేసి, వాటిపై అవగాహన కలిగిస్తే... ఎన్నో అద్భుతాలు జరుగుతాయని నా నమ్మకం. అది నిజమని నా ప్రయత్నం రుజువు చేస్తోంది.

SCHOLARSHIP ALERT

Unnati 2-Towards a Better Future Scholarship

Description: CNH Industrial (India) Private Limited invites applications from students who are currently studying in Class 8 to 10 or in first-year ITI/Diploma courses in Gurgaon, Delhi, and Noida.

Eligibility: The school-level scholarship is for applicants studying in Classes 8 to 10, who have scored at least 60% in the previous academic year.

- For the ITI/Diploma level scholarship, the student must be studying in the first year of the course.
- Students from Gurgaon, Delhi, or Noida whose total family income does not exceed 5 lakh are eligible to apply.
- Children of Buddy4Study and CNH Industrial (India) Private Limited employees are not eligible to participate.

Prizes & Rewards: Scholarships up to 12,000 per year for up to three years for school students.


- Scholarship up to 18,000 per year for two years for Diploma/ITI students.

Last Date to Apply: 17-08-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/UTBF3

HOPE Engineering Scholarship by Schaeffler India 2025



Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students across India enrolled in the first year of an engineering program at any UGC or state-recognised college. Preference will be given to students with disabilities and those pursuing core engineering branches such as Automobile, Mechanical, Mechatronics, Electrical and Electronics, Electronics and Communication, Production, Instrumentation, Computer Science Engineering, and Information Technology. Applicants must have scored over 60% in Class 12 (Science) (40% marks for PwD) in the academic year 2024–25, with an annual family income of less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 per year for four years

Last Date: 30-07-2025 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/SIHE16

ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోని కొన్ని ఐఐటీలు ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు తమ రెగ్యులర్ కోర్సులతోపాటు వీటిని కూడా చేయవచ్చు.

ఐఐటీలు అందించే ఉచిత ఏరో ఇంజనీరింగ్ కోర్సులు



దేశంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఐఐటీలు ఈ ఉచిత ఆన్‌లైన్ కోర్సులను డెవలప్‌చేశాయి.

ఇంట్రడక్షన్ టు ఏరోస్పేస్ ఇంజనీరింగ్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ రంగం పట్ల బేసిక్ అవగాహన కల్పించడానికి ఈ కోర్సును ప్రారంభించారు. 2025 ఆగస్ట్ 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఎయిర్‌క్రాఫ్ట్, వాటి ఫీచర్స్, కాన్ఫిగరేషన్ సెలెక్షన్, టైప్స్ ఆఫ్ లోడ్స్, ఆపరేషనల్ ఇష్యూస్ తదితారాలన్నింటినీ బోధిస్తారు. 2025 ఆగస్ట్ 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఎలిమెంట్స్ ఆఫ్ మెకానికల్ వైబ్రేషన్: ఢిల్లీ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. వైబ్రేషన్ థియరీ ఫండమెంటల్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్‌పుల్స్ తదితరాలు ఇందులో ఉంటాయి. 2025 ఆగస్ట్ 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్, ఫ్లైట్ టెస్టింగ్, ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్ తదితరాలను వివరిస్తారు. 2025 ఆగస్ట్ 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఎయిర్ క్రాఫ్ట్ స్టెబిలిటీ అండ్ కంట్రోల్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్‌ప్లేన్ స్టెబిలిటీ, కంట్రోల్ విషయాలను బోధిస్తారు. 2025 ఆగస్ట్ 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

డిజైన్ టు ఫిక్స్‌డ్ వింగ్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 జూలై చివరి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

యూఏవీ డిజైన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్ట్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ప్రొపల్షన్ థియరీ, ప్రాక్టికల్స్‌పై క్లాసులు ఉంటాయి. ఎయిర్ క్రాఫ్ట్, రాకెట్ ఇంజన్ల డిజైన్, ఆపరేషన్, ఇన్‌స్టాలేషన్, రిపెయిర్, మెయింటెనెన్స్‌పై అవగాహన పెంచుతారు.

అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్ట్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పేస్ ఫ్లయిట్ మెకానిక్స్: ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది.

దిక్సూచి

గేట్ స్కోరు లేకుండా గౌహతి ఐఐటీలో ఎంటెక్

ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై గౌహతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) కొత్త ఎంటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై పనిచేసే వారిని ఉద్దేశించి ఈ కోర్సును ప్రారంభించినట్లు ఐఐటీజీ తెలిపింది. ఈ కోర్సులో చేరడానికి గేట్ స్కోరు అవసరం లేదు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు. సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహించే ఈ కోర్సు చేరాలనుకునేవారికి కనీసం ఒక సంవత్సరం వాటర్ రిసోర్స్ సెక్టార్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. అలాగే కనీసం 6 జీపీఏతో నాలుగు సంవత్సరాల గ్రాడ్యుయేషన్ కోర్సు(సివిల్/ అగ్రికల్చర్ అనుబంధ ఇంజనీరింగ్ కోర్సులు చేసి ఉండాలి. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా హైబ్రీడ్ మోడల్‌లో జరుగుతుంది. ఆన్‌లైన్‌లో క్లాసులు ఉంటాయి. ల్యాబ్‌లు, ఫైనల్ పరీక్షలు క్యాంపస్‌లో నిర్వహిస్తారు.

చివరి తేదీ: 2025 జూలై 31

వెబ్‌సైట్: www.iitg.ac.in/oes/odp/mtech/fwrm

అగ్నివీర్‌వాయు 2025 రిజిస్ట్రేషన్లు ప్రారంభం

'అగ్నివీర్‌వాయు' పోస్టుల భర్తీకి భారత వైమానిక దళం రిజిస్ట్రేషన్లు ప్రారంభించింది. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 31 తేదీలోపు agnipath-vayu.cdac.inలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 2025 సెప్టెంబర్ 25 నుంచి పరీక్ష ప్రారంభం అవుతుంది. అభ్యర్థులు 2005 జూలై 2 నుంచి 2009 జనవరి 2 తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఫేజ్-1, 2, 3 పరీక్షల ఆధారంగా సెలెక్షన్ ఉంటుంది. ప్రశ్నలు పూర్తిగా ఆబ్జెక్టివ్ తరహాలో ఇంగ్లిష్, హిందీ మాధ్యమంలో ఉంటాయి.

జాబ్ కార్నర్

ఎయిమ్స్‌లో

ఖాళీలు 3,501

దేశవ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో 3,501 పోస్టుల భర్తీకి న్యూఢిల్లీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవన్నీ కూడా గ్రూప్-బీ, గ్రూప్-సీ కేడర్ నాన్ ఫ్యాకల్టీ పోస్టులు.

పోస్టులు: డైటీషియన్, అసిస్టెంట్ డైటీషియన్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, లాబ్ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్, అటెండెంట్, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్ టెక్నీషియన్, అటెండెంట్ తదితరాలు ఇందులో ఉన్నాయి.

అర్హత: పోస్టును బట్టి టెన్త్, ఇంటర్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఈ, డీఎంఎల్‌టీ, బీఎంఎల్‌టీ, బీఫార్మసీ తదితరాలు ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత డిపార్ట్‌మెంట్ అనుభవం కూడా ఉండాలి.

వయస్సు: పోస్టును బట్టి 18 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయస్సు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ తదితరాలు ఉంటాయి.


చివరి తేదీ: 2025 జూలై 31

సీబీటీ పరీక్ష తేదీలు: 2025 ఆగస్ట్ 25, 26

వెబ్‌సైట్: https://rrp.aiimsexams.ac.in/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో

ఖాళీలు 3,717



కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద 3,717 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

పోస్టులు: అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-11/ ఎగ్జిక్యూటివ్. మొత్తం 3717 పోస్టులు ఉన్నాయి. అందులో అన్ రిజర్వుడు 1537, ఈడబ్ల్యూఎస్‌లో 442, ఓబీసీ 946, ఎస్సీ 566, ఎస్టీ 226 పోస్టులు ఉన్నాయి. ఇది జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ సీ పోస్టు(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టిరియల్)

విద్యార్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్ట్ 10 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనలు అనుసరించి వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది. టైర్-1 వంద మార్కులకు ఉంటుంది. ఇందులో కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు కట్ చేస్తారు.

- టైర్-1 డిస్క్రిప్టివ్‌గా ఉంటుంది. దీనికి 50 మార్కులు. ఎస్సే, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, లాంగ్ ఆన్సర్ తరహా ప్రశ్నలు ఉంటాయి. టైర్-3 వంద మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది

చివరి తేదీ: 2025 ఆగస్ట్ 10 **వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en

చిత్రజ్యోతి

SINCE 1965

మన చరిత్ర చెప్పాలనే ప్రయత్నం

- అశ్విన్ కుమార్



పురాణాల్లోని దశావతారాల ఆధారంగా తెరకెక్కుతోన్న 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి యానిమేషన్ త్రీడీ చిత్రం 'మహావతార్ నరసింహ'. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్ నిర్మించారు. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు.

- నరసింహ స్వామి అవతారం కేవలం ఒకపురాణ గాథ కాదు. మన చరిత్ర. దాని గురించి ప్రతి తరానికీ చెప్పాల్సిన అవసరం ఉంది. నేటి బాలలకు మన సంస్కృతి గురించి అవగాహన కలిగించేలా ఈ సినిమా ఉంటుంది. ఇప్పటివరకూ చూడని విజువల్స్‌ను బిగ్‌స్క్రీన్ మీద చూడబోతున్నారు. వార్ సీక్వెన్స్‌లు చాలా అద్భుతంగా ఉంటాయి. సరికొత్త అనుభూతిని పంచుతాయి.
- భారీ బడ్జెట్‌తో మంచి నిర్మాణ విలువలతో తీసిన సినిమా ఇది. చరిత్ర, సంస్కృతి, ధార్మిక అంశాల మేళవింపుగా తెరకెక్కించాం. గీతా ఆర్ట్స్ తెలుగులో విడుదల చేయడం ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తుంది.
- శ్రీ మహావిష్ణువు దశావతారాలను బిగ్ కాన్వాస్‌లో చూపించాలనే ఆలోచనతో మహావతార్ యూనివర్స్ మొదలైంది. ఈ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. నటీనటుల ఇమేజ్ దేవుడి పాత్రలను డామినేట్ చేసే అవకాశం ఉంటుంది కాబట్టే యానిమేషన్‌లో అయితేనే ఇలాంటి కథకు న్యాయం చేయగలం అని భావించాం.

ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది



- ప్రవీణ పరుచూరి

'ఒక మంచి సినిమాను తీయడం దాన్ని ప్రేక్షకుల చెంతకు చేర్చడం చాలా కష్టం. ఎన్నో అడ్డంకులను అధిగమించి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది. మానవ సంబంధాల్ని చక్కగా చూపించారు అని అందరూ ప్రశంసిస్తున్నారు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. మనోజ్ చంద్ర, మోనిక హీరో హీరోయిన్లుగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతున్నారు. రామకృష్ణ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అయిన విధానం, సినిమాను ఆస్వాదిస్తున్న తీరు ఆనందాన్నిస్తోంది. నా సినీ గమనాన్నే మార్చిన పాత్ర చేశాను. మంచి సినిమాతో ప్రేక్షకులను అలరించాలనే కోరిక నెరవేరింది' అని అన్నారు. మనుషుల విలువల్ని, వారి మధ్య ఉండే భావోద్వేగాల్ని దర్శకురాలు తెరపై ఎంతో సహజంగా చూపించారు కాబట్టే సినిమా విజయవంతమైంది అని నిర్మాతలు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌ను కలసిన దుల్కర్ సల్మాన్



మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల జరిగిన గద్దర్ అవార్డుల వేడుకల్లో 'లక్కీ భాస్కర్' చిత్రానికి గాను దుల్కర్‌ను ఉత్తమ నటుడి పురస్కారం వరించిన విషయం తెలిసిందే. అయితే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి దుల్కర్ హాజరు కాలేకపోయారు. ఆదివారం దుల్కర్ సల్మాన్ తన టీమ్‌తో కలసి సీఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనతో పాటు నిర్మాతలు స్వప్న దత్, సుధాకర్ చెరుకూరి తదితరులు ఉన్నారు.

పవన్‌కు జోడీగా



హీరోయిన్ రాశీ ఖన్నా ఓ క్రేజీ ఆఫర్ దక్కించుకున్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండడంతో శ్రీలీలను ఇప్పటికే ఓ కథానాయికగా ఖరారు చేశారు. మరో కథానాయికగా రాశీని ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో జరుగుతున్న చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో పవన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటోంది. సినిమాలో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో ఆయన కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్, హరీశ్ కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.



బాలీవుడ్ నటుడు సోనూసూద్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ఒకటి ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ముంబైలోని తన నివాసం దగ్గర్లో విషపూరితం కాని ఒక పామును ఆయన ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ వీడియోను తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది మీరు ప్రయత్నించొద్దు. ఇటువంటి పరిస్థితి ఎదురైతే నిపుణులను సంప్రదించండి. జాగ్రత్తగా ఉండండి' అని పేర్కొన్నారు.

డాన్ దర్శకుడు చంద్ర బారోట్ కన్నుమూత



అమితాబ్ బచ్చన్ కథానాయకుడిగా నటించిన బాలీవుడ్ క్లాసిక్ హిట్ 'డాన్' దర్శకుడు చంద్ర బారోట్ (86) కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ నటించి, నిర్మించిన పలు చిత్రాలకు చంద్ర సహాయ దర్శకుడిగా పనిచేశారు. 'డాన్' సినిమాను అద్భుతంగా తెరకెక్కించి, తొలి చిత్రంతోనే ఇండస్ట్రీ హిట్‌ను అందుకున్నారు. 1990లో ఆయన తెరకెక్కించిన బెంగాలీ చిత్రం 'ఆశ్రిత' ప్రేక్షకాదరణ పొందింది. తన సినిమా కెరీర్ సజావుగా సాగకపోవడంతో చంద్ర బారోట్ సినిమాల నుంచి వైదొలగి అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో కొనసాగారు. 'డాన్' చిత్రం పలు భాషల్లో రీమేక్ అయింది. తెలుగులో ఎన్టీఆర్ హీరోగా 'యుగంధర్' పేరుతో తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. అమితాబ్ సహా పలువురు బాలీవుడ్ తారలు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.




తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇండస్ట్రీకి చెందిన మహిళా స్టంట్‌మాస్టర్స్‌ను సత్కరించింది. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్, సీనియర్ నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా అపూర్వ లాఖియా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అనే చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ వాసి కల్నల్ బికుమళ్ల సంతోష్‌బాబు జీవితం ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ను ఆగస్టు నుంచి ప్రారంభించనున్నారు. ముంబైలో జరిగే ఈ షెడ్యూల్‌తో సల్మాన్ ఖాన్ సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఇందులో కథానాయకుడి గతానికి సంబంధించిన ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆ తర్వాత లద్దాఖ్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఈ సినిమాలో శక్తిమంతమైన యుద్ధవీరుడిగా కనిపించేందుకు సల్మాన్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఇందుకోసం శిక్షణ కూడా తీసుకున్నారు.

అజిత్‌కు తప్పిన ప్రాణాపాయం



కారు రేసింగ్ పోటీల్లో పాల్గొన్న హీరో అజిత్ కుమార్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయన అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇటలీలో జీటీ4 కార్ రేసింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో అజిత్ కుమార్ రేసింగ్ జట్టు కూడా పాల్గొంటోంది. ఆ సందర్భంగా అజిత్ కుమార్ నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ పోటీల్లో ముందుభాగంలో దూసుకెళుతున్న కారు ఒకటి ఉన్నట్టుండి అడ్డుగా రావడంతో ఆ కారును అజిత్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. అయితే, అజిత్ మాత్రం అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆడిషన్ల పేరిట మోసాలను అడ్డుకోవాలి

రకరకాల పేర్లతో ఏర్పాటవుతున్న నకిలీ సినీ అసోషియేషన్లు ఆడిషన్ల పేరిట మోసాలకు పాల్పడుతున్నాయి, సినీ ఇండస్ట్రీకి చెందిన యూనియన్‌లు అన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఇలాంటి మోసాలను అడ్డుకోవాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సినీరంగం పట్ల ఆసక్తి ఉన్నవారు నిజమైన సినీ సంఘాలను సంప్రదించి, వారి ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టాల'ని సూచించారు. ఏపీలో కొన్ని చోట్ల ఆడిషన్ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూసేవాళ్లను అడ్డుకున్నామని తెలిపారు. ఎటువంటి అవగాహన లేకుండా కొందరు యూనియన్లు ఏర్పాటు చేసి చిన్న కళాకారులు, టెక్నీషియన్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారనీ దీనిపై చిత్ర పరిశ్రమ పెద్దలు స్పందించాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ వ్యవస్థాపకులు అంబటి మధుమోహన్ కృష్ణ కోరారు.

టెస్టు సిరీస్‌కు నితీశ్ దూరం!



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మోకాలి గాయం కారణంగా మిగిలిన రెండు టెస్టులకు దూరమయ్యే అవకాశం ఉంది. ఆదివారం అతడు జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా మోకాలికి గాయమైంది. స్కానింగ్‌లో లిగమెంట్ దెబ్బతిన్నట్టు తేలడంతో సిరీస్‌లో అతడు ఆడేది సందేహంగా మారింది. అయితే నితీశ్ గాయంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించలేదు. తొలి టెస్టులో ఆడని నితీశ్‌కు ఆ తర్వాత రెండు టెస్టుల్లో చోటు కల్పించారు. అయితే లార్డ్స్ టెస్టులో 3 వికెట్లు, 43 పరుగులతో ఫర్వాలేదనిపించాడు.

అన్షుల్‌కు పిలుపు

గాయంతో అర్ష్‌దీప్, ఆకాశ్ అవుట్ ● కీపర్‌గా జురెల్!



అవకాశం దక్కేనా?

నాలుగో టెస్టులో మూడో పేసర్‌గా అన్షుల్‌తో అరంగేట్రం చేయిస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ప్రసిద్ధ్ క్రిష్ణకు తొలి రెండు టెస్టుల్లో అవకాశం ఇచ్చినా ప్రభావం చూపలేకపోయాడు. ఆల్‌రౌండర్ శార్దూల్ సైతం నిరాశపర్చాడు. దీంతో దేశవాళీల్లో ఫామ్ కనబర్చిన అన్షుల్‌కు చాన్స్ ఇస్తే తప్పేమిటని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. అన్షుల్ తన చివరి 11 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 55 వికెట్లు తీయగా, గత రంజీ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనే 34 వికెట్లు పడగొట్టాడు. పైగా ఇంగ్లండ్ 'ఎ'తో ఇక్కడ ఆడిన అనుభవం కూడా అతనికి ఉంది. అందుకే బుమ్రా, సిరాజ్‌లకు అన్షుల్ చక్కటి సహకారం అందించగలడన్నది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.

మాంచెస్టర్: సిరీస్‌లో సజీవంగా ఉండేందుకు నాలుగో టెస్టులో విజయంపై దృష్టి సారించిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి అతడి స్థానంలో యువ లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇస్తారని అంతా భావించారు. కానీ రెండు రోజుల క్రితం గాయం కావడంతో మాంచెస్టర్ టెస్టుకు అర్ష్‌దీప్ అందుబాటులో ఉండడం లేదు. ప్రాక్టీస్ సమయంలో బంతిని ఆపుతుండగా అర్ష్‌దీప్ ఎడమ చేతికి గాయమైంది. అలాగే మరో పేసర్ ఆకాశ్ దీప్‌నకు గజ్జల్లో గాయం కావడంతో అతను కూడా నాలుగో టెస్టుకు దూరం కానున్నాడు. లార్డ్స్ టెస్టు నాలుగో రోజు ఆటలో అతను చికిత్స కోసం మైదానం కూడా వీడాడు. అటు బెకెన్‌హామ్‌లో జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్‌లోనూ ఆకాశ్ బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరూ జట్టుతో పాటే మాంచెస్టర్‌కు వెళ్లినా వీరి గాయం తీవ్రతపై సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అన్షుల్ జట్టులోకి..: ఇద్దరు పేసర్లు గాయపడడంతో ముందు జాగ్రత్తగా హరియాణాకు చెందిన 24 ఏళ్ల పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను బ్యాకప్ కోసం ఇంగ్లండ్‌కు రప్పించనున్నారు. తాజా సిరీస్‌కు ముందు అన్షుల్ భారత్ 'ఎ' తరఫున ఇంగ్లండ్ 'ఎ'తో రెండు అనధికార టెస్టులు ఆడాడు. అన్షుల్ రెండో మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో ఆకట్టుకోవడంతో పాటు బ్యాటింగ్‌లోనూ తనుష్ కోటియన్‌తో కలిసి అజేయంగా 149 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. దీంతో భారత్ 'ఎ' జట్టు ఓటమి నుంచి తప్పించుకొని మ్యాచ్‌ను డ్రా చేయగలిగింది.

పంత్ పరిస్థితేమిటి?



భారత నెట్ సెషన్‌లో ధ్రువ్ జురెల్ కీపింగ్ ప్రాక్టీస్ చేస్తుండడంతో గాయంతో ఉన్న రిషభ్ పంత్ ప్రాతినిధ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కీపింగ్‌కు దూరమై కేవలం బ్యాటర్‌గానే ఆడతాడనే కథనాలు కూడా వినిపిస్తున్నాయి. అదే జరిగితే జురెల్ వికెట్ల వెనకాల కనిపించనున్నాడు. మూడో టెస్టు తొలి రోజు బుమ్రా వేసిన బంతిని పంత్ చేతి వేలికి బలంగా తాకింది. దీంతో తను రెండు ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ చేసినా కీపింగ్‌కు మాత్రం దూరమయ్యాడు. సోమవారం తను ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన వీడియోలో బంతిని చక్కగా త్రో వేయడంతో పాటు బ్యాటింగ్‌లోనూ ఎలాంటి అసౌకర్యానికి గురి కాలేదు. కానీ కీపింగ్ మాత్రం చేయకపోవడంతో, అతడిని స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించి కీపింగ్ బాధ్యతలు జురెల్‌కు అప్పగించే అవకాశం కనిపిస్తోంది.



జురెల్

సెమీస్‌కు హంపి



మహిళల చెస్ వరల్డ్‌కప్

టైబ్రేక్‌కు హారిక, దేశ్‌ముఖ్
వైశాలి అవుట్

బటూమి (జార్జియా): తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి.. ఫిడే మహిళల వరల్డ్‌కప్‌లో సంచలన ప్రదర్శన చేసింది. ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణానికి మరింత చేరువైంది. చైనా క్రీడాకారిణి యుక్సిన్ సాంగ్‌తో క్వార్టర్‌ఫైనల్ పోరులో శనివారం తొలి గేమ్ గెలిచిన హంపి.. ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను డ్రా చేసుకొంది. దీంతో హంపి 1.5-0.5 ఆధిక్యంతో యుక్సిన్‌పై గెలిచి తొలిసారి సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకొంది. ఈ క్రమంలో.. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో సెమీస్ చేరిన తొలి భారత మహిళగా హంపి రికార్డు సృష్టించింది. కాగా, భారత్‌కు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాన్ జోంగి (చైనా)తో క్వార్టర్స్‌లో తొలి గేమ్‌ను డ్రాగా ముగించిన వైశాలి.. రెండో గేమ్‌లో ఓటమి పాలైంది. దీంతో వైశాలి 0.5-1.5తో టాంగ్ చేతిలో ఓడి టోర్నీ నుంచి వెనుదిరిగింది. ఇక.. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక, దివ్యా దేశ్‌ముఖ్ మధ్య క్వార్టర్స్ పోరులో రెండో గేమ్ కూడా డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరూ 1-1తో సమంగా నిలవడంతో.. ఫలితం కోసం టైబ్రేక్‌లో తలపడనున్నారు.

మూడోస్థానం రేస్‌లో కార్ల్‌సన్

లాస్ వెగాస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ రేస్ నుంచి నిష్క్రమించిన వరల్డ్ నెంబర్‌వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ ఇప్పుడు మూడోస్థానం కోసం పోటీపడనున్నాడు. లోయర్ బ్రాకెట్ నాకౌట్స్‌లో భారత్‌కు చెందిన అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానందపై కార్ల్‌సన్ గెలిచాడు. మూడో స్థానం కోసం జరిగే పోరులో నకమురాతో కార్ల్‌సన్ తలపడనున్నాడు. టైటిల్ కోసం అరోనియన్‌తో నీమన్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. కాగా, ఐదో స్థానం కోసం కరువానాతో అర్జున్, ఏడో స్థానం కోసం సో వెస్లీతో ప్రజ్ఞానంద ఆడనున్నారు.

2031 వరకు లండన్‌లోనే..

డబ్ల్యూటీసీ ఫైనల్‌పై ఐసీసీ



సింగపూర్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ 2031 వరకు ఇంగ్లండ్‌లోనే జరుగుతుందని ఐసీసీ తేల్చింది. ఆదివారం సింగపూర్‌లో జరిగిన ఐసీసీ ఏజీఎంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. 2019లో ఆరంభమైన డబ్ల్యూటీసీలో ఇప్పటి వరకు మూడు ఫైనల్స్‌కు ఇంగ్లండే ఆతిథ్యమిచ్చింది. అయితే వచ్చేసారి భారత్‌లో నిర్వహించాలని బీసీసీఐ ప్రయత్నించినా సఫలం కాలేకపోయింది. ఇప్పటికిదాకా ఆతిథ్యమిచ్చిన ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహణ తీరుపై సంతృప్తి చెందడంతో 2027, 2029, 2031 డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆతిథ్య హక్కులను ఇచ్చినట్టు ఐసీసీ పేర్కొంది. మరోవైపు టిమోర్-లెస్టే క్రికెట్ సమాఖ్య, జాంబియా క్రికెట్ యూనియన్లను అసోసియేట్ సభ్య దేశాలుగా చేర్చుకుంది.

బంగ్లా చేతిలో పాక్ చిత్తు

మిర్పూర్: ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన బంగ్లాదేశ్.. తొలి టీ20లో పర్యాటక పాకిస్థాన్‌కు ఝలక్ ఇచ్చింది. ఓపెనర్ పర్వేజ్ హొస్సేన్ ఇమాన్ (56 నాటౌట్) అజేయ అర్ధశతకంతో.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లా 7 వికెట్లతో పాక్‌ను మట్టికరిపించింది. మొదట పాక్ 19.3 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫఖార్ జమాన్ (44), అబ్బాస్ అఫ్రీది (22), కుష్‌దిల్ షా (17) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. టస్కిన్ అహ్మద్ 3, ముస్తాఫిజుర్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో బంగ్లా 15.3 ఓవర్లలో 112/3 స్కోరు చేసి గెలిచింది. తౌహిద్ హ్రిదయ్ (36) రాణించాడు. సల్మాన్ మీర్జా రెండు వికెట్లు పడగొట్టాడు.

పాక్‌తో ఆడేది లేదు

భారత వెటరన్ క్రికెటర్ల బాయ్‌కాట్
ఇండో-పాక్ లెజెండ్స్ మ్యాచ్ రద్దు



బర్మింగ్‌హామ్: వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)ను ఇండో-పాక్ ఉద్రిక్తతలు కుదిపేశాయి. టీమిండియా మాజీ స్టార్లు బాయ్‌కాట్ చేయడంతో.. భారత్, పాకిస్థాన్ వెటరన్ జట్ల మధ్య ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేయాల్సి వచ్చింది. గత ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా మరికొందరు భారత వెటరన్ క్రికెటర్లు పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించారు. డబ్ల్యూసీఎల్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. రెండో అంచె జూన్ 18న ఆరంభం కాగా.. వచ్చే నెల 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ భారత జట్టుకు సారథ్యం వహిస్తుండగా.. ధవన్, హర్భజన్, యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, రైనా, ఊతప్ప, ఆరోన్ జట్టు సభ్యులు. పాక్ జట్టు కెప్టెన్‌గా షాహిద్ అఫ్రీది వ్యవహరిస్తున్నాడు. 'కొన్ని మధురానుభూతులు అందించాలనుకొన్నాం. అయితే, ఈ ప్రయత్నంలో కొందరి సెంటిమెంట్స్‌ను గాయపరిచినట్టు అర్థమైంది. ఎవరికైనా బాధ కలిగి ఉంటే క్షమాపణలు కోరుతున్నామ'ని డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కలిసి తిరుగుతారు కానీ...

భారత వెటరన్ క్రికెటర్ల నిర్ణయంపై పాక్ నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. 'కలిసి తిరుగుతారు. హోటళ్లకు, షాపింగ్‌కు అంతా వెళతారు. తెరవెనుక సీన్ వేరే విధంగా ఉంటుంది. కానీ, ప్రజల ముందు మాత్రం మేం ఆడమంటూ రచ్చ చేస్తున్నార'ని పాక్ మాజీ పేసర్ అబ్దుర్ రౌఫ్ ఖాన్ విమర్శించాడు.

శ్రీశంకర్‌కు 'పోర్చుగల్' టైటిల్



న్యూఢిల్లీ: భారత స్టార్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. పోర్చుగల్‌లోని మయియాలో జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ మీట్‌లో టైటిల్ విజేతగా నిలిచాడు. శనివారం రాత్రి జరిగిన మీట్ ఫైనల్స్ లాంగ్ జంప్‌లో శ్రీశంకర్.. 7.75 మీటర్ల దూరాన్ని లంఘించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.

మాంచెస్టర్ స్టార్లతో టీమిండియా



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టు కోసం మాంచెస్టర్ చేరుకున్న టీమిండియా క్రికెటర్లు.. ప్రఖ్యాత సాకర్ క్లబ్ మాంచెస్టర్ యునైటెడ్ జట్టు ఆటగాళ్లతో కలిసి సందడి చేశారు. ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఇరుజట్ల ఆటగాళ్ల కోచ్‌లు, కెప్టెన్లు, ఆటగాళ్లు కలిసి క్రికెట్, ఫుట్‌బాల్ ఆడారు. టీమిండియా కెప్టెన్ గిల్, మాంచెస్టర్ యునైటెడ్ జట్టు సారథి బ్రూనో ఫెర్నాండెజ్‌తో పాటు ఆటగాళ్లందరూ ఒకరి జెర్సీలు ఒకరు మార్చుకొని ఫొటోలకు పోజిచ్చారు.

నాకు దక్కిన గొప్ప గౌరవం

అండర్సన్



లండన్: భారత-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌ను అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీగా పిలుచుకుంటున్నారు. అయితే దిగ్గజ సచిన్ పేరు పక్కన తన పేరు చూసి గర్వంగా భావించినట్టు అండర్సన్ తెలిపాడు. 'క్రికెట్‌లో సచిన్ ఓ దిగ్గజ ఆటగాడు. అలాంటి క్రికెటర్‌తో కలిసి ట్రోఫీని పంచుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నిజానికి నేను అతడితో సరితూగగలనా? అని కూడా మనసులో అనుకున్నా. కానీ మన పేరుతో ట్రోఫీని నిర్వహించడమే చాలా గొప్ప విషయం. అది కూడా సచిన్ సరసన నాకు స్థానం దక్కడం ఎనలేని సంతోషాన్నిచ్చింది. చిన్నప్పటి నుంచి అతడి ఆటను చూసి పెరిగాను. ప్రత్యర్థిగానూ ఆడా' అని అండర్సన్ వివరించాడు.

బిజినెస్

'ఆటో' ఎగుమతుల జోరు


క్యూ1లో 22 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆటోమొబైల్ ఎగుమతులు 22 శాతం వృద్ధి చెందినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. ఈ కాలంలో మొత్తం ఎగుమతులు 14,57,461 యూనిట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 11,92,566 యూనిట్లుగా ఉన్నాయి. ప్యాసింజర్ వాహన ఎగుమతులు రికార్డు స్థాయికి చేరటంతో పాటు ద్విచక్ర, వాణిజ్య వాహన విభాగాల్లో బలమైన పెరుగుదల ఈ వృద్ధికి కారణమని సియామ్ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2,04,330 యూనిట్లుగా ఉన్నాయి. పశ్చిమాసియా సహా అమెరికా మార్కెట్లలో స్థిరమైన డిమాండ్ కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపింది. ఈ కాలంలో ద్విచక్ర, వాణిజ్య వాహన ఎగుమతులు 23 శాతం వృద్ధితో వరుసగా 11,36,942 యూనిట్లు, 19,427 యూనిట్లుగా ఉన్నాయి. జూన్ త్రైమాసికంలో దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ 96,181 యూనిట్లను ఎగుమతి చేసి మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది.

ఐదేళ్లలో 30% మార్కెట్ వాటా లక్ష్యం: హెచ్ఎంఎస్ఐ

2030 నాటికి దేశీయ ద్విచక్ర వాహన మార్కెట్లో వాటా 30 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో 27 శాతం వాటాతో హోండా రెండో స్థానంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ద్విచక్ర వాహన విక్రయాలు 1.88 కోట్ల యూనిట్లుగా ఉండగా హోండా మోటార్‌సైకిల్ విక్రయాలు 47.89 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. కాగా హీరో మోటోకార్ప్ 54.45 లక్షల యూనిట్ల విక్రయాలతో అగ్రస్థానంలో ఉంది.

టాప్‌గేర్‌లో ఐపీఓ మార్కెట్



ఈ ఏడాది 6 నెలల్లో రూ.45,351 కోట్ల సమీకరణ
2024 ఇదే కాలంతో పోల్చితే 45 శాతం ఎక్కువ

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో 24 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.45,351 కోట్లు సమీకరించాయి. గత ఏడాది ఇదే కాలంలో 36 కంపెనీలు సమీకరించిన రూ.31,281 కోట్లతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. గత ఆరు నెలల్లో ఇష్యూల సంఖ్య తగ్గినా సమీకరించిన నిధులు పెరగడం విశేషం. ప్రైమరీ మార్కెట్లో నెలకొన్న ఈ జోరు డిసెంబరు వరకు కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దేశీయ మదుపరులకు ఐపీఓలపై పెరుగుతున్న మోజు, లాభాలు ఇందుకు దోహదం చేయనున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితులు పెరిగినా భారత ఐపీఓ మార్కెట్ జోరు మీద ఉండడం విశేషం. గత ఏడాది తొలి ఆరు నెలల్లో 52 కంపెనీలు తమ ఐపీఓల కోసం సెబీకి దరఖాస్తు చేస్తే గత ఆరు నెలల్లో ఈ సంఖ్య ఏకంగా 118కు పెరిగింది.

ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓ: ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) అనుబంధ సంస్థ ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎన్ఎల్‌సీఐఎల్ సీఎండీ మోటుపల్లి ప్రసన్న కుమార్ ఈ విషయం ప్రకటించారు. వచ్చే ఏడాది సెప్టెంబరులోగా ఈ ఐపీఓ పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఎన్ఐఆర్ఎల్ పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్టు చెప్పారు.

ఇతర ప్రధాన అంశాలు

- ప్రీమియంతో లిస్టయిన 67 శాతం ఐపీఓలు
- సగటున 25 శాతం రాబడులు పంచిన పబ్లిక్ ఇష్యూలు
- తయారీ, మౌలిక రంగాల నుంచే ఎక్కువ ఐపీఓలు
- ఈ నెలలో ఇప్పటికే 4 ఇష్యూలు
- నెలాఖరులోగా మరో ఐదు ఐపీఓలు

అతిపెద్ద పబ్లిక్ ఇష్యూలు

కంపెనీ పేరు	(రూ.కోట్లలో)
హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్	రూ.12,500
హెక్సావేర్ టెక్నాలజీస్	రూ.8,750
స్లాస్ బెంగళూరు	రూ.3,500
ఏథర్ ఎనర్జీ	రూ.2,981

24 నుంచి బ్రిగేడ్ హోటల్స్ ఇష్యూ: ఐపీఓ ద్వారా రూ.750 కోట్లు సమీకరించేందుకు బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఈ నెల 24న క్యాపిటల్ మార్కెట్‌కు వస్తోంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించే రూ.750 కోట్లలో రూ.468.14 కోట్లు రుణ చెల్లింపులకు, రూ.197.52 కోట్లు ప్రమోటర్‌కే చెందిన కొంత స్థలం కొనుగోలుకు వినియోగిస్తారు. మిగతా నిధులను కంపెనీ వ్యాపార విస్తరణ కోసం వినియోగిస్తామని కంపెనీ తెలిపింది.

నేటి నుంచే సావీ ఇన్‌ఫ్రా ఐపీఓ: గుజరాత్ కేంద్రంగా పనిచేసే ఈపీసీ కంపెనీ సావీ ఇన్‌ఫ్రా అండ్ లాజిస్టిక్స్ ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. రూ.70 కోట్ల సమీకరణ కోసం మార్కెట్‌కు వస్తున్న ఈ ఎస్ఎంఈ కంపెనీ ఐపీఓ ఈ నెల 23న ముగుస్తుంది. ఈ ఇష్యూ ప్రైస్ బ్యాండ్‌ను రూ.114/120గా నిర్ణయించారు.

కాయిన్‌డీసీఎక్స్‌పై సైబర్ దాడి

రూ.378 కోట్లు గాయబ్

న్యూఢిల్లీ: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. క్రిప్టోకరెన్సీల ట్రేడింగ్ ఎక్స్ఛేంజీలను వదలడం లేదు. భారత్‌లో క్రిప్టోకరెన్సీల్లో ట్రేడింగ్ చేసే వారికి సేవలందించే కాయిన్‌డీసీఎక్స్‌పైనా హ్యాకర్లు దాడి చేసి 4.42 కోట్ల డాలర్ల (సుమారు రూ.378 కోట్లు) కొట్టేశారు. అయితే ఇది తమ అంతర్గత ఖాతా సొమ్ము అని, ఖాతాదారుల నిధులకు ఎలాంటి ఢోకా లేదని కాయిన్‌డీసీఎక్స్ ప్రకటించింది. సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తాన్ని తమ ట్రెజరీ రిజర్వుల నుంచి భర్తీ చేసుకుంటామని పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం ప్లాంట్‌పై ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం ప్లాంట్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఏడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫారం-483 జారీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈ నెల 10 నుంచి 18 వరకు ఈ ఫార్ములేషన్స్ ప్లాంట్‌లో ఎఫ్‌డీఏ తనిఖీలు చేపట్టి ఈ అభ్యంతరాలను లేవనెత్తిందని తెలిపింది. నిర్దేశిత గడువులోగా వీటిని సరిదిద్దుతామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

25,350 ఎగువన బుల్లిష్

(జూలై 21-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ లైన్స్

నిఫ్టీ గత వారం 25,245-24,919 పాయింట్ల మధ్యన కదలాడి చివరకు 0.73 శాతం నష్టంతో 24,968 వద్ద క్లోజైంది. ఈ వారాంతంలో 25,350 ఎగువన క్లోజయితే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,350
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,600
నిరోధ స్థాయిలు: 25,175, 25,275, 25,375 (25,075 ఎగువన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,750, 24,650, 24,550 (24,850 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	543	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	112
వరంగల్	109	గుంటూరు	117
కరీంనగర్	109	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	106
కర్నూలు	109	నెల్లూరు	111
విశాఖపట్నం	95	అనంతపురం	111
గోదావరి	112		

మదుపరులూ జాగ్రత్త!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత వచ్చేంత వరకు ఊగిసలాట తప్పకపోవచ్చు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కీలకంగా మారుతున్నాయి. నిఫ్టీ సైతం 25,000 దిగువకు రావటం నెగటివ్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తోంది. ఏమైనా సానుకూల సంకేతాలు వస్తే సూచీలు బౌన్స్‌బ్యాక్ అయ్యే అవకాశం ఉంది. మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేటెడ్ అవుతోంది. స్వల్పమధ్యకాలిక మూమెంటమ్ పర్వాలేదు. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్‌పై ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం రూ.266 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.260 వద్ద పొజిషన్ తీసుకుని రూ.290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.256 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంక్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ లేనప్పటికీ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఆసక్తి పెరిగింది. 20,50 రోజుల చలన సగటు వద్ద షేరు కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.1,425 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,400 శ్రేణిలో బై ఆన్ డిప్స్ పద్ధతిలో పొజిషన్ తీసుకుని రూ.1,480/1,530 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,375 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఫైనాన్స్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు బలాన్ని ప్రదర్శిస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా మెరుగవుతోంది. టైట్ రేంజ్‌లో కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.942 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.910/900 శ్రేణిలో ఎంటరై రూ.980/1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.880 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు సైడ్‌వేస్‌లో చలిస్తోంది. ప్రస్తుతం అక్యుములేషన్ దశ కొనసాగుతోంది. ఎఫ్ఐఐలు తమ వాటా పెంచుకున్నారు. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.71 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.70 వద్ద పొజిషన్ తీసుకుని రూ.82 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.67 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25,000 వద్ద గట్టి పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఆరంభంలో రికవరీ కనబరిచినా ఆ తర్వాత నిలదొక్కుకోలేక పోయింది. వారం మొత్తానికి 181 పాయింట్లు నష్టపోయి చివరకు 24,968 పాయింట్ల వద్ద క్లోజైంది. గత మూడు వారాలుగా నిఫ్టీ కరెక్షన్‌లోనే సాగుతూ దాదాపు 700 పాయింట్ల వరకు నష్టపోయింది. పుల్‌బ్యాక్ రియాక్షన్‌తో నిఫ్టీ మరోసారి 25,000 దిగువకు చేరింది. అలాగే మిడ్‌క్యాప్-100, స్మాల్ క్యాప్-100 సూచీలు కూడా గరిష్ఠ స్థాయిల నుంచి రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ 25,000 స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఒకటి, రెండు రోజుల్లో మార్కెట్ కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటేనే సానుకూల ట్రెండ్‌ను వెలువరిస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం తదుపరి నిరోధ స్థాయి 25,300 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 25,550. ఇది స్వల్పకాలిక నిరోధ స్థాయి కావడంతో స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ మరింత బలహీనతను సూచిస్తే తదుపరి మద్దతు స్థాయిలు 24,900 దిగువన ఉంటాయి. ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి. తదుపరి మద్దతు స్థాయి 24,450.

బ్యాంక్ నిఫ్టీ: వీక్లీ ప్రాతిపదికన ఈ సూచీ గత వారం 470 పాయింట్ల మేర నష్టపోయి చివరకు 56,280 వద్ద క్లోజైంది. గడచిన మూడు వారాల్లో ఈ సూచీ దాదాపు 1,400 పాయింట్లు నష్టపోయింది. తదుపరి ప్రధాన నిరోధం 56,700. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 57,300. సూచీ మరింత బలహీనపడితే ప్రస్తుత మద్దతు స్థాయి 56,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా వ్యవహరించటం మంచిది.

పాటర్న్: నిఫ్టీ సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" ఎగువన కచ్చితంగా బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్ 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏకు చేరువలో ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,060, 25,150
మద్దతు	24,900, 24,830

ఖమ్మం జిల్లా తాగునీటి కోసం

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

- పాలేరుకు రోజూ 2,000 క్యూసెక్కులు
- రైతులు నారుమళ్లకు వాడుకోవచ్చన్న అధికారులు


సాగర్ ఎడమ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

నాగార్జునసాగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వకు ఆదివారం ఉదయం ప్రాజెక్టు అధికారులు నీరు విడుదల చేశారు. ఖమ్మం జిల్లా ప్రజల తాగునీటి అవసరాల కోసం పాలేరు జలాశయం నింపడానికి నీరు విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకూ 1.7 టీఎంసీల నీరు విడుదల చేసినా.. పాలేరు జలాశయం నీటి మట్టం 14 అడుగులకు (మొత్తం నీటి మట్టం 24 అడుగులు) తగ్గింది. దీంతో తాగు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎడమ కాల్వకు మరోసారి నీరు విడుదల చేశామని అధికారులు పేర్కొన్నారు. ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో పోసిన నారు మడ్లు ఎండిపోకుండా రైతులు ఈ నీటిని వాడుకోవచ్చునన్నారు. ప్రతి రోజూ 2,000 క్యూసెక్కుల చొప్పున పాలేరు జలాశయం నిండేవరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 566.70 అడుగులకు (248.2946 టీఎంసీలు) చేరుకుంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 2,258 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు మొత్తం 4,058 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నది.

జల వివాదాల కమిటీకి అధికారుల పేర్లు పంపండి

- రాష్ట్రాన్ని కోరిన కేంద్ర జలశక్తి శాఖ

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారానికి ఏర్పాటు చేయనున్న కమిటీలో తెలంగాణ తరఫున నియమించాల్సిన అధికారుల పేర్లను ప్రతిపాదించాలని కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాన్ని కోరింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో గత బుధవారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు సమావేశమై రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిటీలో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించనున్న అధికారుల పేర్లను సూచించాలని తాజాగా కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ అంశంపై త్వరలో సమీక్ష నిర్వహించి అధికారుల పేర్లను ఎంపిక చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

గంజాయి అమ్ముతూ దొరికిన హోంగార్డు

కంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అరికట్టవలసిన పోలీసులే యథేచ్ఛగా దానిని అమ్ముతున్నారు. సంగారెడ్డి కోర్టులో హోంగార్డుగా పని చేస్తున్న కొమ్ముల రాజు (46) కంది పట్టణ శివారులోని ఓ హోటల్ వద్ద గంజాయి అమ్ముతూ శనివారం రాత్రి పోలీసులకు అడ్డంగా దొరికాడు. అతని వద్ద నుంచి 800 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి, ఆదివారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్ఆర్ఆర్ పక్కనే రైలు!

(మొదటిపేజీ తరువాయి)

కోరుతోంది. ఇక్కడ కూడా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు పక్కనే కొత్త రైలు మార్గాన్ని నిర్మిస్తే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇక్కడి రైలు మార్గాన్ని హైస్పీడ్ కారిడార్‌గా నిర్మించాలని.. అది రెండు రాష్ట్రాలకే కాకుండా ఇరుగుపొరుగు రాష్ట్రాలకు కూడా ఉపయుక్తమని భావిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన సందర్భంగా ఈ అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. సీఎం ఆలోచన బాగుందని ప్రశంసించిన కేంద్ర మంత్రి.. అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించినట్లు తెలిసింది. మరోవైపు ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతికి నిర్మించే రోడ్డు ఏయే ప్రాంతాల మీదుగా చేపట్టాలనే అంశాన్ని పరిశీలించే బాధ్యతను ఒక సంస్థకు అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈరోడ్డు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు, నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడకు దక్షిణం వైపుగా ఉండనుంది.



రూ.15,750 కోట్లతో రైల్వే ప్రాజెక్టు..

దేశవ్యాప్తంగా రైలు మార్గాల విస్తరణలో భాగంగా కేంద్రం 2023లో తెలంగాణకు రీజినల్ రింగు రైలు ప్రాజెక్టును మంజూరు చేసింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల మీదుగా ఈ రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. నిర్మాణానికి దాదాపు రూ.15,750 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. వివిధ రకాల సర్వేలు నిర్వహించిన అధికారులు.. తాజాగా ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) పూర్తిచేశారు. భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ ఏదీ ప్రారంభం కాలేదు. ఈ క్రమంలోనే తొలి ప్రతిపాదనను ఉపసంహరించుకుని.. రీజినల్ రింగు రోడ్డు పక్కనే రైలు మార్గాన్ని నిర్మించాలనే అంశం తెరపైకి వచ్చింది. దీనితో రీజినల్ రోడ్డు కోసం సేకరించే భూమికి పక్కనే.. రైలు మార్గానికి అవసరమైన భూమిని సేకరించనున్నారు.

కడుపు‘కోత’ల్లో టాప్!

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఫలితం ఉండటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రతి గంటకు 27 సిజేరియన్ డెలివరీలు జరుగుతున్నాయి. ఈ ఏడాది మే, జూన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కలిపి మొత్తం 67,103 ప్రసవాలు జరగ్గా.. అందులో 39,300 (58%) సిజేరియన్లే. ప్రైవేటు ఆస్పత్రుల్లో 73 శాతానికి పైగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 48% సిజేరియన్ ప్రసవాలేనని వైద్య ఆరోగ్యశాఖ సర్కారుకు ఇచ్చిన తాజా నివేదికలో పేర్కొంది. రెండు రోజుల క్రితం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది.



‘ప్రైవేటు’లో 25 జిల్లాల్లో 80 శాతం సీ-సెక్షన్లే

రాష్ట్రంలో ప్రైవేటు ఆస్పత్రులు ఎడాపెడా సిజేరియన్ (సీ సెక్షన్) ప్రసవాలు చేసేస్తున్నాయి. సాధారణ ప్రసవమంటే ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారు. అదే సిజేరియన్ అయితే కనీసం నాలుగైదు రోజులన్నా ఆస్పత్రిలో ఉండాలి. బిల్లు కూడా ఎక్కువ అవుతుంది. కొన్ని కేసుల్లో బిడ్డ అడ్డం తిరిగిందనే సాకుతోనూ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు సిజేరియన్ ప్రసవాలు చేస్తున్నాయి. రాష్ట్రంలో నిర్మల్, పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట, నిజామాబాద్, ములుగు జిల్లాల్లో 90% వరకు సిజేరియన్ డెలివరీలే కావడం గమనార్హం. అలాగే 80-90% మధ్యలో సిజేరియన్ జరుగుతున్న జిల్లాల జాబితాలో గద్వాల, ఆసిఫాబాద్, వికారాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, సూర్యాపేట, ఖమ్మం, జగిత్యాల, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మంచిర్యాల, వరంగల్, మహబూబాబాద్, హన్మకొండ జిల్లాలు ఉన్నాయి. ఒక్క మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మాత్రమే కేవలం 47% డెలివరీలు సిజేరియన్లని వైద్యఆరోగ్య శాఖ నివేదికలో వెల్లడైంది. మిగిలిన ఏడు జిల్లాల్లో 67-79% మధ్యలో సిజేరియన్లు జరుగుతున్నట్లు ఆ రిపోర్టులో పేర్కొంది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో 28,440 ప్రసవాలు జరగ్గా, అందులో 20,876 (73%) డెలివరీలు సిజేరియన్లేనని ఆ నివేదికలో వెల్లడైంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ అదే పరిస్థితి

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ 48% సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రధానంగా 8 జిల్లాల్లోని సర్కారీ దవాఖానాల్లో 70% ప్రసవాలు సిజేరియన్లేనని ఆ నివేదికలో వెల్లడైంది. జగిత్యాల (75%), నిర్మల్ (74), పెద్దపల్లి (73), హన్మకొండ (73), కరీంనగర్ (71), సిరిసిల్ల (71), వరంగల్ (69), మహబూబాబాద్ (67) జిల్లాల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. 20 జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాష్ట్ర సగటు 48% కంటే ఎక్కువగా సీ సెక్షన్లు జరుగుతున్నాయని ఆ నివేదిక పేర్కొంది. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగే జిల్లాల జాబితాలో మేడ్చల్ మల్కాజిగిరి అగ్రస్థానంలో ఉంది. అక్కడ జరిగే ప్రతి వంద ప్రసవాల్లో 74 సాధారణ ప్రసవాలే. ఆ తర్వాత స్థానాల్లో గద్వాల (72), ఆసిఫాబాద్ (71), ఆదిలాబాద్ (69) జిల్లాలు ఉన్నాయి. మే, జూన్ నెలల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొత్తం 38,663 ప్రసవాలు జరగ్గా, అందులో 20,239 సాధారణ, మిగిలిన 18,424 సీ సెక్షన్ జరిగాయి.

సిజేరియన్ల తగ్గింపునకు కార్యాచరణ

రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాలు పెరిగిపోతుండడంపై సర్కారు ఆందోళన వ్యక్తం చేస్తోంది. కొంతమేరకు తగ్గించేందుకు కార్యాచరణ చేపట్టింది. ప్రధానంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే సీ సెక్షన్ ప్రసవాలపై ఆడిట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించింది. ఎక్కువ సిజేరియన్లు చేస్తున్న వాటిపై నిఘా పెట్టనుంది. అలాగే సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించనున్నారు. హైరిస్క్ ప్రెగ్నెంట్ కేసులను ముందుగానే గుర్తించి, రిఫరల్ ఆస్పత్రులకు పంపనున్నారు. వైద్య విద్య సంచాలకులు, వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో మిడ్‌వైఫరీ సేవలను మరింత బలోపేతం చేయనున్నారు.

30 తర్వాత సాధారణ ప్రసవాలు కష్టమే



ప్రస్తుతం ఆడపిల్లలు ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. వెంటనే పిల్లల్ని కనడం లేదు. 30 దాటిన తర్వాత గర్భం దాల్చిన వారిలో సాధారణ ప్రసవం జరగడం కష్టమే. ఇటువంటి కేసుల్లో సిజేరియన్‌కే వైద్యులు ప్రాధాన్యమినిస్తారు. సీ సెక్షన్ పెరగడానికి ఇది కూడా ప్రధాన కారణం. అలాగే మొదటిసారి ప్రసవం సాధారణ ప్రసవమయ్యేలా చూడాలి. ఒకసారి సీ సెక్షన్ అయితే.. రెండోసారి నార్మల్ అవడం కష్టం. ఇటువంటి వాటిలో 60-70 శాతం సీ సెక్షన్ జరుగుతాయి. సాధారణ ప్రసవం కావాలంటే కొన్నిసార్లు 24 గంటల సమయం కూడా పడుతుంది. అంత సమయం వేచి చూడటం లేదు.

- డాక్టర్ వెల్లంకి జానకి, గైనకాలజిస్టు, గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి.

తూప్రాన్‌లో కుక్కల స్వైరవిహారం

- చిన్నారి సహా 10 మందికి గాయాలు

తూప్రాన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కుక్కల దాడిలో ఓ చిన్నారి సహా పదిమంది గాయపడ్డారు. పట్టణానికి చెందిన గీత, విశాల్ దంపతుల కుమారుడు అనిరుధ్ (3) ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడిచేసింది. ఈ దాడిలో అనిరుధ్ కంటికి తీవ్రగాయమైంది. చిన్నారిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆదివారం ఒక్కరోజే తూప్రాన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో కుక్కలు దాడిచేయగా మరో పదిమంది గాయపడ్డారు. వీరందరికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు.

కరిచిన పెంపుడు కుక్క.. రేబీస్‌తో యజమాని మృతి

- సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ఘటన


మధు (ఫైల్)

మేళ్లచెరువు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పెంపుడు కుక్కే తమ ఇంట్లో విషాదాన్ని నింపుతుందని ఆ కుటుంబసభ్యులు ఊహించలేదు. దానిపై దాడి చేసిన వీధికుక్కలను యజమాని తరుముతుండగా పొరపాటున పెంపుడు కుక్క ఆయన్ను కరవడంతో రేబిస్ సోకి మరణించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం కందిబండ గ్రామంలో జరిగింది. కందిబండ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి దక్కం మధు (42) కొంత కాలంగా ఇంట్లో ఓ కుక్కను పెంచుకుంటున్నారు. గత నెల 20వ తేదీన ఆ కుక్కపై కొన్ని వీధి కుక్కలు దాడిచేశాయి. వాటిని మధు తరుముతుండగా పొరపాటున పెంపుడు కుక్క ఆయన్ను కరిచింది. వెంటనే ఆయన మేళ్లచెర్వు ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. ఈ క్రమంలో ఆయనకు రేబీస్ సోకింది. వ్యాధి తీవ్రం కావడంతో కుటుంబసభ్యులు ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఇంటికి తిరిగొచ్చారు. ఈ క్రమంలో రేబిస్ వ్యాధి ముదిరి శనివారం మధు ఇంట్లోనే మృతి చెందారు.

మనోడు చెప్తే వాన పడాల్సిందే!

వాతావరణ అంచనాలతో ‘తెలంగాణ వెదర్‌మ్యాన్’గా అబ్బురపరుస్తున్న బాలాజీ తరణి



హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వాన రాకడ.. ప్రాణం పోకడ ఎవరికీ తెలియదంటారు. ప్రాణం సంగతేమో కానీ.. ఎక్స్‌లో ‘తెలంగాణ వెదర్‌మ్యాన్’ అనే ఖాతాను అనుసరించే వాళ్లకి వాన ఎప్పుడు పడుతుందనేది కచ్చితంగా తెలిసిపోతోంది. మరికాసేపట్లో ఫలానా ప్రాంతంలో వర్షం కురుస్తుందని ఆ ఖాతాలో పోస్టు వచ్చిందంటే అంతే.. చెప్పిన సమయానికి వర్షం పడుతుంది. తెలంగాణ వెదర్‌మ్యాన్ అంచనాలు అంతకచ్చితంగా ఉంటాయి. అందుకే సాధారణ ప్రజలతోపాటు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు, విలేకరులు, సహా ఎంతోమంది ఆ ఖాతాను అనుసరిస్తున్నారు. తెలంగాణ వెదర్‌మ్యాన్ అంటే ఎవరో వాతావరణ శాఖ నిపుణుడు అనుకుంటే పొరపాటే. హైదరాబాద్‌కు చెందిన బాలాజీ తరణి అనే ఓ మామూలు కుర్రాడే తెలంగాణ వెదర్‌మ్యాన్. చదువుకుంది సివిల్ ఇంజనీరింగ్ అయినప్పటికీ వాతావరణ పరిశోధనపై ఉన్న ఆసక్తితో బాలాజీ ఈ పని చేస్తున్నారు. 90-92% కచ్చితత్వంతో అంచనాలు ఇస్తున్నారు. ఆయన ఎక్స్ ఖాతాకు 1.42లక్షల మందికిపైగా ఫాలోయర్లు ఉన్నారు.

2020లో మొదలు..

జేఎన్‌టీయూలో ఈ ఏడాది సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన బాలాజీకి.. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే వాతావరణ అంచనాలు ముఖ్యంగా మేఘాల కదలికపై ఆసక్తి ఏర్పడింది. ఈ ఆసక్తితోనే ఓ ప్రత్యేక అల్గారిథమ్ రూపొందించుకున్న బాలాజీ.. వాతావరణాన్ని అంచనా వేయడం మొదలుపెట్టారు. తాను వేసిన అంచనాలు నిజం అవుతుండడంతో వాటిని అందరికీ తెలియజేసేందుకు సామాజిక మాధ్యమాలను ఎంచుకున్నారు. 2020 అక్టోబరులో ‘తెలంగాణ వెదర్‌మ్యాన్’ పేరిట ఎక్స్‌లో ఖాతాను ప్రారంభించి దానిలో తన అంచనాలను పోస్టు చేయడం ప్రారంభించారు. ఎక్స్‌టెండెడ్ ఫోర్‌కాస్ట్, మీడియం రేంజ్ ఫోర్‌కాస్ట్, షార్ట్‌రేంజ్ ఫోర్‌కాస్ట్ అని మూడు రకాలుగా బాలాజీ వాతావరణాన్ని అంచనా వేస్తుంటారు. ఈ అంచనాల కోసం వివిధ రకాల గణాంకాలు, ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ డాటా, క్లౌడ్ డాటా, మేఘాల కదలికలు, ఆకృతులు విశ్లేషిస్తుంటారు. ఐఎండీ కంటే మెరుగ్గా వాతావరణ అంచనాలు ఇస్తున్నావని ఎవరైనా అంటే.. దానిని ఓ ప్రశంసగా మాత్రమే భావించే బాలాజీ.. సామాజిక బాధ్యతగానే తాను విశ్లేషణలు చేస్తున్నానని చెబుతుంటారు. ఇక, సొంతంగా మెషీన్ లెర్నింగ్ ద్వారా సృష్టించుకున్న అల్గారిథమ్‌తో వాతావరణ అంచనాలు వేస్తు న్న బాలాజీ.. ఉపగ్రహ చిత్రాలను మాత్రం కొన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి సొంతంగా సమకూర్చుకున్న డబ్బుతో కొనుగోలు చేస్తుంటారు. పలు అంతర్జాతీయ సదస్సుల్లోనూ పర్యావరణం, వాతావరణంపై తన గొంతు వినిపించిన బాలాజీ.. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇదంతా సాధ్యమైందని చెబుతారు.

హైదరాబాద్‌లో భారీ వర్షాలు

రాబోయే 5-6 రోజుల్లో హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలంగాణ వెదర్‌మ్యాన్ బాలాజీ అంచనా వేశారు. వర్షపాత లోటు గతంలోనూ భారీ వర్షాల కారణంగానే భర్తీ అయిందని, ఈ సారి కూడా అదే కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. సగటు వర్షపాతం లేదంటే కాస్త అధికంగానే ఈసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఆగస్టు రెండో వారం తర్వాత, సెప్టెంబరులో వర్షాలు కురుస్తాయన్నారు. హైదరాబాద్‌తోపాటు మిగిలిన జిల్లాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని బాలాజీ అంచనా వేశారు.

రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు

- జూన్‌లో జల మట్టాల్లో స్వల్ప వృద్ధి
- మేలో 10.07 మీటర్ల లోతులో లభ్యత
- జూన్‌లో 9.47 మీటర్లకు తగ్గుదల
- 12 జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరమే
- అక్కడ 10-15మీటర్ల లోతున జలాలు
- జూన్‌లో లోటు వర్షపాతమే

హైదరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భ జలమట్టాల్లో స్వల్ప వృద్ధి నమోదైంది. జూన్‌లో సగటు భూగర్భ జలమట్టం 9.47 మీటర్లకు చేరింది. ఇది ఏప్రిల్‌లో 10.17 మీటర్లు ఉండగా.. ముందస్తుగా రుతుపవనాల రాకతో మే నెలలో కురిసిన వర్షాలతో 10.07 మీటర్లకు తగ్గింది. జూన్‌లో కురిసిన వర్షాలతో మరింత తగ్గి 9.47 మీటర్లకు చేరింది. మేతో పోలిస్తే జూన్‌లో భూగర్భ జలమట్టాలు సగటున 0.6 మీటర్ల మేర వృద్ధి చెందాయి. రాష్ట్ర భూగర్భ జల వనరుల శాఖ జూన్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ పరిశీలించి రూపొందించిన నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. ఆ జిల్లాల పరిధిలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాలను ప్రతి నెలా సమీక్షించి, తర్వాతి నెలలో నివేదికలు విడుదల చేస్తూ ఉంటారు. రాష్ట్రంలో గరిష్ఠంగా వికారాబాద్ జిల్లాలో 14.74 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జగిత్యాల జిల్లాలో అతి తక్కువగా 5.14 మీటర్ల లోతులోనే వాటి లభ్యత ఉంది. రాష్ట్రంలో జిల్లాలను సగటు భూగర్భ జల మట్టం (0-5 మీటర్లు, 5-10 మీటర్లు, 10 మీటర్ల పైన లోతు) ఆధారంగా మూడు క్యాటగిరీలుగా వర్గీకరిస్తారు. భూగర్భ జలాలు 0-5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. అయితే ఒక్క జిల్లాలో కూడా 0-5 మీటర్ల లోతులో లేవని గుర్తించారు. 21 జిల్లాల్లో 5-10 మీటర్లు, 12 జిల్లాల్లో 10-15 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నట్టు తేలింది. 10 మీటర్ల కన్నా లోతుకు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు భావిస్తారు.

22 జిల్లాల్లో భూగర్భ జలాల వృద్ధి

గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో రాష్ట్రంలోని 22 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో వృద్ధి నమోదయింది. మరో 11 జిల్లాల్లో క్షీణత కనిపించింది. గత ఏడాది జూన్‌లో రాష్ట్ర భూగర్భ జలాల సగటు లోతు 9.9 మీటర్లు కాగా.. ఈ ఏడాది జూన్‌లో 9.47 మీటర్లు నమోదైంది. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 2.19 మీటర్లు, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 0.09 మీటర్ల వృద్ధి నమోదైంది. రాష్ట్రంలో మొత్తం 621 మండలాలు ఉండగా, దశాబ్ద కాల సగటుతో పోలిస్తే జూన్‌లో 492 మండలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. కాగా, జూన్‌లో రాష్ట్ర వార్షిక సగటు వర్షపాతం 130 మి.మీ. కాగా, ఈ ఏడాది జూన్‌లో 104 మి.మీ. మాత్రమే నమోదైంది.



నేడు, రేపు భారీ వర్షాలు

2 రోజులు ఆరెంజ్ అలెర్ట్ జారీ

హైదరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు రోజుల పాటు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక సిరిసిల్ల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

కాంబోడియా సైబర్ నేర ముఠాకు సహకారం..

ముగ్గురు హైదరాబాదీల అరెస్టు

- తమ ఖాతాల్లో జమైన సొమ్మును.. క్రిప్టో కరెన్సీగా మార్చి కాంబోడియా పంపిన నిందితులు

హైదరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కాంబోడియా కేంద్రంగా పనిచేస్తున్న ఓ సైబర్ నేర ముఠాకు సహకరించిన హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. నిందితులు కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును తమ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించుకుని.. దానిని క్రిప్టో కరెన్సీగా కాంబోడియాకు పంపిస్తున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన వలీబుల్లా, రజియుద్దీన్, మహ్మద్ జుబేర్‌ఖాన్‌ను అరెస్టు చేశామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ వెల్లడించారు. సైబర్ నేరానికి బలైన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వీరి బండారం బయటపడింది. కేసు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి కొద్ది నెలల క్రితం ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి బజాన్ ఫిన్ సెక్యూరిటీస్ లిమిటెడ్ పేరుతో వాట్సా్‌ప్‌లో ఓ గ్రూప్ లింక్ వచ్చింది. ఆ వ్యక్తి గ్రూపులో చేరగా.. గ్రూప్ అడ్మిన్ ప్రీషా సింగ్, ఇన్వెస్ట్‌మెంట్ గైడ్ పూరవ్ జావేరీ అనే వారు బ్లాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని సూచించారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి.. 2025 మే 30 నుంచి జూలై 9వ తేదీ మధ్యలో రూ.3,24,85,000ను వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశాడు. ట్రేడింగ్ ఖాతాలోని తన వాలెట్‌లో పెట్టుబడి, వచ్చిన లాభం కనిపించడం, మధ్యలో ఓసారి రూ.5 లక్షలు విత్ డ్రా చేయగానే రావడంతో వారిని నమ్మేశాడు. అయితే, వాలెట్‌లో ఉన్న మిగిలిన సొమ్మును ఈ నెలలో విత్ డ్రా చేయగా.. బ్యాంకు ఖాతాలో డబ్బు జమ కాలేదు. దీంతో కస్టమర్ కేర్‌ను సంప్రదించగా 15 శాతం పన్ను చెల్లిస్తే నగదు బ్యాంకు ఖాతాలో జమవుతుందని సూచించారు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆ వ్యక్తి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. బాధితుడు జమ చేసిన సొమ్ము ఏ ఖాతాలకు వెళ్లిందనే దానిపై ఆరా తీశారు. హైదరాబాద్, మలక్‌పేటకు చెందిన నర్సింగ్ విద్యార్థి వలీబుల్లా ఖాతాకు రూ.15 లక్షలు వెళ్లినట్లు గుర్తించారు. వలీబుల్లా ఖాతాలోని ఆ సొమ్మును సంతోష్‌నగర్‌కు చెందిన రజియుద్దీన్ బేగంపేటలోని ఓ బ్యాంకులో చెక్కుల ద్వారా విత్ డ్రా చేసినట్లు కనుగొన్నారు. రజియుద్దీన్ ఆ రూ.15లక్షలను క్రిప్టో కరెన్సీగా మార్చి కాంబోడియాకు పంపినట్లు గుర్తించారు. రజియుద్దీన్, వలీబుల్లాను అదుపులోకి తీసుకుని విచారించగా వీరికి ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ జుబేర్ ఖాన్ తన బ్యాంకు ఖాతాలను అప్పగించినట్లు వెల్లడైంది. దీంతో జుబేర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. కాగా, థాయ్‌లాండ్ నుంచి పని చేసే ఓ చైనా ముఠా రజీయుద్దీన్‌ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి, తన బ్యాంకు ఖాతాలో జమైన డబ్బును క్రిప్టో కరెన్సీగా పంపిస్తే పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తామని ఆశపెట్టింది. రూ.1.5లక్ష అడ్వాన్స్ కూడా ఇచ్చింది. దీంతో రజీయుద్దీన్, తన స్నేహితులు వలీబుల్లా, జుబేర్‌ఖాన్‌తో కలిసి నేరాలకు పాల్పడినట్టు సైబర్ సెక్యూరిటీ అధికారులు కనుగొన్నారు.

బీటెక్ సెకండియర్‌లో బ్రాంచ్ మార్పు!


- అవకాశం కల్పించే యోచనలో ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ‘ఇంజనీరింగ్‌లో మొదట చేరిన బ్రాంచ్ చదవడం కష్టంగా ఉంది.. కొనసాగాలన్న ఆసక్తి లేదు.. వేరే బ్రాంచ్‌కి మారే అవకాశమివ్వండి’.. ఒకటి, రెండు సెమిస్టర్లు పూర్తయి అత్యధిక పేపర్లు ఫెయిలయ్యాక విద్యార్థులు తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయానికి వచ్చి చేస్తున్న విజ్ఞప్తి ఇది. గత ఏడాదికాలంలో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఇలాంటి దరఖాస్తులు చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలో ఒకసారి చేరాక ఇంటర్నల్ స్లైడింగ్, స్పాట్ కౌన్సెలింగ్ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యాక ఇతర కోర్సుల్లో చేరడం సాధ్యం కాదు. ప్రారంభంలో ఆసక్తిగా చేరిన విద్యార్థులు తర్వాత కొనసాగేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇష్టంలేని కోర్సు చదవలేక, అందులో ఉత్తీర్ణత సాధించలేక చదువుకు దూరమవుతున్నారు. ఇలా అనాసక్తితో బీటెక్ మధ్యలోనే మానేసిన వారు, నాలుగేళ్లు ఎలాగోలా నెట్టుకొచ్చినా తర్వాత బీటెక్ పట్టా పొందనివారి సంఖ్య ఏటా పెరుగుతోంది. గత రెండేళ్లలో దాదాపు 9 వేల మంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసినట్లు అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా ద్వితీయ సంవత్సరంలోనూ బ్రాంచ్ మారే అవకాశం ఇవ్వాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి భావిస్తోంది. ఈ దిశగా నిపుణుల సూచనలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం అనుమతిస్తే ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసే అవకాశాలున్నాయి.

ఇంటర్నల్ స్లైడింగ్‌తో కోర్ కోర్సులకు నష్టం..

ఇంజనీరింగ్ విద్య విద్యార్థుల ఆసక్తులకనుగుణంగా ఉండాలన్న లక్ష్యంతో కొత్త సంస్కరణలు అమలుచేయాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి భావిస్తోంది. ఇంజనీరింగ్‌లో ప్రవేశాలు పొందిన వారిలో అనేక మంది మధ్యలోనే చదువు ఆపేస్తుండగా.. మరికొందరు నాలుగేళ్ల తర్వాత కూడా తప్పిన సబ్జెక్టులు ఉత్తీర్ణులు కాలేక ఇంజనీరింగ్‌కు దూరమవుతున్నారు. దీనికి పరిష్కారంగా ద్వితీయ సంవత్సరంలోనూ బ్రాంచ్ మారే అవకాశమివ్వాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. మొదటి సంవత్సరం ప్రవేశాల్లో రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఇంటర్నర్ స్లైడింగ్‌లో ఒకే కాలేజీ పరిధిలో వేరే బ్రాంచ్‌కి మారే అవకాశం ఉంటుంది. ఈ విధానంలో అనేక మంది ఆసక్తితో కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో ప్రవేశం పొందిన తర్వాత.. ఇంటర్నల్ స్లైడింగ్‌లో అవకాశం ఉంటే సీఎస్ఈకి వెళ్లిపోతున్నారు. గత ఏడాది ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో దాదాపు 5,500 మంది ఇంటర్నల్ స్లైడింగ్ అవకాశాన్ని వినియోగించుకున్నారు. వీరంతా కోర్ కోర్సులైన ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్ వదిలి సీఎస్ఈ, అనుబంధ బ్రాంచ్‌లను ఎంచుకున్నారు. రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యాక మెకానికల్ ఇంజనీరింగ్‌లోని మొత్తం 4,456 సీట్లలో 3,983 (89.38%) సీట్లు భర్తీకాగా.. ఇంటర్నల్ స్లైడింగ్ తర్వాత ఇందులోని అనేక మంది సీఎస్ఈకి వెళ్లడంతో చివరగా మెకానికల్‌లో రాష్ట్రవ్యాప్తంగా 2,086 (46.81%) సీట్లు మిగిలిపోయాయి. అలాగే ట్రిపుల్‌ఈలో మొత్తం 6,303 సీట్లుండగా.. 2,326, ఈసీఈలో మొత్తం 15,634లో 1,401 సీట్లు మిగిలిపోయాయి. మిగిలిన సీట్లన్నీ భర్తీ చేయాలన్న లక్ష్యంగా ఇంటర్నల్ స్లైడింగ్ చేస్తున్నా.. కోర్ బ్రాంచ్‌లకు తీరని నష్టం జరుగుతోంది. రెండో సంవత్సరంలో విద్యార్థులకూ ఇంకో అవకాశం ఇస్తే కోర్ బ్రాంచ్‌ల్లోనూ సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంటుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది.

అన్ని బ్రాంచ్‌లకు సమ ప్రాధాన్యత లక్ష్యం




ఇంజనీరింగ్ అంటే కేవలం సీఎస్ఈ మాత్రమే కాదు. బీటెక్‌లో వివిధ బ్రాంచ్‌ల్లో మొత్తం 47 కోర్సులున్నాయి. సీఎస్ఈ చదివితేనే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అనేక మంది భావిస్తున్నా.. అది వాస్తవం కాదు. రాష్ట్రంలో అనేక రంగాలకు చెందిన భారీ పరిశ్రమలు వస్తున్నాయి. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, ఆటోమొబైల్.. ఇలా అనేక రంగాల్లో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలకు సీఎస్ఈ అవసరమైనట్టుగానే.. ఐటీయేతర కంపెనీల్లో మానవ వనరులకు కోర్ ఇంజనీరింగ్ పట్టభద్రులు అవసరం. అందుకే ద్వితీయ సంవత్సరంలోనూ ఇంటర్నల్ స్లైడింగ్ అవకాశం ఇచ్చి కోర్ ఇంజనీరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నాం.

- ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

మోదీ సేవలు ఇంకొన్నాళ్లు అవసరం

- ఆయన ప్రపంచంలోనే అత్యుత్తమ నేత
- ఏఐతో మహిళల కొలువులకు ముప్పు
- బీజేపీ సీనియర్ నేత రాంమాధవ్



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రధాని మోదీ ఎంతో శ్రమిస్తున్నారని, ఆయన సేవలు మరికొన్నాళ్లు అవసరమని బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ అన్నారు. భారత్ విశ్వగురుగా, బ్రాండ్ భారత్‌గా ఎదగాలంటే ఇంకా ఎంతో చేయాల్సింది ఉందని వ్యాఖ్యానించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దూరదృష్టి ఉండాలని, ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన అడుగులు ఉండాలని అభిప్రాయపడ్డారు. రాంమాధవ్ రచించిన 'ది న్యూ వరల్డ్- ట్వంటీ ఫస్ట్ సెంచరీ గ్లోబల్ ఆర్డర్ అండ్ ఇండియా' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో నిర్వహించారు. 21వ శతాబ్దంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన పరిణామాలు, ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల్లో భారత్ పాత్రను పుస్తకంలో వివరించారు. ఈ సందర్భంగా రాంమాధవ్ మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యుత్తమ నాయకుడని, ఆయనను ప్రపంచ దేశాలు సైతం గౌరవిస్తున్నాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాల్లో సాంకేతిక పరిజ్ఞానమే కీలకపాత్ర పోషించబోతోందని చెప్పారు. అప్పుడే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్(ఏజీఐ) కూడా అందుబాటులోకి వచ్చిందని, ఇది మరింత వాడుకలోకి వస్తే 30 శాతం ఉద్యోగాలు కోల్పోవడం ఖాయమని తెలిపారు. అందులో మహిళలే ఎక్కువ ఉంటారని, ఎందుకంటే వారికి సంబంధించిన ఉద్యోగాల్లోనే ఏజీఐ వినియోగం ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎఫ్ఎస్ అధికారి వెంకటేశ్ వర్మ, నల్సార్ వీసీ ప్రొఫెసర్ కృష్ణదేవరావు, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రూప వాసుదేవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం

- భవిష్యత్ కార్యాచరణపై 3న సదస్సు: ఆర్.కృష్ణయ్య



రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 56 శాతం బీసీ జనాభా ఉందని, వీరికి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అయితే చట్టపరంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన బీసీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టంలోని లొసుగుల సాకుతో రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు, కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న బీసీ కులగణన వంటి అంశాలపై భవిష్యత్ కార్యాచరణకు ఆగస్టు 3న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు కులాల వారీగా జనాభా లెక్కలు పక్కాగా చేయాలని ప్రధాని మోదీని కోరారు. ఆ లెక్కల ద్వారా జనాభా నిష్పత్తి మేరకు రిజర్వేషన్లు అందే అవకాశం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 253 డీ6, టీ6 ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. ఆగస్టు 3న జరిగే సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బీసీ కుల సంఘాలను ఆహ్వానిస్తున్నామని, వారి అభిప్రాయం ప్రకారం భవిష్యత్ ఆలోచన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, సతీష్, సుధాకర్, రాందేవ్, పృథ్వీరాజ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం!

- అనుబంధంగా క్రీడా పాఠశాల కూడా..
- వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై స్పందన

హైదరాబాద్/వరంగల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఉనికిచర్లలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం, దానికి అనుబంధంగా క్రీడా పాఠశాలను మంజూరు చేస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలకు ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, యశస్వినీరెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో జాతీయ రహదారికి ఆనుకుని 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాల ఏర్పాటుకు అనువుగా ఉంటుందని సీఎం దృష్టికి తెచ్చారు. ఉమ్మడి జిల్లాల వారీగా క్రీడా మైదానాలు, క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించారు. ఓరుగల్లు నగరంలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, విధివిధానాలు సిద్ధం చేయాలంటూ యువజన, క్రీడల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. నెలాఖరులోగా స్టేడియం, క్రీడా పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచించారు. అతి త్వరలోనే క్రికెట్ స్టేడియం, క్రీడా పాఠశాల మంజూరుకు చర్యలు తీసుకుంటానంటూ ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి వారం, పది రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, తమ విజ్ఞప్తికి వెంటనే సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, యశస్వినీరెడ్డి

రాహుల్‌తో కలిసి ప్రధాని వద్దకు!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీలో ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ కేంద్రానికి పంపిన బిల్లులపై పార్లమెంటులో చర్చ పెట్టించి, ఆమోదింపజేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఇండియా కూటమి మద్దతు కూడగట్టాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కేంద్రంపై అన్ని వైపుల నుంచీ ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమయ్యారు. పార్లమెంటు సమావేశాల్లో చర్చకు వీలుగా ఇండియా కూటమి ఎంపీలకు.. తెలంగాణలో కులగణన వివరాలు, రిజర్వేషన్ల పెంపు ఆవశ్యకత, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపిన బిల్లులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్.. రెండు, మూడు రోజులు అక్కడే ఉండనున్నారు.

రాహుల్, సీఎంతో కలసి ప్రధానితో భేటీ అవుతాం: ఎంపీ చామల

తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించి, కేంద్రానికి పంపిన బిల్లులపై లోక్‌సభలో గళం విప్పుతామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో ఇండి కూటమి ఎంపీలందరి మద్దతు కూడగడతామని తెలిపారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీలో రాహుల్‌గాంధీతో చర్చిస్తారని, ఇండి కూటమి ఎంపీలతోనూ ప్రత్యేకంగా మాట్లాడతారని వెల్లడించారు. రాహుల్, రేవంత్, భట్టిలతో వెళ్లి మోదీని కలుస్తామని, రాజకీయాలను పక్కనపెట్టి బిల్లులను ఆమోదించాలని కోరుతామని చామల తెలిపారు. ప్రధాని మోదీ ఓబీసీల విషయంలో సానుకూలంగానే వ్యవహరిస్తున్నారని.. బీసీ బిల్లుల విషయంలోనూ సానుకూలంగానే ఉంటారని ఆశిస్తున్నామని చెప్పారు. మెట్రో రెండోదశ విస్తరణ, రీజినల్



రింగు రోడ్డు ఉత్తరభాగం పనులు వేగవంతం చేయడంతోపాటు, మూసీ పునరుజ్జీవనానికి నిధులు ఇవ్వాలని పార్లమెంటులో డిమాండ్ చేయనున్నట్టు తెలిపారు.

భట్టి, ఉత్తమ్‌లతో సీఎం భేటీ

అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లుల విషయంలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌లతో సీఎం రేవంత్ భేటీ అయి చర్చించారు. ఆదివారం సాయంత్రం సీఎం నివాసంలో సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో బీసీ బిల్లుల ఆమోదానికి ఉన్న ప్రాముఖ్యత, రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులు, కులగణన వివరాలు, స్వతంత్ర నిపుణుల కమిటీ అధ్యయనం చేసి చెప్పిన ఫలితాలను కేంద్రానికి వివరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే ఈ అంశంపై రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతో భేటీకావాలని నిర్ణయానికి వచ్చారు. ఇక ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపైనా చర్చించినట్టు తెలిసింది.

రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి నజరానా!

- గాయకుడికి నగదు పురస్కారాన్ని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్వయంకృషితో ఎదిగిన పాతబస్తీ కుర్రోడు.. ప్రముఖ గాయకుడు.. రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ సర్కారు రూ.కోటి నజరానా ప్రకటించింది. పాతబస్తీ బోనాల పండగ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాహుల్‌కు నగదు పురస్కారాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటించారు. పాతబస్తీ కుర్రోడిగా మొదలైన రాహుల్ ప్రస్థానం ఆర్ఆర్ఆర్ సినిమాలో 'నాటు.. నాటు..' పాట పాడడం ద్వారా అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఈ పాటకు ఆస్కార్ పురస్కారం దక్కిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన ఓ కార్యక్రమంలో రాహుల్‌కు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రూ.కోటి నగదు పురస్కారం అందిస్తామనీ చెప్పారు. ఇటీవల గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'ఓల్డ్ సిటీ నుంచి ఆస్కార్ దాకా వెళ్లిన కుర్రోడు' అంటూ రాహుల్‌ను కొనియాడారు. స్వయంకృషితో ఎదిగిన రాహుల్.. తెలంగాణ యువతకు మార్గదర్శకుడని పేర్కొన్నారు. ఆయనకు అందించే పురస్కారంపై త్వరలోనే ప్రభుత్వ ప్రకటన ఉంటుందని చెప్పారు. ఆదివారం పాతబస్తీ బోనాల పండగ సందర్భంగా రాహుల్‌కు రూ.కోటి నజరానాను ప్రకటించి, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

ఎఫ్‌సీఐలో షోకాజ్ నోటీసుల కలకలం

- నాణ్యత లేకపోయినా సీఎంఆర్‌కు గ్రీన్‌సిగ్నల్
- మిల్లర్లతో కొందరు అధికారులు మిలాఖత్
- పొరుగు రాష్ట్రాల ఫిర్యాదులతో నోటీసులు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో అధికారులు, సాంకేతిక సిబ్బందికి జారీ చేసిన షోకాజ్ నోటీసులు కలకలం రేపుతున్నాయి. ప్రజా పంపిణీ కోసం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసిన బియ్యంలో నాణ్యత లోపించిందని, నూకల శాతం ఎక్కువగా ఉందని, రంగు మారిపోయాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు హైదరాబాద్‌లోని ఎఫ్‌సీఐ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల్లోని గోదాముల నిర్వాహకులకు నోటీసులు జారీ అయ్యాయి. రైస్ మిల్లర్లు ఇచ్చిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను తూతూమంత్రంగా పరిశీలించి, గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన టెక్నికల్ అసిస్టెంట్లు, మేనేజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. సంజాయిషీ ఇచ్చే పనిలో వారు నిమగ్నమయ్యారు. సాధారణంగా ఒక టెక్నికల్ అసిస్టెంట్ పాస్ చేసిన బియ్యంలో నాలుగో వంతును మేనేజర్ తిరిగి పరీక్షించాలి. అప్పుడే సీఎంఆర్ బియ్యం గోదాముల్లోకి చేరాలి. ఆ తర్వాత కేంద్రం ఇచ్చే ఇండెంటుకు అనుగుణంగా రైల్వే వ్యాగన్లు లోడ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపించాలి. కానీ, ఎఫ్‌సీఐ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, రైస్ మిల్లర్లతో మిలాఖత్ అయి ఇష్టారాజ్యంగా బియ్యం పాస్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఏపీలోని నెల్లూరు జిల్లాకు తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐ పంపించిన బియ్యం నాణ్యత లేవని, నిజామాబాద్ జిల్లాలోని గొడౌన్లలో రైస్ మిల్లర్లు ఎలా ఇస్తే అలా సీఎంఆర్ బియ్యం తీసుకుంటున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వీటితో పాటు పలు జిల్లాల్లో ఎఫ్‌సీఐ గోదాముల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ఫ్యూమిగేషన్ సరిగా చేయకపోవటం, బస్తాల మధ్యలో పద్ధతి ప్రకారం మందు గోలీలు ఉంచకపోవటం, కొన్నిచోట్ల పురుగులు పట్టి దెబ్బతిన్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ మొదలుపెట్టారు. రైస్ మిల్లర్లు ఇచ్చిన సీఎంఆర్ యథాతథంగా పాస్ చేసి, గోదాములకు తరలించినచోటే సమస్యలు వస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించినచోట రావటంలేదు. ప్రతి ఉమ్మడి జిల్లాలో 5నుంచి 10 మంది వరకు షోకాజ్ నోటీసులు అందుకున్నారు.

గంజాయి తాగితే నరాలు పనిచేయవు.. దూరంగా ఉండండి

- సంగారెడ్డి బోనాల జాతరలో యువతకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హితబోధ
- చెడు అలవాట్లతో తల్లిదండ్రులను బాధపెట్టొద్దు
- గంజాయి, మద్యాన్ని పక్కనబెట్టి భవిష్యత్తు గురించి ఆలోచించాలని పిలుపు
- పోతరాజుల నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య స్టెప్పులేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిత్యం పొలిటికల్ ప్రసంగాలు, ప్రత్యర్థి పార్టీలకు కౌంటర్లు ఇచ్చే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కొత్త పాత్రలో కనిపించారు. సంగారెడ్డిలో ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించిన బోనాల జాతర వేదికగా యువతకు హితబోధ చేశారు. గంజాయి తాగితే నరాలు పనిచేయవని, ఎందుకు పనికిరాకుండా పోతారని సూచించారు. మద్యానికి కూడా దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులను బాధపెట్టకుండా మంచి భవిష్యత్తు కోసం యువత శ్రమించాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. గంజాయితోపాటు మత్తుపదార్థాల జోలికి వెళ్లి తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చవద్దని కోరారు. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని పదేపదే సూచించారు. జగ్గారెడ్డి సందేశాన్ని యువత ఆసక్తిగా విన్నారు. అంతకుముందు సంగారెడ్డి రాంనగర్‌లోని తన ఇంటి నుంచి బోనంతో జగ్గారెడ్డి బయల్దేరారు. తన సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, శివశక్తి నిషా క్రాంతి బోనాలు ఎత్తుకున్నారు. ఈ ఊరేగింపులో పోతరాజు నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య జగ్గారెడ్డి స్టెప్పులు వేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలకు బోనాల పండుగ శుభాకాంక్షలు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు బాగా కురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.



సంగారెడ్డి బోనాల జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

అప్పు తీర్చేందుకు అప్పు

బంగారు రుణాలు చెల్లించటానికి.. ప్రైవేటు బాకీలు

- గతంలో మాదిరిగా లోన్ రెన్యువల్ చేయని బ్యాంకర్లు
- అసలు, వడ్డీ, మొత్తం చెల్లించి ఖాతా మూయాల్సిందే
- ఆ తర్వాత కావాలంటే.. మళ్లీ కొత్తగా అప్పు మంజూరు
- బ్యాంకర్ల నూతన నిబంధనలతో అన్నదాతల అవస్థలు

గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన రైతు మద్దిలేటి.. నిరుడు యూనియన్ బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి 2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఏడాది గడిచింది. లోన్ చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేశారు. గతంలో మాదిరిగా వడ్డీ చెల్లించి, లోన్ రెన్యువల్ చేసుకోవటానికి మద్దిలేటి బ్యాంకుకు వెళ్తే.. అసలుతో సహా వడ్డీ చెల్లించాలని మెలికపెట్టారు.

వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన రైతు వరంగంటి సంతోష్‌కు.. స్థానిక స్టేట్ బ్యాంకులో రూ.5 లక్షల గోల్డ్ లోన్ ఉంది. వడ్డీ చెల్లించి రెన్యువల్ చేస్తానంటే బ్యాంకర్లు ఒప్పుకోలేదు. దీంతో ప్రైవేటు ఫైనాన్స్‌లో అప్పు తీసుకొని అసలు, వడ్డీ కలిపి మొత్తం అప్పు చెల్లించాడు.

ఈ సమస్య ఏ ఒక్కరిదో ఇద్దరిదో కాదు.. రాష్ట్రంలోని అనేక మంది రైతులది. బ్యాంకర్లు నిబంధనలతో పాటు సాఫ్ట్‌వేర్ కూడా మార్చటంతో గోల్డ్ లోన్ తీసుకున్న రైతులకు.. వడ్డీతో సహా అప్పు సహా చెల్లించటం ఇబ్బందికరంగా మారింది. దీంతో లోన్ కట్టడానికి వారు ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించి వడ్డీ వ్యాపారులు రైతుల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. కొందరు రైతులు ప్రైవేటు అప్పు కూడా దొరక్క, బ్యాంకులో లోను రెన్యువల్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. బంగారం తాకట్టుపెట్టి పంట రుణాలు తీసుకున్న రైతులు రాష్ట్రంలో 18 లక్షల మంది ఉన్నారు. గతేడాది వానాకాలం అప్పు తీసుకున్న రైతుల రుణాలు ఇప్పుడు రెన్యువల్‌కు వచ్చాయి. అయితే బంగారం రుణాల విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక నిబంధనలు అమలుచేస్తున్నారు. గతంలో ఏడాదికాగానే బ్యాంకుకెళ్లి లెక్కచూసుకొని, వడ్డీ చెల్లిస్తే లోన్ రెన్యువల్ చేసేవారు. ఇప్పుడు అసలు, వడ్డీ మొత్తం చెల్లించాలనే నిబంధన పెట్టారు. మూడు నెలలుగా దీనిని అమలుచేస్తున్నారు. ఒకసారి బంగారం తాకట్టు పెట్టి రుణం ఇస్తే.. ఆ ఖాతా నంబరును ఏడాదికాగానే మూసేస్తున్నారు. మళ్లీ ఖాతాపై గోల్డ్ లోన్ ఇస్తున్నారే తప్ప.. పాత ఖాతాపై రెన్యువల్ చేయటంలేదు. తాకట్టు పెట్టిన బంగారంపై 9 శాతం వడ్డీ వసూలుబ చేస్తున్నారు. 10 గ్రాముల బంగారానికి రూ.58 వేల చొప్పున అప్పు ఇస్తున్నారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు కాస్త ఎక్కువ కూడా ఇస్తున్నాయి. అయితే ఏడాది కాగానే గోల్డ్ లోన్ పూర్తిగా తీర్చాలనే నిబంధన వల్లే సమస్య వచ్చింది. ఒకవేళ సకాలంలో చెల్లించకపోతే 3 నెలలు చూసి.. తర్వాత 'ఎన్‌పీఏ'(నాన్ పేయింగ్ అకౌంట్) జాబితాలో చేర్చుతున్నారు. అయితే నిర్ణీత వ్యవధిలో వడ్డీతో సహా అప్పు చెల్లించటం రైతులకు ఇబ్బందిగా మారింది. పైగా వానాకాలం సాగు సీజన్‌లో పెట్టుబడికి డబ్బులు సర్దుబాటు చేసుకోవటమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో.. మొత్తం లోన్ ఏకకాలంలో తీర్చటానికి డబ్బులు సర్దుబాటు చేసుకోలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొందరు బ్యాంకర్ల వడ్డీ వ్యాపారం..

'ఇప్పటికైతే అసలు, వడ్డీ మొత్తం చెల్లించండి. కావాలంటే మరుసటి రోజు వచ్చి కొత్తగా అప్పు తీసుకోండి'.. అని బ్యాంకర్లు రైతులకు చెబు తున్నారు. కొందరు బ్యాంకర్లు.. భార్యాభర్తలకు బ్యాంకు ఖాతాలుంటే.. ఒకరి పేరుమీద ఉన్న అప్పును వడ్డీతో సహా వసూలుచేసినట్లు ఎంట్రీ చేసి.. మరొకరి పేరుమీదకు అప్పును మళ్లిస్తున్నారు. ఈ వెసులుబాటు అందరు రైతులకు ఉండటం లేదు. మరికొందరు బ్యాంకర్లు వినియోగదారులతో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. వడ్డీ రేటు మాట్లాడుకొని.. వడ్డీతో సహా అప్పు చెల్లించటానికి సరిపడా సొమ్మును వారి ఖాతాలకు బదిలీచేసి అధిక వడ్డీ తీసుకుంటున్నారు. ఈ వడ్డీ రేటు వందకు నాలుగైదు రూపాయలు ఉండటం గమనార్హం. అయితే ప్రైవేటు అప్పులు అందరికీ దొరక్కపోవటంతో గోల్డ్ లోన్ పూర్తిగా కట్టడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బ్యాంకర్లు ఈ నిబంధన మార్చాలని, వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

ఢిల్లీకి చేరిన పంచాయితీ

బండి వర్సెస్ ఈటల మాటల యుద్ధం.. హైకమాండ్ స్పందనపై ఉత్కంఠ

- నేడు నడ్డాతో రాంచందర్‌రావు భేటీ

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కమలం పార్టీ పంచాయితీ ఢిల్లీకి చేరింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బహిరంగంగా చేసిన తీవ్ర విమర్శలు బీజేపీతోపాటు మిగతా రాజకీయ పక్షాల్లో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.! దీనిపై పార్టీ అధినాయకత్వం ఎలా స్పందించబోతోంది? అనేది ఉత్కంఠంగా మారింది. ఈటలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందా? లేక సంజయ్‌తో సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు కూడా ఢిల్లీ వెళ్తుండడంతో.. అధిష్ఠానం వైఖరి ఆసక్తికరంగా మారిందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఈటల వ్యాఖ్యలకు సంబంధించి రాష్ట్ర పార్టీ ముఖ్యులు వీడియో క్లిప్పింగ్‌లను శనివారమే పార్టీ అధినాయకత్వానికి నివేదించగా, ఆదివారం మరో నివేదికను అందించినట్లు సమాచారం. ఈటల నాలుగేళ్ల క్రితం పార్టీలో చేరినప్పటి నుంచి.. ఆయనకు ఇచ్చిన ప్రాధాన్యతను ఈ నివేదికలో పొందుపరిచారు. "ఈటల రాజేందర్, ఆయన అనుచరులు బీజేపీలో చేరి నాలుగేళ్లయ్యింది. నాటి కేసీఆర్ సర్కారు ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి, కేసులు పెట్టి జైలుకు పంపేందుకు సిద్ధమైతే.. బీజేపీ ఆదుకుంది. పార్టీలో చేర్చుకుని, హుజూరాబాద్ ఉప ఎన్నికలో టిక్కెట్ ఇచ్చింది. ఆయన గెలుపుకోసం పార్టీ శ్రేణులు అహరహం శ్రమించాయి. 3 వేల మంది కాషాయ కార్యకర్తలతో పాటు ఆరెస్సెస్ కార్యకర్తలు, జాతీయవాదులంతా హుజూరాబాద్‌లో ఊరూరా పాగా వేసి.. సొంత ఖర్చుతో తింటూ, సత్రాల్లో, చెట్ల కింద బస చేస్తూ.. ఇంటింటికీ వెళ్లి, ఈటల గెలుపును భుజాన వేసుకుని పనిచేశారు. బీజేపీలో చేరిన కొద్ది రోజులకే ఈటలను ఏకంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఆయనకున్న రాజకీయ అనుభవం, నేతలతో ఉన్న పరిచయాలను దృష్టిలో పెట్టుకుని, ఏకంగా జాయినింగ్స్ కమిటీ బాధ్యతలను కూడా అప్పగించారు. అయితే.. ఒక్క ముఖ్య నేతను కూడా ఆయన బీజేపీలోకి తీసుకురాలేకపోయారు. అటు గజ్వేల్, ఇటు హుజూరాబాద్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించడమే కాకుండా.. కేసీఆర్‌ను ఢీకొట్టడానికి అన్ని విధాలా పార్టీ అండగా నిలిచింది. అయినా రెండు స్థానాల్లో చేదు ఫలితమే మిగిలింది. అయినప్పటికీ గత పార్లమెంట్ ఎన్నికల్లో సునాయసంగా గెలిచే మల్కాజిగిరి టిక్కెట్ ఇచ్చి గెలిపించుకున్నాం" అని ఆ నివేదికలో పేర్కొన్నారు. మరోవైపు, ఈటల అనుచరులకు పదవులు, ప్రాధాన్యత ఇవ్వలేదనే ప్రచారాన్ని తిప్పికొడుతూ.. కరీంనగర్ జిల్లా, మండల, బూత్ కమిటీల జాబితాను పార్టీ జిల్లా నాయకత్వం విడుదల చేసింది. అందులో ఈటల రాజేందర్ అనుచరులకే 60 శాతానికిపైగా పదవులను కట్టబెట్టినట్లు పేర్కొంటూ.. వారి వివరాలను విడుదల చేసింది. కాగా, సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాలు కూడా ప్రారంభం కానుండడంతో.. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు కొంతమంది పార్టీ ఎంపీలు ఆదివారం ఢిల్లీ వెళ్లారు. ఈటల మాత్రం సోమవారం ఉదయం వెళ్లనున్నారు.

నేడు నడ్డాతో రాంచందర్‌రావు భేటీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా సంజయ్, ఈటల మధ్య తలెత్తిన విభేదాల అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుంటారని ఆ వర్గాల తెలిపాయి.

'పునర్విభజన'తో దక్షిణాదికి నష్టం

- అన్యాయం జరగనివ్వబోమని చెప్పే కేంద్ర సర్కార్‌పై మాకు నమ్మకంలేదు
- మేము తెలుగు భాషను ఎవరిపై రుద్దనప్పుడు.. హిందీని ఇతరులపై రుద్దే ప్రయత్నం ఎందుకు?: కేటీఆర్



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణ అద్భుతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గ పునర్విభజనలో తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో నిర్వహించిన టాక్ జర్నలిజం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల తరఫున వారి సమస్యలను పార్లమెంటులో సమర్థంగా వినిపించడానికే రాజ్యాంగంలో నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని పొందుపర్చారన్నారు. జనాభా ఆధారంగా పార్లమెంటులో ఆయా రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం ఉండాలన్న లక్ష్యంతో గతంలో ప్రతి పదేళ్లకు జనగణన, ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టేవారన్నారు. అయితే జనాభా విపరీతంగా పెరగడం కారణంగా 1971లో రాజ్యాంగ సవరణ చేసి లోక్‌సభ స్థానాలను 543కు పరిమితం చేసినట్లు చెప్పారు. 30 ఏళ్ల తర్వాత మళ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేస్తామన్నారని, ఈలోపు దక్షిణ భారతదేశంలో కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసిన కారణంగా ఇక్కడి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశంలేదన్నారు. దీంతో ఉత్తర భారతదేశ ఎంపీల సంఖ్య పెరిగి.. అక్కడి వారి ఆధారంగానే కేంద్రప్రభుత్వం ఏర్పడితే.. దక్షిణ భారతదేశ ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం ఉండదన్న అనుమానం వ్యక్తంచేశారు. అయితే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరగనివ్వబోమని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పే మాటలను తాము నమ్మడం లేదన్నారు. ఎందుకంటే రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎమ్మెల్యే స్థానాల పెంపుపై దృష్టి పెట్టలేదని, బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం జమ్మూకశ్మీర్, అసోం రాష్ట్రాలలో మాత్రం అసెంబ్లీ సీట్లను పెంచిందని ఆరోపించారు. మందబలం, అధికారం ఉందన్న అహంకారంతో జాతీయ భాషగా హిందీని బలవంతంగా రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కేవలం హిందీ నేర్చుకొని అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలకు వెళ్లి ఏమీ చేయలేమని చెప్పారు. తాము ఎవరిపై తెలుగు భాషను రుద్దనప్పుడు వాళ్లు ఎందుకు హిందీని ఇతరులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కాగా, ప్రకృతి సహకరించకున్నా.. పంటల సాగుకు సిద్ధపడ్డ రైతులు యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నారని, వారి కష్టాలను కాంగ్రెస్ సర్కార్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు గంగ్ర వెంకటరమణారెడ్డి, వాసుదేవరెడ్డి ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. ఓవైపు కేంద్రమంత్రి సేంద్రియ వ్యవసాయం చేయాలంటున్నారని, మరోవైపు కేంద్రం నుంచి ఎరువులు వస్తేనే తాము పంపిణీ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం వహించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందే అని వారు విమర్శించారు.

23 నుంచి మోదీ విదేశాల పర్యటన

న్యూఢిల్లీ, జూలై 20: ప్రధాని మోదీ బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదరనుంది. ముందుగా ఈనెల 23, 24 తేదీల్లో ప్రధాని యూకేలో పర్యటిస్తారు. అక్కడ బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో విస్తృతస్థాయి చర్చలు జరుపుతారు. ఈ సందర్భంగా భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. యూకే పర్యటన తర్వాత మోదీ మాల్దీవులకు వెళ్తారు. అక్కడ 26న జరిగే 60వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు 2023లో అధికారంలోకి వచ్చాక మోదీ అక్కడికి వెళ్లడం ఇదే మొదటిసారి. గతేడాది మోదీపై, లక్షదీవులపై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో పాటు, చైనా అనుకూల వైఖరి వల్ల ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మాల్దీవులతో మెరుగైన దౌత్యసంబంధాలు, పరస్పర సహకారానికి ఈ పర్యటన దోహదపడుతుందని విదేశాంగ శాఖ భావిస్తోంది.

త్వరలో స్వదేశీ మలేరియా వ్యాక్సిన్

- 'అడ్‌ఫాల్సీవ్యాక్స్'ను అభివృద్ధి చేస్తున్న ఐసీఎంఆర్

న్యూఢిల్లీ, జూలై 20: మలేరియా రహిత భారత్ దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ప్రాణాంతక మలేరియాను రూపుమాపడానికి స్వదేశీ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఐసీఎంఆర్, భువనేశ్వర్‌లోని ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఆర్ఎంఆర్‌సీబీబీ), జాతీయ మలేరియా పరిశోధన సంస్థ (ఎన్ఐఎంఆర్)... నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ-ఎన్ఐఐ) భాగస్వామ్యంతో అడ్‌ఫాల్సీవ్యాక్స్ అనే రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తోంది. అడ్‌ఫాల్సీవ్యాక్స్ అనేది.. మలేరియాకు కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవిలోని రెండు క్లిష్ట దశలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్న స్వదేశీ మలేరియా వ్యాక్సిన్. ఐసీఎంఆర్ అభివృద్ధి చేస్తున్న ఈ వ్యాక్సిన్ ప్రీక్లినికల్ దశలో అద్భుత ఫలితాలు అందించిందని, ఇప్పటికే ఉన్న సింగిల్ స్టేజ్ వ్యాక్సిన్ల కంటే అడ్‌ఫాల్సీవ్యాక్స్‌తో మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని డేటా వెల్లడిస్తోంది.

'స్లీపింగ్ ప్రిన్స్' అల్ వలీద్ కన్నుమూత

- 2005లో యాక్సిడెంట్‌తో కోమాలోకి సౌదీ యువరాజు

న్యూఢిల్లీ, జూలై 20: గత 20 ఏళ్లుగా కోమాలో ఉన్న సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ (36) కన్నుమూశారు. వలీద్ బిన్ మరణం విషయాన్ని ఆయన తండ్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ ఓ ప్రకటన ద్వారా ధ్రువీకరించారు. గ్లోబల్స్ ఇమామ్స్ కౌన్సిల్ కూడా వలీద్ మృతిపై సంతాపం ప్రకటిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. అల్ వలీద్ బిన్ 'స్లీపింగ్ ప్రిన్స్'గా వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. 2005లో లండన్‌లో ఓ కారు ప్రమాదానికి గురైన ఆయన దాదాపు 20 ఏళ్లుగా కోమాలోనే ఉన్నారు. ప్రముఖ సౌదీ రాజు, బిలియనీర్ ప్రిన్స్ అల్ వలీద్ బిన్ తలాల్ అల్లుడు ఖలీద్ బిన్‌కు పెద్దకుమారుడైన అల్ వలీద్ 1990లో జన్మించారు.


కుమారుడు వలీద్ బిన్‌తో తండ్రి ఖలీద్ బిన్ (ఫైల్)

యూకేలోని ఓ మిలటరీ కాలేజీలో చదువుతుండగా.. 15 ఏళ్ల వయస్సులో ఓ కారు ప్రమాదానికి గురయ్యారు. దీంతో ఆయన మెదడుకు తీవ్రగాయాలతో పాటు అంతర్గత రక్తస్రావమైంది. అప్పటి నుంచి ఆయన కోమా నుంచి బయటకు రాలేకపోయారు. ప్రమాదం తర్వాత వలీద్ బిన్‌ను రియాద్‌లోని ఓ ఆస్పత్రిలో దాదాపు రెండు దశాబ్దాల పాటు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తూ వచ్చారు. ఇక కోలుకొనే అవకాశం లేదని భావించి.. వెంటిలేటర్‌ను తొలగించాలని వైద్యులు సూచించినప్పటికీ, కోలుకుంటాడన్న ఆశతో ఆయన తండ్రి అందుకు అంగీకరించలేదు. ఒకానొక సమయంలో అల్ వలీద్ కొద్దిగా కోలుకుంటున్నట్లు కనిపించారు. చేతి వేళ్లను కొంచెం పైకి లేపడం వంటి సందర్భాలు అతని కుటుంబసభ్యులకు ఆశ కలిగించాయి..

అహ్మదాబాద్ ప్రమాదంపై ఏఏఐబీ చెప్పిందే ఫైనల్

- పశ్చిమ దేశాల మీడియా సంస్థలకు రామ్మోహన్ సూచన

న్యూఢిల్లీ, జూలై 20: పైలట్ల తప్పిదం వల్లే అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిందంటూ పశ్చిమ దేశాల(అమెరికా, ఐరోపా) వార్తా సంస్థలు కథనాలను ప్రసారం చేయడాన్ని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఊహాజనితమైన వార్తా కథనాలను ప్రసారం చేయవద్దని సూచించారు. విమాన ప్రమాదాల దర్యాప్తు విభాగం(ఏఏఐబీ)పై తనకు పూర్తి విశ్వాసం ఉందని, ఏఏఐబీ తుది నివేదిక వచ్చే వరకు ఎలాంటి నిర్ణయానికి రాకూడదని పేర్కొన్నారు. "విమాన ప్రమాదానికి సంబంధించి ఏఏఐబీ చెప్పిందే ఫైనల్" అని స్పష్టం చేశారు. ఏఏఐబీ తన ప్రాథమిక నివేదికను ఇప్పటికే బహిర్గతం చేసిందని కేంద్రమంత్రి గుర్తుచేశారు. "గతంలో బ్లాక్‌బాక్సులో ఏముందో తెలుసుకోవడానికి విదేశాలకు పంపాల్సి వచ్చేది. మొదటిసారిగా ఇండియాలోనే దాన్ని ఏఏఐబీ డీకోడ్ చేసింది" అని ప్రశంసించారు.

టేకాఫ్ కాగానే విమానంలో సాంకేతిక సమస్య

- తిరుపతి-హైదరాబాద్ సర్వీసు రద్దు

రేణిగుంట/శంషాబాద్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ఆదివారం రాత్రి హైదరాబాద్ బయల్దేరిన ఇండిగో విమానంలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య ఏర్పడింది. దాంతో కాసేపు గాల్లో చక్కర్లు కొట్టి.. తిరిగి తిరుపతిలోనే ల్యాండయ్యింది. అనంతరం ఈ సర్వీసును అధికారులు రద్దు చేశారు. హైదరాబాద్ నుంచి ఆదివారం రాత్రి 7.10గంటల సమయంలో తిరుపతికి వచ్చిన ఇండిగో విమానం.. 7.30గంటలకు 200 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయింది. కొంతసేపటికి సాంకేతిక సమస్య తలెత్తడంతో, అర్ధగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టి.. తిరిగి 8గంటలకు రన్‌వేపై ల్యాండ్ అయింది. విమానంలో ఉన్న ప్రయాణికులను వెయిటింగ్ లాంజ్‌లోకి పంపించి 8.30 గంటలకు వారికి బోర్డింగ్ పాసులు అందించారు. కొంతసేపటికి విమానంలో తిరిగి సాంకేతిక సమస్య తలెత్తడంతో సర్వీసును రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించి ప్రయాణికులను వెనక్కి పంపేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు రిఫండ్ చేస్తామని యాజమాన్యం తెలపడంతో వెనుదిరిగారు.



లాల్‌దర్వాజలో అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం; అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం వద్ద మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి

బోనమెత్తిన భాగ్యనగరం

రాష్ట్ర రాజధానిలో వైభవంగా బోనాల వేడుకలు.. అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శివసత్తుల ఊరేగింపులు, పోతరాజుల విన్యాసాలు, తీన్మార్ డప్పులతో స్టెప్పులు, మంగళ వాయిద్యాలు, కోలాటాలు, జానపద గీతాలు.. ఎటు చూసినా భక్త జనసందోహం, సందడే సందడి... వెరసి భాగ్యనగరం ఆదివారం ఆషాఢ బోనల జాతర శోభ సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ హైదరాబాద్ నగర వీధులన్నీ బోనాల ఉత్సవాలతో సందడిగా కనిపించాయి. హైదరాబాద్‌లో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవార్లకు బోనం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అయితే, ప్రధాన ఆలయాల వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. లాల్‌దర్వాజాలోని సింహవాహిని ఆలయం, హరిబౌలి అక్కన్నమాదన్న మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి, గౌలిపురా కోటమైసమ్మ, బేలాచందూలాల్ ముత్యాలమ్మ, మీర్‌ఆలంమండి మహంకాళి, కార్వాన్ దర్బార్ మైసమ్మ, ఎల్‌బీనగర్ ఖిల్లామైసమ్మ తదితర ఆలయాల్లో అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పించింది. లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అక్కన్నమాదన్న ఆలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, గౌలిపురాలో మంత్రి వాకిటి శ్రీహరి, మీర్‌ఆలంమండి ఆలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎల్‌బీనగర్‌లోని ఖిల్లామైసమ్మ ఆలయంలో మంత్రి సీతక్క, ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాలిబండ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రభుత్వం తరఫున మేయర్ విజయలక్ష్మి పట్టువస్త్రాలు సమర్పించారు. లాల్‌దర్వాజాలో పట్టువస్త్రాల సమర్పణ అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.1290 కోట్లు వ్యయం చేస్తోందని తెలిపారు. రాజధానిలోని 2,783ఆలయాల్లో బోనాల నిర్వహణకు రూ.20కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. కాగా, లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ చామల కిరణ్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, డిప్యూటి స్పీకర్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, బీజేపీ నేత లక్ష్మణ్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. బోరబండలోని శ్రీపోచమ్మ ఆలయంలోని అమ్మవారికి సినీ నటి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి బంగారు బోనం సమర్పించగా.. మంత్రులు తుమ్మల, పొన్నం పట్టువస్త్రాలు సమర్పించారు. హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ నివాసంలో జరిగిన బోనాల వేడుకల్లోగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు.


హైదరాబాద్‌లోని మూసాపేటలో చిత్తారమ్మ ఆలయం వద్ద బోనాలతో బారులుతీరిన మహిళలు

గవర్నర్, సీఎం శుభాకాంక్షలు

బోనాల పండుగ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం రేవంత్ వేర్వేరుగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణతోపాటు దేశ ప్రజలందరికీ శాంతి, ఆరోగ్యం, శ్రేయస్సు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. ఇక, జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో మొదలైన ఉత్సవాలు లాల్‌దర్వాజా సింహవాహని అమ్మవారికి బోనం సమర్పించడంతో ముగుస్తాయని పేర్కొన్న సీఎం.. ఉత్సవాలు విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అధికారులు.. ఆర్కిటెక్ట్‌లకే బిల్డ్ నౌ!

- దరఖాస్తుదారులకు నో యాక్సెస్!
- లాగిన్ అయినా కనిపించని ఫైల్
- వివరాలిచ్చినా.. కానరాని సమాచారం
- అధికారులకు పెండింగ్ సమయం ఎత్తివేత

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు, లేఅవుట్ అనుమతులు వేగంగా, పారదర్శకంగా ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు తీసుకొచ్చిన బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ పరిస్థితి విచిత్రంగా మారింది. అధికారులు దరఖాస్తు పరిశీలన ప్రక్రియ అత్యంత వేగంగా సెకన్ల వ్యవధిలో పూర్తవుతోంది. కానీ ఏ అధికారి వద్ద ఎంత సమయం పాటు దరఖాస్తు ఉందనే విషయాన్ని మాత్రం చూపడం లేదు. ఇక దరఖాస్తుదారుకు మాత్రం లాగిన్‌లో సంబంధిత ఫైల్ కనిపించడం లేదు. బిల్డ్‌నౌ 'కీ'ఉన్న ఆర్కిటెక్ట్‌లు, అధికారులకు మాత్రమే దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉందనే విషయం తెలుస్తోంది. దరఖాస్తుదారులకు 'సిటిజన్ సెర్చ్' ఆప్షన్ అందుబాటులో ఉన్నా.. అందులో వివరాలు నమోదు చేసినా ఎలాంటి సమాచారం కనిపించకపోవడం గమనార్హం..! ఆన్‌లైన్‌లో భవన నిర్మాణాలు, లేఅవుట్ అనుమతులను జారీ చేసే ప్రక్రియను దేశంలోనే తొలిసారిగా హెచ్ఎండీఏలో పరిచయం చేశారు. తొలుత డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీపీఎంఎస్) పరిచయమై.. ఆ తర్వాత టీజీబీపాస్‌గా రూపాంతరం చెంది.. ప్రస్తుతం 'బిల్డ్‌నౌ'గా ఈ విధానం కొనసాగుతోంది. టీజీబీపాస్‌లో దరఖాస్తు ఏ అధికారి వద్ద ఎన్ని రోజులుగా పెండింగ్ ఉందో తెలిసేది. రోజులు, గంటలు, నిమిషాలు, సెకన్లతో సహా ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారుడికి కనిపించేది. ఈ వివరాల ఆధారంగానే గతంలో మునిసిపల్ శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, హెచ్ఎండీఏ అధికారులకు దరఖాస్తులను పరిష్కారం చేయకుండా ఏడు రోజులకు పైగా లాగిన్‌లో పెండింగ్ పెడితే.. వారికి జరిమానా విధించేవారు. దాంతో ఏ అధికారి కూడా ఏడు రోజుల్లో దరఖాస్తులను ఆమోదించడమో.. తిరస్కరించడమో చేసేవారు. ఇప్పుడు బిల్డ్‌నౌ అప్లికేషన్‌లో అధికారుల వద్ద ఎంతకాలంగా దరఖాస్తు పెండింగ్‌లో ఉందనే వివరాలు కనిపించడం లేదు. దీన్ని బట్టి.. ఆలస్యం చేసే అధికారులకు జరిమానాలను విధించే విధానాన్ని ఎత్తివేసినట్లు స్పష్టమవుతోంది.

కనిపించని ఫైల్

నిజాంపేటకు చెందిన ఓ వ్యక్తి గ్రౌండ్ ప్లస్ 2 భవన నిర్మాణ అనుమతులకు బిల్డ్‌నౌలో దరఖాస్తు చేశారు. తన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి.. ఆర్కిటెక్ట్ కీ ద్వారా దరఖాస్తును అప్‌లోడ్ చేశారు. అయితే తన దరఖాస్తు ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉందనే సమాచారం మాత్రం ఆయనకు తెలియడం లేదు. మొబైల్‌లో లాగిన్ అయ్యి, పరిశీలిస్తే.. దరఖాస్తే కనిపించడం లేదు. "నో అప్లికేషన్" అని చూపిస్తోంది! సదరు ఆర్కిటెక్ట్ తన 'కీ' ద్వారా లాగిన్ అయితేనే వివరాలు తెలుస్తున్నాయి. ఇక సిటిజన్ సెర్చ్ అనే ఆప్షన్‌ను బిల్డ్ నౌలో పరిచయం చేసినా.. తగిన సమాచారం రావడం లేదు. నామ్‌కేవాస్తే.. అన్నట్లుగా దీన్ని తీసుకువచ్చారనిదరఖాస్తుదారులు విమర్శిస్తున్నారు.

సన్మార్గంలో నడిపించే శక్తి.. సంగీత, సాహిత్యాల సొంతం

- శాంతా వసంతా ట్రస్ట్ పురస్కారాల ప్రదానోత్సవంలో వక్తలు

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సన్మార్గంలో నడిపించే శక్తి సంగీతం సాహిత్యాల సొంతమని వక్తలు అన్నారు. డా. వరప్రసాద్ రెడ్డి నేతృత్వంలోని శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్లో పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీహెచ్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. సాహిత్యం, కళలు, సామాజిక సేవా రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందిస్తున్న డా. వరప్రసాద్ కృషిని కొనియాడారు. మాతృభాషలో విద్యను అభ్యసించిన వారే తమ రంగాల్లో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను అలవరచుకుంటారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వయోలిన్ విద్వాంసుడు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి ఆయన చేతుల మీదుగా సంగీతరత్న పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ రచయిత, కవి ఓలేటి పార్వతీశంను ఉత్తమ సాహితీవేత్త అవార్డుతో సత్కరించారు. ఎమెస్కో ప్రచురణ సంస్థ అధినేత ధూపాటి విజయకుమార్‌కు ఉత్తమ సాహితీ సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం డా. వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... సాధారణ వ్యక్తులను సైతం సంస్కార వంతులుగా తీర్చిదిద్దే శక్తి సంగీత, సాహిత్యాలకు ఉందని.. సాహితీవేత్తలు, కళాకారులను గౌరవించడం తమ బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి జుర్రు చెన్నయ్య, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎంబీఎస్ ప్రసాద్, కార్యదర్శి తొడుపు నూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అదిరిపోయేలా ఐలమ్మ వర్సిటీ

బ్రిటిష్ రెసిడెన్సీ మాదిరిగా భవనాల నమూనాలు.. 'ఆంధ్రజ్యోతి'కి లభించిన ప్రతిపాదిత డిజైన్లు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయ విస్తరణ పనుల ప్రక్రియ వడివడిగా సాగుతోంది. ఇందులో భాగంగా నూతన భవనాలకు సంబంధించి పలు నమూనాలను పరిశీలించగా.. తాజాగా ఒక నమూనాకు అధికారుల ఆమోదం లభించింది. అకడమిక్, హాస్టల్, గెస్ట్‌హౌస్, ఆడిటోరియం భవనాల నమూనాలు ఖరారవడంతో పాటు క్రీడా మైదానం ఎటువైపు ఉండాలన్న దానిని కూడా ఖరారు చేశారు. ఈ మేరకు నిర్మాణాల కోసం తాజాగా టెండర్లను ఆహ్వానించారు. ఆగస్టు మొదటి వారంలో వీటిని ఖరారు చేసి సెప్టెంబరు నుంచి నిర్మాణాలను ప్రారంభించాలని సర్కారు భావిస్తోంది. కొత్త భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.500 కోట్లకు పరిపాలనా అనుమతులను (జీవో ఆర్టీ: 66) మంజూరు చేసింది. అయితే ఇందులో రూ.415కోట్లను విద్యాశాఖ నుంచి తీసుకోనుండగా.. రూ.84.2 కోట్లను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సింగరేణి నుంచి తీసుకోనున్నారు. కాగా, మహిళా వర్సిటీ విస్తరణలో భాగంగా నిర్మించబోయే కొత్త భవనాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి.. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది మార్చి 8న శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయా భవనాల కోసం రూపొందించిన నమూనాలను ఖరారు చేశారు. ఆ ప్రతిపాదిత డిజైన్లు 'ఆంధ్రజ్యోతి'కి లభించాయి.

బ్రిటిష్ రెసిడెన్సీ తరహాలోనే నిర్మాణం..

మహిళా వర్సిటీలో అకడమిక్, ఆడిటోరియం, హాస్టల్ బ్లాకులను ప్రస్తుతమున్న నిర్మాణాల తరహాలోనే చరిత్రను ప్రతిబింబించేలా నిర్మించనున్నారు. అకడమిక్, హాస్టల్, గెస్ట్‌హౌస్, ఆడిటోరియం, వైస్ చాన్స్‌లర్ భవనం, సెంట్రల్ కిచెన్ కలిపి మొత్తం 8,77,668 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. వీటిలో గ్రౌండ్‌తో పాటు 11 అంతస్తులతో నిర్మించనున్న అకడమిక్ బ్లాక్ 3,00,876 అడుగుల్లో ఉంటుంది. హాస్టల్ బ్లాక్‌ను గ్రౌండ్ ప్లస్ 10 అంతస్తులతో 4,95,013 అడుగుల్లో నిర్మిస్తారు. గ్రౌండ్‌తో పాటు ఒక అంతస్తుతో 31,441 అడుగులతో ఆడిటోరియం, జీ ప్లస్ 2 విధానంలో 7,165 అడుగులతో వీసీ భవనాన్ని నిర్మించనున్నారు. 9,356 అడుగులతో జీ ప్లస్ 2 విధానంలో విశ్రాంతి భవనాన్ని నిర్మించనున్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ 12,900 అడుగులు, స్పోర్ట్స్ బ్లాక్‌ను 21,195 అడుగుల్లో నిర్మించాలని ప్రతిపాదించారు. కాగా, నిర్మాణ పనులు రూ.277 కోట్లు, భవనాల సర్వీసుల కోసం రూ.58.69 కోట్లు.. స్థలం అభివృద్ధి, ఫర్నిచర్ పనుల కోసం రూ.44.15కోట్లను వెచ్చించనున్నారు. మొత్తంగా ఈ భవనాల నిర్మాణానికి రూ.500 కోట్లను వెచ్చించనున్నారు. భవిష్యత్తులో ప్రవేశపెట్టబోయే కోర్సులకు కూడా సరిపోయేలా కొత్త భవనాల్లో తరగతి గదులను నిర్మించనున్నారు. జీ ప్లస్ 11 అంతస్తుల్లో 110 తరగతి గదులను ఏర్పాటు చేయనున్నారు. హాస్టల్‌లో దాదాపు 2,160 మంది విద్యార్థులు ఉండేలా గదులను విశాలంగా నిర్మించనున్నారు. ఆడిటోరియంలో ఒకేసారి 1,200 మంది కూర్చునేలా తీర్చిదిద్దనున్నారు. సెప్టెంబరు నుంచి నిర్మాణాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఏయే నెలలో ఎంత మేర పని పూర్తిచేయాలో కూడా అధికారులు లక్ష్యం విధించుకున్నారు.


అకడమిక్ బ్లాక్..

అప్పటి బ్రిటిష్ రెసిడెన్సీ.. ఇప్పటి వర్సిటీ..

ప్రస్తుతం కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ ప్రాంగణంలో ఉన్న భవనాలను 1802లో నిర్మించారు. 1924లో అప్పటి నిజాం మహిళల కోసం ప్రత్యేక కాలేజీ ఉండాలని నాంపల్లిలో జెనీనా ఇంటర్మీడియట్ కాలేజీని ఏర్పాటు చేశారు. తర్వాత దానిని 1933లో డిగ్రీ కాలేజీగా ఉన్నతీకరించి, ఉస్మానియా వర్సిటీకి అనుబంధం చేశారు. 1949లో ఈ కాలేజీని కోఠిలోని బ్రిటిష్ రెసిడెన్సీలోకి మార్చారు. అప్పుడు దీనిని కోఠి మహిళా విశ్వవిద్యాలయంగా పిలిచేవారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పేరును చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీగా మార్చడంతో పాటు పలు కొత్త కోర్సులను తీసుకువచ్చింది.

ధర్మస్థల 'శవాల మిస్టరీ'!

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన మాజీ పారిశుధ్య కార్మికుడి ఫిర్యాదు

100కు పైగా శవాలను పాతిపెట్టారా? నిజాలు నిగ్గు తేల్చేందుకు 'సిట్' ఏర్పాటు

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ధర్మస్థల పరిసరాల్లో వందకుపైగా శవాలను పాతిపెట్టినట్లు వస్తున్న ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి. 1995 నుంచి 2014 వరకు అక్కడ పనిచేసిన ఓ మాజీ పారిశుధ్య కార్మికుడు.. తన చేత అనేక మంది మహిళల, మైనర్ బాలికల మృతదేహాలను బెదిరించి, బలవంతంగా పూడ్చిపెట్టించారని, దహనం చేయించారని ఆరోపిస్తూ చేసిన ఫిర్యాదు కలకలం రేపుతోంది. ఈ మృతదేహాలపై లైంగిక దాడి, హత్యకు సంబంధించిన గుర్తులు ఉన్నాయని పేర్కొనడం మరింత సంచలనంగా మారింది. ఈ ఆరోపణలపై ధర్మస్థల పోలీసులు ఈనెల 3న కేసు నమోదు చేయగా... అసలు ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రణవ్ మహంతి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో అసలు ధర్మస్థలలో ఏం జరిగింది? అని దేశవ్యాప్తంగా పెద్దయెత్తున చర్చ జరుగుతోంది.

అసలేం జరిగింది?

దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకాలోని ధర్మస్థలలో మంజునాథుని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉంది. గతంలో అక్కడ పనిచేసి.. దశాబ్దం పాటు ఎక్కడికో వెళ్లిపోయి.. ఇటీవల బయటకు వచ్చిన ఓ మాజీ పారిశుధ్య కార్మికుడు చేసిన ఫిర్యాదుతో అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ధర్మస్థలలో 1995 నుంచి 2014 వరకు తాను పనిచేశానని, ఆ సమయంలో అనేక మంది మహిళలు, బాలికల మృతదేహాలను ఖననం చేశానని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను బలిపశువును చేశారని, బెదిరించి పాతి పెట్టించారని పేర్కొన్నారు. 2014లో ఓసారి తన కుటుంబంలోని ఒక బాలికపై లైంగిక వేధింపులు జరిగాయని, దాంతో ఆ తర్వాత తాను ధర్మస్థల నుంచి పారిపోయానని తెలిపారు. ఒక దశాబ్దం పాటు ఎక్కడో దాక్కున్న ఆయన.. 2024లో అపరాధ భావంతో తిరిగొచ్చారు. కొన్ని అస్థిపంజరాలను తవ్వి, వాటిని సాక్ష్యాధారాలుగా సమర్పించినట్లు సమాచారం. ఈ నేరారోపణలకు, ధర్మస్థల ఆలయ మేనేజ్‌మెంట్‌లోని ప్రభావవంతమైన వ్యక్తులకు మధ్య సంబంధం ఉందని, వారే నేరాలను కప్పిపుచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

సమగ్ర దర్యాప్తునకు సీఎంపై ఒత్తిడి!

ఈ మొత్తం వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం అవడంతో పాటు వైరల్‌గా మారింది. గత రెండు దశాబ్దాల్లో ధర్మస్థలలో అదృశ్యమైన మహిళలు, బాలికలు కేసులు, అసహజ మరణాలు, హత్యలు, లైంగిక దాడులపై విచారణ జరపాలని కోరుతూ కర్ణాటక మహిళా కమిషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారు. అసహజ మరణాలపై సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆరోపణల విషయంలో ప్రభుత్వం స్పందించాలని, పారదర్శక దర్యాప్తు చేయాలని కోరారు. మరోవైపు ఈ కేసు విచారణ సరైన రీతిలో జరగడం లేదని, దర్యాప్తులో పోలీసులు అలసత్వం వహిస్తున్నారని పలు న్యాయవాద బృందాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కాగా, ఇదే అంశంపై యూట్యూబ్‌లో పలు కథనాలు ప్రచారం చేసిన సమీర్ తాజాగా మరో ఆరోపణ చేశారు. హోంమంత్రి పరమేశ్వర్‌తో ఇటీవల ధర్మస్థలకు చెందిన ఓ ప్రముఖుడు ఎందుకు రహస్యంగా భేటీఅయ్యారని ప్రశ్నించారు. హోంమంత్రి మీడియాతో మాట్లాడిన వేళ మెడికల్ కళాశాలకు సంబంధించిన అంశంపై ధర్మ స్థల సురేంద్ర భేటీ అయ్యారని అన్నారు. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఎవరో చెప్పారన్న కారణంతో సిట్ ఏర్పాటు చేయలేమని వ్యాఖ్యానించిన సీఎం సిద్దరామయ్య.. సామూహిక సమాధి, అదృశ్యాలు, మహిళపై నేరాల ఆరోపణలపై దర్యాప్తునకు తాజాగా సిట్‌ను ఏర్పాటు చేశారు. దీనికి డీజీపీ (అంతర్గ భద్రతా విభాగం) ప్రణవ్ మహంతి నేతృత్వం వహించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.